



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

లోయలో పడ్డ ఆర్మీ వాహనం.. ముగ్గురు జవాన్లు మృతి


పద్మశ్రీ అవార్డు గ్రహీత బాబా శివానంద్ కన్నుమూత

గాజాలో 3,900 మంది పిల్లల ఆకలిచావులు

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 155 | సోమవారం | 05-05-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

● జోహార్లు



మార్క్సిస్టు మహోపాధ్యాయుడు
కారల్ మార్క్స్
207వ జయంతి
(జననం మే 5, 1818
మరణం మార్చి 14,1883)

# చీనాబ్ నదీ జలాలు నిలిపివేత

- బాగ్లీహర్ డ్యామ్ నుంచి పాక్‌కు వెళ్లకుండా చీనాబ్ నదీ జలాలు నిలిపివేసిన భారత్
- కిషన్‌గంగ డ్యామ్ నుంచి జీలం నదీ జలాలనూ పాక్‌కు వెళ్లకుండా స్తంభింపచేసేందుకు ప్రణాళికలు
- ఇప్పటికే సింధూ జలాల ఒప్పందాన్ని రద్దుచేసిన భారత్

**న్యూఢిల్లీ :** పాకిస్థాన్‌ను కట్టడి చేసేందుకు భారత ప్రభుత్వం తీసుకుంటున్న వరుస చర్యల్లో భాగంగా చీనాబ్ నదీ జలాల ప్రవాహాన్ని కూడా నిలిపివేసింది. బాగ్లీహర్ డ్యామ్ నుండి చీనాబ్ నదీ జలాలను పాకిస్థాన్ వైపు ప్రవహించకుండా భారత్ అడ్డుకుంది. సింధుజలాల ఒప్పందాన్ని రద్దుచేసి పాకిస్థాన్‌కు ప్రాణాధారమైన నీటి వనరులపై నిషేధం విధించిన పది రోజుల తర్వాత కేంద్ర ప్రభుత్వం బాగ్లీడ్యామ్ ద్వారా చీనాబ్ నదీజలాల ప్రవాహాన్ని కూడా అడ్డుకుంది. అదేవిధంగా కిషన్‌గంగ డ్యామ్ నుండి జీలం నదీ జలాలను కూడా పాకిస్థాన్‌లోకి ప్రవహించకుండా స్తంభింపజేసేందుకు భారత్ ప్రణాళిక చేస్తున్నది. అనంత్‌నాగ్‌జిల్లా పహల్గామ్‌లో దారుణ హింసాకాండ సృష్టించిన పాకిస్థాన్ పీచమణచేందుకు ఆ దేశానికి వ్యతిరేకంగా భారత ప్రభుత్వం ఇప్పటికే అనేక చర్యలు తీసుకుంది. దౌత్యపరంగా కూడా అనేక ఆంక్షలు విధించింది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల దౌత్యవేత్తలకు కూడా పాకిస్థాన్ చేస్తున్న ఘోర హింసాకాండను వివరించి చెప్పింది. ఆ దేశం నుండి వచ్చే అన్నిరకాల దిగుమతులను రద్దుచేసింది. ఐతే సింధు జలాల ప్రవాహాన్ని స్తంభింపజేయడంపట్ల పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తమ న్యాయమైన నీటి హక్కును యుద్ధం చేసైనా సరే తరువాయి 2లో





## హైకోర్టు జడ్జి గిరిజా ప్రియదర్శిని కన్నుమూత

హైదరాబాద్‌లో నేడు అంత్యక్రియలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ హైకోర్టు జడ్జి గిరిజాప్రియదర్శిని మృతిచెందారు. గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి ఆదివారం తుదిశ్వాస విడిచారు. సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని మహా ప్రస్థానంలో అంత్యక్రియలు జరుగనున్నాయి. 2022 మార్చిలో ఆమె తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా బాధ్యతలు చేపట్టారు. ఆమె మృతిపట్ల న్యాయమూర్తులు, న్యాయవాదులు, పలువురు రాజకీయ నేతలు, ప్రముఖులు సంతాపం తరువాయి 2లో

## నక్సల్స్‌తో చర్చల ప్రసక్తే లేదు..

- లొంగిపోవాల్సిందే..
- శాంతిభద్రతల సమస్యను రాజకీయం చేయడం సరికాదు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్య

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి



మావోయిస్టులతో మాటల్లేవు.. మాట్లాడుకోవడాల్లేవ్.. నిషేధిత సంస్థతో చర్చల ప్రసక్తే లేదు.. వాళ్లు తుపాకీ వీడాల్సిందే.. పోలీసులకు లొంగిపోవాల్సిందే.. వాళ్ల ప్రవర్తన మార్చుకోవాల్సిందే''.. అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. మావోయిస్టు సమస్యను సామాజిక కోణంతో చూడాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆపరేషన్ కగార్‌ను ఆపాలంటూ కెసిఆర్ చేసిన వ్యాఖ్యలపై బండి సంజయ్ ఘాటుగా స్పందించారు. తుపాకులు చేతపట్టి అమాయక ప్రజలను, గిరిజనులను కాల్చి చంపడాన్ని సామాజిక కోణంతో చూడాలనడం ఏం పద్ధతి? బాంబులు (క్లైమోర్ మైన్స్) అమర్చి పోలీసులను తరువాయి 2లో

భారత్ – పాక్ మధ్య ఉద్రిక్తతలు

## ప్రధానితో ఎయిర్ చీఫ్ మార్షల్ భేటీ



**న్యూఢిల్లీ :** అత్యంత భయానక పహల్గామ్ ఉగ్రదాడి కారణంగా భారత్‌పాకిస్థాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతల తీవ్రత పెరిగిపోతున్న నేపథ్యంలో భద్రతా పరిస్థితిపై చర్చించేందుకు ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో భారత వైమానిక దళాధిపతి ఎయిర్‌చీఫ్ ఎపి.సింగ్ భేటీ అయ్యారు. అరేబియా సముద్రంలో కీలకమైన సముద్రమార్గాలలో ఉన్నటువంటి పరిస్థితిని నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వివరించిన 24గంటల తర్వాత ఎయిర్‌చీఫ్ ఎపి.సింగ్ భేటీ ప్రధానితో తరువాయి 2లో

## ఆగని కవ్వింపు చర్యలు

- ఎల్‌ఒసి వద్ద చిన్న ఆయుధాలతో పాక్ దళాలు కాల్పులు
- సమర్థవంతంగా తిప్పికొడుతున్న భారత బలగాలు
- వరుసగా పదవరోజూ కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన



**జమ్ము :** జమ్ముకశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రదాడి తరువాత నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వెంబడి వివిధ సెక్టార్లలో పాకిస్తాన్ దళాలు కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. తాజాగా ఆదివారం కూడా చిన్న ఆయుధాలతో కాల్పులను కొనసాగించాయని, దీనికి భారత సైన్యం ప్రతీకారం తీర్చుకుందని అధికారులు ఆదివారం తెలిపారు. శని, ఆదివారం మధ్య రాత్రి కేంద్రపాలిత ప్రాంతంలోని ఐదు జిల్లాల్లోని ఎనిమిది ప్రదేశాల నుండి పాకిస్తాన్ కాల్పుల విరమణ ఉల్లంఘనకు తరువాయి 2లో



## భారత్ నౌకల ప్రవేశంపై పాకిస్థాన్ నిషేధం

- భారత్ చర్యలకు ప్రతీకారంగా నిర్ణయం
- ఉత్తర్వు తక్షణం అమల్లోకి వస్తుందని ప్రకటన

ఇస్లామాబాద్ : పాకిస్థాన్ ఓడరేవుల్లోకి భారత నౌకలు ప్రవేశించకుండా నిషేధ ఉత్తర్వులు జారీ అయ్యాయి. భారత ఓడరేవుల్లోకి పాకిస్థాన్ నౌకల ప్రవేశాన్ని నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకటించిన తర్వాత పాకిస్థాన్ ప్రభుత్వం కూడా అదే తరహాలో నిషేధ ఉత్తర్వులు ప్రకటించింది. భారత జెండాతో వచ్చే నౌకలను పాకిస్థాన్ ఓడరేవుల్లోకి ప్రవేశించనీయకూడదని ఉత్తర్వులు ఇస్తూ ఈ ఉత్తర్వు తక్షణం అమలులోకి వస్తుందని ఆదివారంనాడు ప్రకటించింది. పాకిస్థాన్ నుండి ఎలాంటి దిగుమతులను అనుమతించకుండా కేంద్రం నిషేధించింది. అదేవిధంగా మన ఓడరేవుల్లోకి పాకిస్థాన్ నౌకల రాకపోకలను కూడా శనివారంనాడు నిషేధించడంతో ఆదివారంనాడు పాకిస్థాన్ ప్రతీకార చర్యలు ప్రకటించింది. ఉగ్రవాదులను, వారికి వెనుక అండగా ఉన్న సూత్రధారులను ఉపేక్షించేదిలేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితులలో సముద్రతల సార్వభౌమాధికారం,ఆర్థిక ప్రయోజనాలు, జాతీయ భద్రతలను దృష్టిలో పెట్టుకుని ఈ నిషేధ చర్యలు తీసుకున్నట్లు సముద్రతల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. ''భారత జెండా ఉన్న నౌకలు పాకిస్థాన్‌లోని తరువాయి 2లో



కాంగ్రెస్ తప్పులకు బాధ్యత వహించడం సంతోషంగా ఉంది

06

నేటి నుంచి 28 మండలాల్లో

## భూ భారతి అమలు

20వ తేదీ వరకు చట్టంపై అవగాహన సదస్సులు : మంత్రి పొంగులేటి వెల్లడి




ప్రజాపక్షం/హైదరాబాద్

''భూభారతి''చట్టాన్ని జిల్లాకు ఒక మండలం చొప్పున 28 జిల్లాల్లోని మండల్లాల్లో అమలు కానుంది. సోమవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు 28 మండలాల్లో రాష్ట్ర ప్రభుత్వం 'రెవెన్యూ అవగాహన సదస్సులను' నిర్వహించనుంది. దీనికి సంబంధించి రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులను స్వీకరించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార,పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గత నెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నాలుగు జిల్లాల్లోని నాలుగు మండలాల్లో రెవెన్యూ అవగాహన సదస్సులు నిర్వహించిన విషయం తెలిసిందే. తాజాగా మరో 28 జిల్లాల్లోని నిర్ధేశించిన 28 మండలాల్లో సదస్సులను నిర్వహించనున్నారు. తెలంగాణ భూ పరిపాలనలో నూతన అధ్యాయానికి నాంది పలికిన భూభారతి చట్టాన్ని దశల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

**'భూ భారతి' అమలవుతున్న 28 మండలాలు ఇవే :** భరోజ్(ఆదిలాబాద్),సుజాతనగర్(భద్రాద్రి కొత్తగూడెం), నడికుడ(హనుమకొండ), బుగ్గారం(జగిత్యాల), ఘన్‌పూర్(జనగాం), రేగొండ(జయశంకర్ భూపాలపల్లి), తరువాయి 2లో

# వేగంగా ఇరిగేషన్ పనులు




కాళేశ్వరం ఖర్చుతో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తయ్యేవి

- నీటిపారుదల రంగాన్ని గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపాటు
- ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.23వేల కేటాయింపు
- 1100 మంది ఇంజనీర్ల నియామకం
- ఎక్స్‌పర్ట్ కమిటీ సూచనల మేరకు ఎస్‌ఎల్‌బిసి పనుల్లో ముందుకు వెళతామని వెల్లడి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ

ఉమ్మడి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు అన్ని నియోజకవర్గాల్లో ఇరిగేషన్ పనులను వేగవంతం చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్పీ కన్వెన్షన్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులు, పౌరసరఫరాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.1.21ల్లో కోట్ల రూపాయలు ఖర్చు చేసి నామమాత్రపు ఆయకట్టుకు సాగునీరు అందించిందని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కంకణం కట్టుకున్నామని, ఇందులో భాగంగా ఈ సంవత్సరం బడ్జెట్‌లో తరువాయి 2లో



## 'లిఫ్ట్'లు పూర్తయితే ఫ్లోరైడ్ రహిత జిల్లాగా నల్లగొండ

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

లిఫ్టు నిర్మాణాలు పూర్తయితే ఫ్లోరైడ్ రహిత ఉమ్మడి నల్లగొండ జిల్లాగా రూపొందుతుందని శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం అన్నారు. ఎత్తిపోతల పథకాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం సత్వరమే చర్యలు చేపట్టాలని సూచించారు. దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలు తరువాయి 2లో

## రష్యాలో వరల్డ్ వార్– 2 విజయోత్సవ సన్నాహం



9న జిన్‌పింగ్ సహా 20 దేశాల నాయకులు రాక

**బీజింగ్ :** మాతృదేశ రక్షణకోసం రష్యా చేసిన మహాయుద్ధం జరిగి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆ దేశంలో బ్రహ్మాండంగా వేడుకలు జరుగుతున్నాయి. ఈ వేడుకలలో పాల్గొనేందుకు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ మే 7 వ తేదీ నుండీ 10వ తేదీ వరకూ రష్యాలో పర్యటిస్తారు. పుతిన్‌తోపాటు ఉత్తర కొరియా దేశాధినేత కిమ్ జోంగ్ కూడా ఈ మేడుకలకు హాజరవుతున్నారు. ఉక్రేన్‌తో జరిగిన యుద్ధంలో ఉత్తర కొరియా సైనికులు కూడా పాల్గొని ప్రాణ త్యాగాలు చేశారు. రెండో ప్రపంచ యుద్ధంలో ఎన్నో త్యాగాలు చేసిన రష్యా జర్మనీపై తుది విజయం సాధించింది. ఈ విజయానికి చిహ్నంగా ఈ వేడుకలు జరుగుతున్నాయి. మే 9వ తేదీన జరిగే ఈ వేడుకలలో దాదాపు 20 దేశాల నాయకులు హాజరవుతారు. చైనాతో పాటు బ్రెజిల్, వెనిజులా, వియత్నా దేశాల నాయకులు ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు. అదే విధంగా ఈ వేడుకలకు ఎలాంటి ఆకటాలు రాకుండా తరువాయి 12లో

## క్రీడా దోపిడీ

- ఆటలకు పనికిరాని గ్రామీణ క్రీడా ప్రాంగణాలు...!
- చెరువుల్లో...అడవుల్లో...పుట్టల్లో... ఏర్పాటు
- ఒక్కో ప్రాంగణానికి రూ.4–8లక్షలు నిధులు
- కోట్లాది రూపాయలు దుర్వినియోగం



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి

ఏ క్రీడాప్రాంగణం చూసినా ఏమున్నది గర్వకారణం... తెలంగాణ క్రీడా ప్రాంగణాలు సమస్తం గత ప్రభుత్వ క్రీడా దోపిడి దారుల, నిధుల దుర్వినియోగం దారుల పరాయణత్వం అన్నట్లుగా ఉంది తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాల దుస్థితి. ప్రతి గ్రామం చివర అలంకార ప్రాయంగా దిష్టిబొమ్మల్లా గ్రామీణ క్రీడా ప్రాంగణాల బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఎక్కడ చూసినా బోర్డులే ఉంటాయి తప్ప అవి క్రీడలు ఆడుకునే విధంగా క్రీడా ప్రాంగణాలుగా తీర్చిదిద్దిన దాఖలాలు ఎక్కడా కనిపించవు. గ్రామీణ యువత చెడుబాటలు పట్టకుండా క్రీడలపై దృష్టి సారించాలని గత బిఆర్‌ఎస్ తరువాయి 12లో

# ప్రపంచం
WORLD NEWS

## 85 సీట్లు గెలుచుకున్న ఆంథోనీ అల్బనీస్



**మెల్‌బోర్న్ :** ఆస్ట్రేలియా ఎన్నికల్లో విజయఢంకా మోగించిన ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ మరోసారి పదవి నిలబెట్టుకున్నారు. పార్లమెంటులో మొత్తం 150 సీట్లకుగాను 85 సీట్లను అధికార సెంటర్ లెఫ్ట్ లేబర్‌పార్టీ గెలుచుకుని ఘన విజయం సాధించింది. ఇంతకుముందు పార్లమెంటులో లేబర్‌పార్టీకి కేవలం 78 స్థానాలు మాత్రమే ఉండేవి. ఈసారి తన బలాన్ని పెంచుకుంది. ఆస్ట్రేలియా ప్రజలు దేశ ఐక్యతకు ఓటు వేశారని అల్బనీస్ ఈ సందర్భంగా జరిగిన బహిరంగసభలో చెప్పారు. పపువా న్యూగినియా ప్రధాన మంత్రి జేమ్స్ మారాపే మొట్టమొదట లారెన్స్ వాంగ్‌కు శుభాకాంక్షలు చెప్పారు. ఆయన తనకు మంచి స్నేహితుడని వాంగ్ అన్నారు. న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ కూడా ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు. బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్, ఫ్రెంచ్ ప్రధానమంత్రి ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ తదితరులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

# గాజాలో 3,900 మంది పిల్లల ఆకలిచావులు



**గాజా :** గాజాలో ఇజ్రాయెల్ అనుసరిస్తున్న మానవ విరుద్ధమైన చర్యల కారణంగా 3,900 మంది పిల్లలు ఆకలిచావులకు బలయ్యారు. మరో 2.90 లక్షల మంది ప్రజలు తిండిలేక చావు అంచుల్లో విహరిస్తున్నారు. ఈ ఏడాది మార్చి రెండో తేదీ నుండి గాజాలోకి ఎలాంటి ఆహార, మానవతా సహాయాన్ని రానివ్వకుండా ఇజ్రాయెల్ సైన్యం అడ్డుకుంటున్నది. ఈ కారణంగా పాలస్తీనాలో హోటళ్లు మూతపడ్డాయి. గోధుమపిండి సహా ఇతర ఆహార దినుసుల తీవ్ర కొరత ఏర్పడింది. ప్రజలు మంచినీళ్లకోసం కూడా వెంపర్లాడుతున్నారు. ఒక్కపూట ఆహారం లభించడం గగనకుసుమంగా మారింది. గాజాలో ఉన్న 20 లక్షలమంది ప్రజలు అధికారం బయట నుండి వచ్చే ఆహారంపైనే ఆధారపడి బ్రతుకుతున్నారు. నీళ్ళు కూడా వారికి బయట నుండి లభిస్తాయి. ఇప్పటికి రెండు నెలలుగా గాజాలోకి ఎలాంటి ఆహారసరఫరా ట్రక్కులను రానివ్వకుండా ఇజ్రాయెల్ సైన్యం అడ్డుకోవడాన్ని ఐక్యరాజ్యసమితి తీవ్రంగా ఖండించింది. దీంతో గాజాలో దాదాపు కరువుకాటక పరిస్థితులు నెలకొన్నాయి. బేబీ ఫార్ములా, న్యూట్రిషన్ సప్లిమెంట్స్ లేక పిల్లలు మరణిస్తున్నారు. ఆసుపత్రులలో సరైన వైద్య సదుపాయాలు లేవు. అన్నిరకాల మానవతాసహాయాన్ని పాలస్తీనాలోకి వెళ్ళకుండా బైడెన్ అడ్డుకున్నది. గాజాలో ఆక్స్‌ఫామ్ ఆహార అధిపతి మహ్మద్ అల్సాక్కా అల్‌జజీరా న్యూస్ ఛానల్‌తో మాట్లాడుతూ, ''దురదృష్టవశాత్తూ యావత్ ప్రపంచం గాజాలో పిల్లల మరణాలకు దోహదం చేస్తోంది, వారు మౌనంగా చూస్తూ కూర్చుంటున్నారు'' అని ఆవేదన వ్యక్తం చేశారు.

**దాడుల్లో 40 మంది మృతి:** పాలస్తీనాలో గడచిన 24 గంటలుగా ఇజ్రాయెల్ సైన్యం చేసిన గగనతల దాడుల్లో 40 మంది మరణించారు. మరో 125 మంది గాయపడ్డారు. గడచిన 19 నెలలుగా ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంలో 52,353 మంది పాలస్తీనా ప్రజలు మరణించారు. శిథిలాలలో మరో 11,000 మంది సమాధిఅయ్యారు. 2023 అక్టోబరు ఏడవ తేదీన హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌లో జరుగుతున్న ఉత్సవంపై దాడి చేసి కాల్పులు జరపడంతో 1200 మంది మరణించారు. మరో 250 మందిని కూడా కిడ్నాప్‌చేసి బందీలుగా తీసుకుపోయారు. ఇక అప్పటినుండి మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. కాగా గాజాలో యుద్ధాన్ని విస్తరించాలా వద్దా అనే విషయంపై ఇజ్రాయెల్ మంత్రివర్గం ఆదివారం పొద్దుపోయిన తర్వాత కీలక నిర్ణయం తీసుకోనున్నది.

**ఇజ్రాయెల్‌పై యెమెన్ క్షిపణులు:** ఇజ్రాయెల్‌పై యెమెన్‌లోని హౌతీ ఉగ్రవాదులు ఆదివారంనాడు క్షిపణి దాడులు చేశారు. ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్‌లోని బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఈ క్షిపణిదాడులు జరిగాయి. దీంతో చాలాసేపు విమానరాకపోకలు నిలిపివేశారు. ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పాలస్తీనాకు మద్దతుగా హౌతీ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నారు. ఎర్ర సముద్రంలో కూడా ఇజ్రాయెల్ దాని మిత్రదేశాల నౌకలపై కూడా దాడులు చేస్తున్నారు. దీంతో ఇజ్రాయెల్ యుద్ధంలోకి దింపకుండా సిద్ధంగా ఉంచిన సైన్యాన్ని కూడా రంగంలోకి దించింది. తమపై చేసిన దాడికి ప్రతీకారం తీసుకుంటామని ఇజ్రాయెల్ ప్రభుత్వం ప్రతిజ్ఞ చేసింది.

# సింగపూర్‌లో అధికారపార్టీ ఘన విజయం

**సింగపూర్ :** సింగపూర్ పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో అధికారపార్టీ తిరిగి ఘన విజయం సాధించింది. మొత్తం 97 సీట్లకు గాను 87 స్థానాలను గెలుచుకుని ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్ తిరిగి పదవి నిలబెట్టుకున్నారు. అధికార పీపుల్స్ యాక్షన్ పార్టీ (పాప్) మెజారిటీకి కావాల్సిన 49 పార్లమెంటు స్థానాల సంఖ్యను దాటేసింది. మొత్తం స్థానాలలో పది సీట్లు మినహా మిగిలిన అన్ని పార్లమెంటు సీట్లను పీపుల్స్ యాక్షన్ పార్టీ గెలుచుకుంది. ఇయో చూ కాంగ్ స్టేడియంలో అధికారపార్టీ నిర్వహించిన సభలో ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్ ప్రజలు హర్షధ్వానాలమధ్య అభివాదాలు తెలియజేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని వాగ్దానం చేశారు. లారెన్స్ వాంగ్ గత ఏడాదిలోనే తండ్రి నుండి అధికారాన్ని సొంతం చేసుకున్నారు. 1965లో మలేసియా నుండి వేరు పడినప్పటినుండీ సింగపూర్‌ను పాలిస్తూ దేశాన్ని ధనికదేశంగా మార్చిన నాయకుడు లీ కుయాన్ యో మనుమడు వాంగ్. ట్రంప్ విధించిన టారిఫ్‌ల బారిన పడింది సింగపూర్.




## రుమేనియా అధ్యక్ష ఎన్నికల్లో సిమియున్ హవా



**బుఖారెస్ట్ :** యూరప్‌దేశం రుమేనియాలో ఆదివారంనాడు అధ్యక్ష పదవికి మొదటిరౌండు ఎన్నికలు జరిగాయి. మొత్తం 11 మంది అభ్యర్థులు అధ్యపదవికి పోటీ పడుతున్నారు. జాతీయవాద ఎయుఆర్ (ఎలయన్స్ ఫర్ ద యూనియన్ ఆఫ్ రుమేనియా) పార్టీ నాయకుడు సిమియున్ విజయం సాధిస్తారని అందరూ అంచనావేస్తున్నారు. 2024 నుండి పార్లమెంటు ఉభయసభల్లోనే ఎయుఆర్ రెండవ అతి పెద్దపార్టీగా కొనసాగుతున్నది. 38 ఏళ్ళ యువకుడు ఆరేళ్ళక్రితమే రాజకీయ రంగ ప్రవేశం చేసిన సిమియున్‌వైపే అందరూ మొగ్గుచూపిస్తున్నారు. సెంట్రల్, ఈస్టర్న్, ఆగ్నేయ యూరప్ చౌరాస్తాలో ఉన్న రుమేనియా చుట్టూ ఉక్రేన్, హంగేరీ, సెర్బియా, బల్గేరియా, మోల్డోవా దేశాలు సరిహద్దుగా ఆవరించుకుని ఉన్నాయి. 1947నుండి 1989 వరకు రుమేనియాలో కమ్యూనిస్టు ప్రభుత్వమే కొనసాగింది. రమేనియాలో ఐదేళ్ళు పదవీకాలానికిగాను రెండు రౌండ్లలో దేశాధ్యక్షుణ్ణి ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. క్లాస్ ఐయోహానిస్ ఈ ఏడాది ఏప్రిల్ 12వ తేదీన తన పదవికి రాజీనామా చేశారు. రాజ్యాంగ కోర్టు కాలిన్ జార్జెస్క్యూ విజయాన్ని రద్దు చేయడంతో దేశంలో తాజాగా అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్నాయి. అయోహానిస్ 2014 నుండి దేశాధ్యక్ష పదవిలో కొనసాగుతున్నారు.

## పాకిస్థాన్ నిషేధం
(మొదటి పేజీ తరువాయి)

ఏ ఓడరేవుల్లోకీ వెళ్ళవు, అదేవిధంగా పాకిస్థాన్ జెండా ఉన్న నౌకలకు భారత్‌లోని ఏ ఓడరేవుల్లోకీ అనుమతి ఉండదు'' అని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఏప్రిల్ 22న దక్షిణ కశ్మీరు అనంతనాగ్‌జిల్లా పహల్గామ్ సమీపంలో పర్యాటకులకు నిషేధిత పాకిస్థాన్ లష్కరే తోయిబా ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను కాల్చి చంపిన తర్వాత పాకిస్థాన్‌పట్ల భారత ప్రభుత్వం కఠినవైఖరి తీసుకుంది. మొదట ఐదు కీలక నిర్ణయాలు తీసుకుని తర్వాత క్రమంగా ఇతరత్రా కూడా ఉగ్రవాదులను కట్టడి చేసేందుకు పాకిస్థాన్‌పై ఆంక్షలను విస్తరిస్తున్నది. 2019లో పాకిస్థాన్ నుండి దిగుమతయ్యే వస్తువులపై 200 శాతం మేరకు దిగుమతి సుంకాలను భారత ప్రభుత్వం విధించింది. పుల్వామాలో ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడి చేసిన తర్వాత కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. తాజాగా పాకిస్థాన్ నుండి ప్రత్యక్షంగా కాకుండా మూడోదేశం నుండి భారత్‌కు వచ్చే పాకిస్థాన్ సరుకులను కూడా కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. ఇదిలా ఉండగా, పాకిస్థాన్ మరోవైపు భారత్‌పై యుద్ధసన్నాహాలను ముమ్మరం చేసింది. క్షిపణి పరీక్షలను చేస్తున్నది. అబదలి ఆయుధ వ్యవస్థను విజయవంతంగా పరీక్షించామని, ఈ వ్యవస్థ భూతలం నుండి భూతలంమీదకు 450 కి.మీ దూరంలో ఉన్న లక్ష్యాలను విజయవంతంగా నాశనం చేయగలదని పాకిస్థాన్ సైన్యం ప్రకటించింది.

## కవ్వింపు చర్యలు
(మొదటి పేజీ తరువాయి)

పాల్పడిందని, కానీ ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. జమ్ముకశ్మీర్ సరిహద్దు వెంబడి నుండి పాక్ దళాలు కాల్పులు జరపడం వరుసగా ఇది 10వ రాత్రి. మే 3, 4 తేదీల్లో రాత్రి, పాకిస్తాన్ ఆర్మీ పోస్టులు కుప్వారా, బారాముల్లా, పూంచ్, రాజౌరి, మెంధార్, నౌషేరా, సుందర్ బాని, జమ్ముకశ్మీర్‌లోని అఖ్నూర్ ఎదురుగా ఉన్న ప్రాంతాలలో ఎల్‌ఓసి వెంబడి చిన్న ఆయుధాలతో కాల్పులు జరిపాయి. భారత సైన్యం వెంటనే స్పందించింది అని రక్షణ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఫిబ్రవరి 25, 2021న భారత్–పాకిస్తాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని పునరుద్ధరించినప్పటి నుండి నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దు (ఐబి) వెంబడి కాల్పుల విరమణ ఉల్లంఘనలు జరగడం చాలా అరుదు. కాగా, భయాందోళనకు గురైన సరిహద్దు గ్రామస్తులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా తమ సామాజిక వసతీగృహాలు, వ్యక్తిగత బంకర్లను నివాసయోగ్యంగా మార్చడానికి ఇప్పటికే శుభ్రపరచడం ప్రారంభించారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత సింధు జలాల ఒప్పందాన్ని భారతదేశం నిలిపివేసిన కొన్ని గంటల తర్వాత, ఏప్రిల్ 24 రాత్రి నుండి, పాకిస్తాన్ దళాలు కశ్మీర్ లోయ నుండి ప్రారంభించి, నియంత్రణ రేఖ వెంబడి వివిధ ప్రదేశాలలో కాల్పులు జరుపుతున్నాయి. కుప్వారా, బారాముల్లా జిల్లాల్లోని నియంత్రణ రేఖ వెంబడి అనేక పోస్టులపై చిన్న ఆయుధాలతో కాల్పులను ప్రారంభించిన పాకిస్తాన్ తన కాల్పుల విరమణ ఉల్లంఘనలను పూంచ్ సెక్టార్‌కు, తరువాత జమ్మూ ప్రాంతంలోని అఖ్నూర్ సెక్టార్‌కు వేగంగా విస్తరింపజేసింది. అటు తర్వాత రాజౌరి జిల్లాలోని సుందర్ బానీ, నౌషేరా సెక్టార్లలో నియంత్రణ రేఖ వెంబడి అనేక పోస్టులపై చిన్న ఆయుధాలతో కాల్పులు జరిపింది. తదనంతరం, కాల్పులు పూంచ్ జిల్లాలోని మెంధార్, జమ్ము జిల్లాలోని పర్గ్వాల్ సెక్టార్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వరకు విస్తరించాయి. భారత, పాకిస్తాన్ డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డిజిఎంఒలు) మధ్య ఇటీవల హాట్‌లైన్ సంభాషణ జరిగినప్పటికీ, తిరిగి కాల్పుల విరమణ ఉల్లంఘనలు జరిగాయి, ఈ సమయంలో భారతదేశం పాకిస్తాన్‌ను హెచ్చరించినట్లు తెలిసింది. ఏప్రిల్ 24న, పాకిస్తాన్ భారత విమానయాన సంస్థలకు తన గగనతలాన్ని బ్లాక్ చేసింది, వాఘా సరిహద్దు క్రాసింగ్‌ను మూసివేసింది, భారతదేశంతో అన్ని వాణిజ్యాన్ని నిలిపివేసింది. నీటిని మళ్లించడానికి చేసే ఏ ప్రయత్నమైనా 'యుద్ధ చర్య'గా పరిగణించబడుతుందని హెచ్చరించింది.

## ప్రసక్తే లేదు
(మొదటి పేజీ తరువాయి)

తునాతునకలు చేసి చంపుతుంటే సామాజిక కోణంతో చూడాలా? అసలు మావోయిస్టులపై నిషేదం విధించిందే కాంగ్రెస్ పాలకులు కదా? ఇప్పుడు సామాజిక కోణం, చర్చలంటూ సన్నాయి నొక్కులు నొక్కడమేంది? ఎంతో మంది ప్రజలను, గిరిజనులను, పోలీసులను కాల్చి చంపినప్పుడు మీకు ఈ విషయం గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో మావోయిస్టులపై విధించిన నిషేదాన్ని ఎత్తివేసే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా? అని సవాల్ విసిరారు. కరీంనగర్‌లోని కొత్తపల్లిలో ఆదివారం హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సంధర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఆపరేషన్ కగార్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. పాకిస్తాన్ పౌరులను తిరిగి పంపే అంశంపై ప్రభుత్వం ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు ఆదేశాలిచ్చిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ విషయంలో తూతూ మంత్రంగా చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. ఇప్పటికీ చాలా మంది పాస్‌పోర్టు, వీసాల్లేకుండా ఇక్కడ నివసిస్తున్నట్లు సమాచారముందని, రోహింగ్యాలు చాలా మంది ఇక్కడే నివసిస్తున్నారని, రోహింగ్యాలపై వైఖరిని తెలియజేయాలన్నారు. దీనిని శాంతిభద్రతల సమస్యగా చూడాలే తప్ప మతం కోనంతో, రాజకీయ లబ్ది కోణంతో చూస్తే హైదరాబాద్ టెర్రరిస్టులకు అడ్డాగా మారే ప్రమాదముందనే విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చి వారం రోజులైనా చర్యలెందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ కులగణన సర్వేకు, మోదీ కులగణనకు పొంతనే ఉండదన్నారు. కాంగ్రెస్ కులగణనతో బిసిలకు తీవ్ర అన్యాయం జరిగిందని, 52 శాతం జనాభా ఉన్న బిసిలను 46 శాతంగా చూపారని, 42 శాతం రిజర్వేషన్లు బిసిలకు అమలు చేస్తున్నామని చెప్పి అందులో నుంచి 10 శాతం రిజర్వేషన్లు ముస్లింలకు కేటాయించారన్నారు. మాజీ మేయర్ సునీల్‌రావు, విగ్రహదాత గుంటుక వంశీధర్, మాజీ చైర్మన్ రుద్ర రాజు, మాజీ ఎంపిపి వాసాల రమేష్, పొన్నం సత్యనారాయణ, స్వర్గం నర్సయ్య, అనుమల్ల సత్యనారాయణ, వేముల చంద్రశేఖర్, కెంచ శేఖర్, చిట్కూరి శ్రీనివాస్,దాడి సుధాకర్, ఆలయ కమిటీ నాయకులు తదితరులున్నారు.

## నల్లగొండ
(మొదటి పేజీ తరువాయి)

అత్యధిక ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలని, డిండి ఎత్తిపతల పథకం పూర్తి చేస్తే ఈ రెండు నియోజకవర్గాలు సస్యశ్యామలమవుతాయని, శివన్నగూడెం రిజర్వాయర్ నుంచి నారాయణ్‌పూర్ వరకు లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయాలని, ఉదయ సముద్రం కింద కృష్ణంపల్లి వరకు కాల్వలు పొడిగించాలని కోరారు. అదేవిధంగా మునుగోడు నియోజకవర్గంలో ఇటీవలకాలంలో ఫార్మా కంపెనీలు వస్తున్నాయని భూగర్భజలాలు కలుషితమై పంటల దిగుబడి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కెమికల్ ఫ్యాక్టరీలకు అమనుమతులు ఇవ్వవదన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి తాగునీరు అందేలా చూడాలన్నారు. సన్న బియ్యం పంపిణి చారిత్రాత్మక నిర్ణయం అని ఈ పథకం పేద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

**ఎమ్మెల్సీ సత్యంను సన్మానించిన సీపీఐ నాయకులు:** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం లోని ఎస్పీ కన్వెన్షన్‌లో ఆదివారం జరిగిన నీటిపారుదలశాఖల సమస్యలు, వరి సేకరణ, సన్న బియ్యం పంపిణిపై జరిగిన వివిధశాఖల అధికారులకు నిర్వహించిన సమీక్షా సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను సీపీఐ నాయకులు ఘనంగా సన్మానించారు. నియోజకవర్గంలో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సన్మానించిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శులు ఎండి.సయ్యద్, జిల్లా యాదగిరి, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వల్లంపట్ల వెంకన్న, మండల సహాయ కార్యదర్శి పోలెపల్లి ఉదయ్, వెన్నెల వెంకన్న, బంటు రాజేశ్వరి, బుచ్చయ్య ఉన్నారు.

## భూ భారతి అమలు
(మొదటి పేజీ తరువాయి)

ఇటిక్యాల్(జోగులాంబ గద్వాల్), సైదాపూర్(కరీంనగర్), పెంచికల్పేట్ (కొమరంభీం ఆసిఫాబాద్), దంతాలపల్లె (మహబూబాబాద్), మూసాపేట్ (మహబూబ్‌నగర్), భీమారం(మంచిర్యాల), చిల్పిచిడ్(మెదక్), కీసర(మేడ్చల్ మల్కాజిగిరి), పెంట్లవల్లి(నాగర్‌కర్నూల్), నకిరేకల్ (నల్లగొండ), కుంతాల(నిర్మల్),మెండోరా(నిజామాబాద్), ఎలిగేడ్(పెద్దపల్లి), రుద్రంగి(రాజన్న సిరిసిల్ల), కుందుర్గ్(రంగారెడ్డి), కొండాపూర్ (సంగారెడ్డి), అక్కన్నపేట(సిద్దిపేట), గరిడేపల్లే(సూర్యాపేట), ధరూర్(వికారాబాద్), గోపాలపేట(వనపర్తి), వర్ధన్నపేట్(వరంగల్),ఆత్మకూర్ (యాదాద్రి భువనగిరి).

**ధరణి దందాలకు గత ప్రభుత్వ పెద్దల అండదండ : మంత్రి పొంగులేటి**

గత ప్రభుత్వపెద్దలే ధరణి దందాలకు అండదండలుగా నిలిచారని రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ప్రజల ఆలోచనలకు భిన్నంగా గత పదేళ్లకాలంలో రాష్ట్రంలో భూ హక్కుల విధ్వంసం జరిగిందని,రైతులకు రెవెన్యూ సేవలు దుర్భరంగా మారాయని మండిపడ్డారు. ఈనెల 5వ తేదీ నుంచి 20వ తేదీవరకు జిల్లాకొక మండలం చొప్పున 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా కోణంలో తీసుకొచ్చిన ఈ భూభారతి చట్టంపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడంతో పాటు. ఆయా మండలాల్లో భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వాటిని పరిష్కరించడమే రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశమని వివరించారు. ప్రతి కలెక్టర్ రెవెన్యూ సదస్సులకు హాజరై, అక్కడ రైతులు, ప్రజలు లేవనెత్తే సందేహాలకు వారికి అర్ధమయ్యే భాషలో వివరించి,వాటికి పరిష్కారం చూపాలని సూచించారు. రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ఎంతో అధ్యయనంతో తీసుకొచ్చిన భూ భారతి చట్టాన్ని క్షేత్ర స్థాయికి సమర్థంగా తీసుకెళ్లాలని కలెక్టర్లకు మంత్రి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సమాజంలో భూమి కీలకమైన అంశమని, గత ప్రభుత్వం చేసిన తప్పిదాలతో రాష్ట్రంలో ప్రతి గ్రామంలో వందల కుటుంబాలు భూ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక కుట్రపూరితంగా, దురుద్ధేశ్యంతో తీసుకొచ్చిన ధరణితో ప్రజలు అవస్థలు పడుతున్నారని, ధరణి ప్రజల జీవితాలను ఆగమాగం చేసిందని,ఎన్నో రైతు కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని విమర్శించారు.రైతుల కళ్లల్లో ఆనందం చూడాలనే సంకల్పంతోనే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, ఈ చట్టాన్ని తీసుకురావడం ఒక ఎత్తు అయితే, దీనిని అమలు చేయడం మరో ఎత్తు అని, ప్రజలు , ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరి సహకారంతో విజయవంతంగా అమలు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో భూ సమస్యలపై కోర్టుకెళ్లడం తప్ప మరో మార్గం ఉండేదికాదని, కానీ ఇందిరమ్మ ప్రభుత్వంలో అధికార యంత్రాంగమే రైతుల వద్దకు వచ్చి వారి సమస్యలను పరిష్కరిస్తుందని మంత్రి పొంగులేటి తెలిపారు.

## నిలిపివేత (మొదటి పేజీ తరువాయి)

సాధించుకుంటామని ప్రతిజ్ఞ చేసింది. సింధుజలాలను పాకిస్థాన్ లోకి రాకుండా ఆపేయడం యుద్ధంతో సమానమని ఆ దేశ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. జమ్మూ రాంబన్‌లో ఉన్న బాగ్లీహర్ డ్యామ్ నుండి, ఉత్తర కశ్మీరు కిషన్‌గంగ నుండి నీటిని విడుదల చేయకుండా నియంత్రించగల సామర్థ్యం భారత్‌కు ఉందని సంబంధిత వర్గాలు తెలియజేశాయి. భారత్–పాకిస్థాన్ మధ్య బాగ్లీహర్ డ్యామ్ గురించి దీర్ఘకాలంగా వివాదం కొనసాగుతున్నది. ఈ విషయంలో ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వాన్ని కూడా పాకిస్థాన్ కోరింది. ఇప్పటికే కిషన్‌గంగ డ్యామ్‌తో న్యాయపరమైన సమస్యలు, దౌత్యపరమైన పరిశీలనలు జరుగుతున్నాయి. ప్రత్యేకించి జీలంనదికి ఉపనదిగా ఉన్న నీలం నదిపై ప్రభావం ఉన్నకారణంగా ఈ దౌత్యపరమైన పరిశీలన,తనిఖీలు జరుగుతున్నాయి. ఈ నదులు భారతదేశం లోంచి పాకిస్థాన్‌లోకి ప్రవహిస్తున్నాయి. అందువల్ల వీటిని పాకిస్థాన్‌దేశం తమకు ఈ నదులు జీవనదులని పేర్కొంటున్నది. సాగునీటికి, త్రాగునీటికి వీటిపైనే పాకిస్థాన్ ప్రధానంగా ఆధారపడుతున్నది. ఈ పరిస్థితులమధ్య గడచిన పది రోజులుగా పాకిస్థాన్ సైన్యాలు సరిహద్దుల నుండి కాల్పుల ఉల్లంఘన చర్యలకు పాల్పడుతున్నాయి. మరోవైపు పాకిస్థాన్ మాజీ మంత్రి బిలావల్ భుట్టో భారత్‌కు ఒక హెచ్చరిక చేస్తూ, సింధునదీ జలాల ప్రవాహాన్ని గనుక భారతదేశం పాకిస్థాన్‌కు రాకుండా అడ్డుకుంటే రక్తప్రవాహం జరుగుతుందని అన్నారు. ''సింధునది జలాలు ప్రవహించి వచ్చే మా సుక్రూ నగరంలో సింధు నది ఒడ్డున నిలబడి నేను చెబుతున్నా, సింధునది మాది, ఈ నది మాతోనే ఉంటుంది, ఈ నదీ జలాల ప్రవాహాన్ని గనుక భారత్ ఆట్టుకుంటే ఆ నదిలో వారి రక్తం ప్రవహిస్తుంది'' అని బిలావల్ భుట్టో హెచ్చరించారు.

## ఎయిర్ చీఫ్ మార్షల్ భేటీ
(మొదటి పేజీ తరువాయి)

జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఎయిర్ చీఫ్ సమావేశమైన విషయాన్ని అధికార వర్గాలు చెప్పినప్పటికీ ఎలాంటి తదుపరి వివరాలు ఇవ్వలేదు. మోదీసింగ్ భేటీ అయిన విషయంపై ఇప్పటివరకూ అధికారికంగా వెల్లడించలేదు. ఏప్రిల్ 22న కశ్మీర్‌లోయలోని పహల్గామ్ ఉగ్రదాడిలో 26మంది ప్రజలను కాల్చిచంపిన తర్వాత జరిగిన క్రాస్‌బార్డర్ సంబంధాలను వివరిస్తూ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షిస్తామని భారత్ వాగ్దానం చేసిన విషయం తెలిసిందే. అయితే గత మంగళవారం రక్షణ శాఖ ఉన్నతాధికారులతో జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉగ్రదాడిపై సమయానుకూలంగా స్పందించి లక్ష్యాన్ని ఛేదించేందుకు 'పూర్తిస్థాయి ఆపరేషనల్ స్వేచ్ఛ'ను సైనిక బలగాలకు ఇచ్చిన విషయం విదితమే. ఉగ్రవాదాన్ని తీవ్రంగా దెబ్బతీయాలనే జాతీయ సంకల్పంతో ప్రభుత్వం ఈ ఉగ్రవాద సమస్యను పరిష్కరిస్తుందని నరేంద్రమోదీ ఇటీవల ఉద్ఘాటించారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ కూడా పాకిస్థాన్‌పై గట్టిచర్యలకు ఉపక్రమించింది. సింధూ నీటి ఒప్పందాన్ని రద్దు సహా అట్టారీ సరిహద్దు వద్ద భారత్ భూభాగంలోకి పాక్ జాతీయులు ప్రవేశించకుండా గేట్ మూసివేసి దౌత్యసంబంధాలను కుదించింది.ఇండియన్ ఎయిర్ లైనర్లకు పాకిస్థాన్ గగనతలంలో ప్రయాణాలను, భారత్‌తో వాణిజ్య సంబంధాలను రద్దుచేసిన నేపథ్యంలో భారత్‌కూడా అంతే దీటుగా పాకిస్థాన్‌కు సమాధానం ఇచ్చింది. జాతీయ భద్రత, పబ్లిక్ పాలసీని దృష్టిలో ఉంచుకుని పాకిస్థాన్ నుంచి భారత్‌లోకి దిగుమతి అవుతోన్న అన్ని వస్తువులపై భారత్ పూర్తి నిషేధం విధించింది.పాకిస్థాన్‌నుంచి అన్ని పోస్టల్ సర్వీసులను న్యూఢిల్లీ కూడా సస్పెండ్ చేసింది.అంతేకాకుండా భారతదేశం ఓడరేవులలోకి పాకిస్థాన్ షిప్పుల ప్రవేశాన్ని భారత్ నిషేధించిన విషయం తెలిసిందే.

## కన్నుమూత (మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. కాగా, జస్టిస్ గిరిజాప్రియదర్శినిది ఏపిలోని విశాఖపట్టణ ప్రాంతం. ఈమె 1995లో లాయర్గా ఎన్రోల్ అయ్యారు. విశాఖ జిల్లా కోర్టులో ఏడు సంవత్సరాలు ప్రాక్టీస్ చేశారు. 2008లో తొలిసారిగా అదనపు జిల్లా జడ్జిగా బాధ్యతలు చేపట్టారు. ఖమ్మం, విజయనగరం, నంద్యాల కోర్టుల్లో జడ్జిగా పనిచేశారు. 2017లో ఒంగోలు జిల్లా కోర్టు చీఫ్గా పదోన్నతి పొందారు. ఆ తర్వాత తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా కోర్టు చీఫ్ జడ్జిగా పనిచేశారు. తెలంగాణ హైకోర్టు జడ్జిగా బాధ్యతలు స్వీకరించే కంటే ముందు.. గిరిజా ప్రియదర్శిని.. రాష్ట్ర లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీగానూ పనిచేశారు.

**ఐఎఎల్ సంతాపం**

గిరిజా ప్రియదర్శని భౌతిక కాయానికి ఆమె నివాసంలో ఐఎఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, జాతీయ కార్యవర్గ సభ్యుడు కె. రామ్మూర్తి నివాళి అర్పించారు. ఆమె మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## వేగంగా ఇరిగేషన్ పనులు (మొదటి పేజీ తరువాయి)

రూ.23వేల కోట్లను ఇరిగేషన్‌కు కేటాయించడం జరిగిందన్నారు. దీంతో పాటు 1100 మంది ఇంజనీర్లను కేటాయించి నీటిపారుదలశాఖ బలపడేలా ముందుకెళ్తున్నామని చెప్పారు. పూడిక కారణంగా నీటి నిల్వ సామర్ద్యం తగ్గిపోయిన అన్ని ప్రాజెక్టుల్లో పూడికతీత పనులను చేపడుతున్నామని, ప్రత్యేకించి నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూడికతీత పనులు కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. ఎస్ఎల్‌బీసీ పనులను ముందుకు తీసుకెళ్లేందుకు జాతీయ స్థాయిలో చర్చించి ఒక ఎక్స్‌పర్ట్ కమిటీని వేసి ఆ కమిటీ సూచనల మేరకు పనులను ముందుకు తీసుకెళ్తున్నామని, త్వరలోనే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వం డిండి ప్రాజెక్టును చాలాకాలం నిర్లక్ష్యానికి గురి చేసిందని, అలాంటిది తాము అధికారంలోకి రాగానే రూ.1800కోట్ల రూపాయలు కేటాయించి టెండర్లు పిలిచి పనులను మొదలు పెట్టామన్నారు. అలాగే గంధమల్ల, ఉదయ సముద్రం ప్రాజెక్టులను అవసరమైన నిధులు కేటాయించి పనులను చేపట్టడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం కాళేశ్వరంపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించి కట్టినప్పటికీ అది కూలిపోయిందని, కాళేశ్వరంపై పెట్టిన ఖర్చు అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు సరిపోయేదని అన్నారు. సీతారామ ప్రాజెక్టుకు 67 టీఎంసీల గోదావరి జలాలను కేటాయించడం జరిగిందన్నారు. ఇరిగేషన్ శాఖలో లస్కర్ల కొరతను తీర్చేందుకుగాను ప్రతి సీఈ కింద 50 నుంచి 100 లస్కర్లను అవుట్‌సోర్సింగ్ పద్దతిపై నియమించుకునేందకు జిల్లా కలెక్టర్లకు అధికారాలు ఇవ్వడం జరిగిందని, మొత్తం 1800 పోస్టులను 33 జిల్లాలకు కేటాయించామని తెలిపారు. నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఆర్ అండ్‌ఆర్ భూసేకరణను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌ఆర్ కమీషనర్ వినయ్‌కృష్ణారెడ్డిని మంత్రి ఆదేశించారు. పౌరసరఫరాలపై సమీక్షిస్తూ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యధిక ధాన్యం పండించిన రాష్ట్రంగా నిలిచిందని, గత సీజన్‌లో 66.70లక్షల ఎకరాల్లో 153.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించగా ఈ రబీ సీజన్‌లో 55లక్షల ఎకరాల్లో 127లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని పండించి మొత్తం 280లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని పండించి దేశంలోనే అధిక ధాన్యం పండించిన రాష్ట్రంగా మిగిలిపోయిందన్నారు. దీంతోపాటు సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నామని, యాసంగి ధాన్యం కొనుగోలుకు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోని జిల్లా యాంత్రంగాలను అప్రమత్తంగా చేశామన్నారు. సన్న బియ్యం పంపిణి దేశంలోనే చారిత్రాత్మక మార్పు అని, 80 నుంచి 84శాతం జనాభాకు ఉచితంగా ప్రతి మనిషికి ఆరు కిలోల సన్న బియ్యాన్ని ఇస్తున్నామన్నారు. గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యం అక్రమ వ్యాపారానికి ఉపయోగపడేదని, జనాలు తినడానికి ఉపయోగపడలేదని దీనిపై సన్న బియ్యంపై రూ.13వేల కోట్లు ఖర్చు పెడుతున్నామని తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫి శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి, బ్రాహ్మణ వెల్లంల వంటి కాలువలను సైతం పూర్తి చేయలేదని తాము అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాజెక్టులను అవసరమైన నిధులు కేటాయించి చేపట్టడం జరిగిందని, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు వల్ల చుట్టుపక్కల భూగర్భజలాలు పెరిగాయన్నారు. ఆర్‌అండ్‌బి శాఖ ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అత్యధికంగా 1700 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రోడ్లపై రూ.150కోట్లు ఖర్చు పెట్టేలా నిర్ణయం తీసుకోవడం జరిగిందని, అలాగే మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి జూలైలో రహదారుల నిర్మించేలా నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న చౌకధర దుకాణాల పోస్టులన్నింటిని వెంటనే భర్తీ చేయాలని, 15రోజుల పాటు సన్న బియ్యం పంపిణీ చర్యలు చేపట్టాలని పౌరసరఫరాల శాఖ మంత్రికి ఆయన సూచించారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎండాకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాజెక్టుల కింద నిర్వహణ కోసం నిధులు కేటాయించాలని, ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, శివన్నగూడెం కింద కిష్టాపురం వరకు కాల్వలు పొడగించినట్లయితే ఆ చుట్టుపక్కల ప్రాంతానికి సాగునీరు అందుతుందని, ఎస్ఎల్‌బీసీ లైనిగ్ రూ.422కోట్లు ప్రభుత్వం కేటాయించిందని, అయితే రానున్న కాలంలో ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తయితే ఉదయ సముద్రం కింద ఆయకట్టు పెరగడం వల్ల మొత్తం సుమారు మూడు లక్షలకు పైగా ఆయకట్టు పెరగనున్న దృష్ట్యా కాల్వ లైనింగ్‌తోపాటు కాల్వలను వెడల్పు చేయాలని, తరువాత లైనింగ్ పూర్తి చేయాలని సూచించారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గంధమల్ల ప్రాజెక్టు కింద భూసేకరణ పెండింగ్‌లో ఉందని, భూములు కోల్పోయిన రైతులకు ధర విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పిలాయిపల్లి, ధర్మారెడ్డికాల్వల పనులను పూర్తి చేయాలని కోరారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న నాలుగు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరుతూ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు కింద కిష్టాపురం వరకు కాల్వను పొడగించాలని మునుగోడు నియోజకవర్గంలో 148 గొలుసుకట్టు చెరువులు నిర్వహణ లేకపోవడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయాయని, వీటికి మరమ్మతులకు బడ్జెట్ కేటాయించాలని, మునుగోడు ప్రపంచంలోనే అత్యధిక ఫ్లోరైడ్ పీడిత ప్రాంతమని, అందువల్ల ఇరిగేషన్ విషయంలో ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో చింతపల్లి, కిష్టంపల్లి కింద భూసేకరణ కొనసాగుతుందని, నక్కలగండి రిజర్వాయర్ సెంటర్లు పూర్తి చేయాలని, పెల్లిపాకాల రిజర్వాయర్ నిధులు ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని మంజూరు చేయించాలని, పొగిళ్ల, కొంకలపల్లి, అంబా భవాని, ఏకేబీఆర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి అటవీ సమస్యలు ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించి పనులు పూర్తి చేసేలా చూడాలని కోరారు. నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లికల్ లిఫ్టు ఇరిగేషన్ స్టేజ్‌టు సంబంధించిన అనుమతులు వెంటనే ఇప్పించాలని, నిడమనూరు చెరువును నింపుకునేందుకు అనుమతి ఇవ్వాలని, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కింద ఎత్తిపోతల గురించి ఆలోచించాలని, జంగిల్ క్లియరెన్స్‌కు సంబందించి పెండింగ్‌లో ఉన్న కోటి 20లక్షల రూపాయలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ దున్నపోతుల గండి భూసేకరణ పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర పౌరసరఫరాల ప్రిన్సిపాల్ సెక్రటరీ డీఎస్.చౌహాన్ పౌరసరఫరాల శాఖపై జరిగిన సమీక్ష సందర్భంగా ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. రాష్ట్ర ఆర్‌అండ్ ఆర్, సమాచార పౌరసంబంధాల శాఖ ఇన్‌చార్జి కమీషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఆర్‌అండ్‌ఆర్‌కు సంబందించిన సమస్యలపై సమాధానాలు ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల సమీక్షా సందర్భంగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, ఇతర సమస్యలకు సంబందించి వివరణలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, రాష్ట్ర నీటి పారుదలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్‌బొజ్జ, ఇంజనీరింగ్ ఇన్ చీఫ్‌లు శ్రీనివాసరావు, అహ్మద్ హుస్సేన్, కలెక్టర్లు తేజస్ నందలాల్‌పవార్, హనుమంతరావు, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## నేడు రాష్ట్రంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పర్యటన

ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ నేడు తెలంగాణలో పర్యటించనున్నారు. కాగజ్‌నగర్, హైదరాబాద్‌లో జాతీయ రహదారులు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 9 గంటలకు నాగ్‌పూర్ ఎయిర్ పోర్టు నుంచి హెలికాప్టర్‌లో సిర్పూర్ కాగజ్ నగర్‌కు చేరుకోకున్నారు. ఆయనకు రాష్ట్రమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్వాగతం పలకనున్నారు. కాగజ్‌నగర్‌లో ఉదయం 10.30 నుంచి 11.30 వరకు జాతీయ రహదారుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 11.45కు కాగజ్ నగర్ నుంచి కన్హా శాంతివనంకు బల్దేరుతారు. మధ్యాహ్నం 1 గంట నుంచి మధ్యాహ్నం 3.30 వరకు కన్హా శాంతివనంను సందర్శిస్తారు. సాయంత్ర 4 గంటలకు బిహెచ్‌ఇఎల్ ఫ్లై ఓవర్‌ను ప్రారంభోత్సవం చేస్తారు. సాయంత్ర 5 గంటలకు అంబర్‌పేట ఫ్లైఓవర్ విజిట్ అండ్ ప్రారంభోత్సవం. సాయంత్రం 6 గంటలకు అంబర్‌పేట్ గ్రౌండ్‌లో సభలో పాల్గొననున్నారు. పలు ప్రాజెక్టులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేస్తారు. రాత్రి 7 గంటలకు తిరిగి బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఢిల్లీకి బయల్దేరి వెళ్తారు.

### కమ్యూనిస్టు యోధుడు
# గురుప్రసాదరావుకు ఘన వీడ్కోలు

నివాళులర్పించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, మంత్రి తుమ్మల





ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : సిపిఐ సీనియర్ నాయకుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు యోధుడు, కొత్తగూడెం ప్రాంతానికి చెందిన ప్రముఖ న్యాయవాది ఆళ్ల గురుప్రసాదరావుకు సిపిఐ, ప్రజాసంఘాల శ్రేణులు, అభిమానులు, న్యాయవాదులు ఘన వీడ్కోలు పలికారు. 93 ఎళ్ల గురుప్రసాద్ వృద్ధాప్యంతో బాధపడుతూ విశాఖపట్నంలోని తన బంధువుల గృహంలో మృతి చెందగా అయన భౌతికకాయాన్ని ఆదివారం పార్టీ శ్రేణులు, ప్రజల సందర్శనార్థం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌కు తరలించారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంత రావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, కార్యవర్గ సభ్యులు బి.అయోధ్యతోపాటు పలువురు ప్రముఖులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు వై.ఉదయ్‌భాస్కర్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో కూనంనేని మాట్లాడారు. గురుప్రసాదరావు ఉత్తమ కమ్యూనిస్టు అని, తన తుదిశ్వాస వరకు ప్రజా సేవకే అంకితమయ్యారని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించారని, ఈ ప్రాంతంలో పార్టీ నిర్మాణం, విస్తరణకు శక్తివంచన లేకుండా కృషి చేశారని, అనేక మందిని నాయకులుగా తీర్చిదిద్ది కమ్యూనిస్టు పార్టీకి అందించారన్నారు. న్యాయవాదిగా పేదలపక్షం వహించాడని, మానవతావాదిగా నిస్వార్థంగా పేదవర్గాల సేవలందించాడని, అయన మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని అన్నారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కొత్తగూడెం, పరిసర మండలాల్లో రాజాకీయాలను ప్రభావితం చేసిన వ్యక్తి గురుప్రసాద్ అని, ప్రజా ఉద్యమాలతో కమ్యూనిస్టు పార్టీ ప్రతిష్టను, జిల్లా ప్రతిష్టను పెంచిన వ్యక్తి గురుప్రసాద్ అని, ఎలాంటి పదవులను ఆశించకుండా కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు కృషి చేశారని, అయన మృతి కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలను తీరని లోటని, అమర నేతల ఆశయాల సాధన దిశగా ప్రతిఒక్కరూ కృషిచేయాలని అన్నారు. అనంతరం శేషగిరిభవన్ నుంచి కొత్తగూడెం వైద్య కళాశాల వరకు జనసందోహం నడుమ అంతిమయాత్ర జరిగింది. కుటుంబ సభ్యుల కోరిక మేరకు గురుప్రసాద్ భౌతికకాయాన్ని వైద్యవిద్యార్థుల పరిశోధన నిమిత్తం కొత్తగూడెం వైద్య కళాశాలకు అప్పగించారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, మున్నా లక్ష్మీకుమారి, నరాటి ప్రసాద్, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, తాటి వెంకటేశ్వర్లు, పాకలపాటి పెద్దబ్బాయి, ప్రముఖ వైద్యులు రమేష్ బాబు, రామ్మోహనరావు, పట్టాభి, లాయర్స్ అసోసియేషన్ నాయకులు లక్కినేని సత్యనారాయణ, రాధాకృష్ణ, కోటం రాజు, ఎల్లంకి వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యులు వంగ వెంకట్, జి.వీరాస్వామి, వి.మల్లికార్జున్ రావు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, వి.పూర్ణదందర్ రావు, కందుల భాస్కర్, భూక్యా దస్రు, గెడ్డాడు నగేష్, కొమారి హన్మంతరావు, మునిగడప వెంకటేశ్వర్లు, రాహుల్, ఫహీమ్, పోలమూరి శ్రీనివాస్, కె.రత్నకుమారి, సిపిఎం నాయకులు లిక్కి బాలరాజు వున్నారు.

**చేకూరి కాశయ్య కాంస్య విగ్రహ ఆవిష్కరణ**
ఆదివారం కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్లో మాజీ ఎమ్మెల్యే, గురుదక్షిణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చేకూరి కాశయ్య కాంస్య విగ్రహాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కొత్తగూడెం శాసనసభ్యులు సాంబశివరావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ప్రసంగించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ, చేకూరి కాశయ్య నిబద్ధత గల నిజాయితీ గల నాయకుడని, ఆయన కొత్తగూడెం ప్రాంతానికి చెందినవాడు కావడం మనకెంతో గర్వకారణమని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, రాజకీయాలకతీతంగా అందరికీ సుపచరితుడు చేకూరి కాశయ్య విగ్రహాన్ని కొత్తగూడెం నడిబొడ్డులో విగ్రహ ఏర్పాటుచేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, బిక్కసాని నాగేశ్వర రావు, తాళ్లూరు వెంకటేశ్వరరావు, చేకూరి వెంకట్, వాసిరెడ్డి ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, రుక్మందర్ బండారి, అన్వర్ పాషా, కొట్టి వెంకటేశ్వర్లు, నాగబాబు, గౌస్, హుస్సేన్, మజీద్, బొమ్మిడి రమాకాంత్, బంధుగుల శ్రీధర్, బి.శీను, హైమత్ వినోద్, సురేందర్, ఆవునూరు చంద్రయ్య, దూడల కిరణ్, జానీ, అశోక్, నగేష్, వాసు మల్ల గౌతం తదితరులు పాల్గొన్నారు.

# పశ్య కన్నమ్మ సేవలు చిరస్మరణీయం

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి





ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : భారతదేశ స్వాతంత్ర సమరయోధురాలు,తెలంగాణ సాయుధ పోరాట వీర నారి కామ్రేడ్ పశ్య కన్నమ్మ సేవలు మరువలేనివని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఐదు రోజుల క్రితం అనార్యోగ కారణాల చేత మృతి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు పశ్య కన్నమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కమ్యూనిస్టు కుటుంబం అనగానే గుర్తుకువచ్చేది పశ్య రాంరెడ్డి కుటుంబం అన్నారు. ఆయన సతీమణిగా పశ్య కన్నమ్మ సిపిఐ సిద్ధాంతానికి అనుగుణంగా జీవితాంతం పేద ప్రజలు, మహిళల పక్షాన పోరాటం చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ, ప్రియదర్శిని విద్యాసంస్థల కరస్పాండెంట్ పశ్య శ్రీనివాసరెడ్డి, సిపిఐ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**రాజ్యాంగబద్ధ నిర్ణయాలను స్వాగతిద్దాం :**
భారతదేశ ప్రభుత్వం తీసుకునే రాజ్యాంగబద్ధమైన నిర్ణయాలను స్వాగతిద్దామని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యవస్థను నష్టపరిచే భావజాలాన్ని వామపక్ష పార్టీ సమర్థించదన్నారు.
ఉగ్రవాద దాడులను అన్ని పక్షాలలాగే మానవతావాదానికి వ్యతిరేకమైన హింసను ఖండిస్తున్నట్లు తెలిపారు. తుపాకుల ద్వారానే చరిత్ర మారుతుందనే సిద్ధాంతానికి తాము వ్యతిరేకమన్నారు. ప్రతి విషయానికి చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని సిపిఐ నమ్ముతుందన్నారు. కర్రెగుట్ట ఆపరేషన్‌ను వెంటనే నిలుపుదల చేయాలని, అక్కడున్న మావోయిస్టులతో శాంతియుతంగా చర్చలు జరిపి కేంద్ర ప్రభుత్వం ఎన్‌కౌంటర్‌లను నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి అజయ్ నాయక్, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన, జిల్లా ప్రధానకార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొడ్డ వెంకటయ్య, కౌలురైతుసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, యల్లావుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బేషరతుగా మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు జరపాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపడానికి ముందుకు రావాలని తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. ఆదివారం పోచంపల్లిలో ఓ శుభకార్యానికి ఎమ్మెల్సీ హోదాలో మొదటిసారిగా వచ్చిన ఆయనకు సిపిఐ మండల కార్యదర్శి గోడళ్ళ భూషణ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత పోచంపల్లికి రావడం ఇక్కడి ప్రాంత వాసుల ప్రేమను చూరగొనడం సంతోషంగా ఉందని ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు పబ్బు యాదయ్య, పట్టణ కార్యదర్శి మిర్యాల కృష్ణమూర్తి, రైతు సంఘం నాయకులు సర్కంటి సాయిలు, మండల సహాయ కార్యదర్శి ముసునూరి రాములు, నాయకులు వలందాసు సోమయ్య, వంగరి నరసింహ, చింతకుంట్ల బుచ్చిరెడ్డి, గుర్రు బాలయ్య, సంగెం గణేశ, మూషం శివ, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురుమిద్ద శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని బాలయ్య, మార్కండేశ్వర స్వామి, దేవాలయం చైర్మన్ సీత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## క్రీడలు, సంగీతంతో మానసిక ప్రశాంతత

త్యాగరాజ స్వామి జయంతి ఉత్సవాల్లో మంత్రి జూపల్లి

ప్రజాపక్షం/హైదరాబాద్ : టీవి, ఫోన్ల వల్లే నేటి యువత ఒత్తిడికి గురవుతున్నారని, క్రీడలు, సంగీతంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం ఎల్‌బిస్టేడియంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రముఖ వాగ్గేయకారులు త్యాగరాజస్వామి జయంతి ఉత్సవాల్లో జూపల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ విద్వాంసులు ఆలపించిన గాన కచేరిని ఆయన విన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. పలు కీలకవ్యాఖ్యలు చేశారు. త్యాగయ్య రచించిన పంచరత్నాలను వింటూ త్యాగయ్యని స్మరించుకోవడం ఎంతో గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. గ్రామగ్రామాన త్యాగరాజ స్వామి కీర్తనలకు బహుళ ప్రచారం కల్పించడానికి తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక కృషి చేస్తామని చెప్పారు. ప్రముఖ సంగీత విద్వాంసులు ఆలపించిన త్యాగరాజ కీర్తనలు అలరించాయని మంత్రి వెల్లడించారు.

# నేటి నుంచి "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు"




బృందానిక నలుగురు చొప్పున 150 బృందాలు ఏర్పాటు
దక్షిణ తెలంగాణ మండలాల్లో 100 బృందాలు,
ఉత్తర, మధ్య తెలంగాణ మండలాల్లో 50 బృందాలు పర్యటన
మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్ : వ్యవసాయాన్ని పూర్తిగా లాభాసాటిగా మార్చడం ద్వారా అరుగాలం శ్రమించే అన్నదాతలకు ఆర్థిక భరోసాతోపాటు కొండంత అండగా నిలిచేందుకు ప్రభుత్వం చేపట్టిన "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం నేటి నుంచి ప్రారంభం కానుంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం చెందిన 200 మంది శాస్త్రవేత్తలు, విద్యార్థులు కలిపి నలుగురు చొప్పున ఒక బృందంగా, మొత్తం 150 బృందాలుగా ఏర్పడి మొత్తం 1200 గ్రామాల్లో పర్యటించనున్నారు. మే 5 (నేటి) నుంచి ప్రారంభం కానున్న ఈ కార్యక్రమం జూన్ 13 వరకు కొనసాగనుండగా, దక్షిణ తెలంగాణ మండలాల్లో సుమారు 100 బృందాలు, ఉత్తర, మధ్య తెలంగాణ మండలాల్లో సుమారు 50 బృందాలు పర్యటించనున్నాయి. ప్రతి బృందం వారానికి ఒక్క గ్రామం చొప్పున 6 వారాల పాటు 6 గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులను నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించేందకు గాను వ్యవసాయశాఖ నుంచి ప్రత్యేకంగా నోడల్ అధికారుల ప్రభుత్వం నియమించింది.

**వారంలో ఒక రోజు చొప్పున ప్రతి బృందం 6 గ్రామాలు పర్యటన :**
ఈ బృందాలు వారంలోని పని దినాలలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎంపిక చేసుకున్న గ్రామాలలో పర్యటించనున్నాయి. ఆయా గ్రామాల్లో రైతు వేదికలు గాని, మరే ఇతర సౌకర్యవంతమైన ప్రదేశంలోగాని రైతులకు యూరియా వాడకం తగ్గించడం, రసాయనాలను జాగ్రత్తగా వాడటం, చెల్లింపు రశీదులను భద్రపరచడం, సాగు నీటి ఆదా, పంటల మార్పిడి, చెట్లను పెంచటంపై అవగాహన కల్పించనున్నాయి. ఒక్కో బృందం వారు రోజూవారి కార్యక్రమాన్ని నిర్వహించడంతోపాటు, రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సవాళ్ళకు సూచనలు సలహాలు అందజేయనున్నాయి. ఇద్దరు శాస్త్రవేత్తలు, ఇద్దరు పరిశోధన విద్యార్థులు, నలుగురితో కూడిన బృందంతో వ్యవసాయ విద్యార్థులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఇతర స్థానిక ప్రభుత్వ అధికారులు, అభ్యుదయ రైతులు, సంఘాలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులను కూడా భాగస్వామ్యం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయంలోని అన్ని వ్యవసాయ కళాశాలలు, పాలిటెక్నిక్స్, వ్యవసాయ పరిశోధనా సంస్థలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాలు, వ్యవసాయ శాఖ సహకారంతో నిర్వహించనున్నారు. విశ్వవిద్యాలయంలోని ఉన్నత స్థాయి అధికారులతో పాటు వివిధ మండలాల్లోని సహ పరిశోధనా సంచాలకులు, కళాశాలల డీన్లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు.

**రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి తుమ్మల**
నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల శ్రేయస్సు కోసం, రైతులకు వ్యవసాయ సంబంధిత వివిధ అంశాలపై అవగాహన కల్పించేదిశగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. రైతన్నలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నడం ద్వారా వ్యవసాయ సంబంధిత అంశాలపై గల అనుమానాలను శాస్త్రవేత్తల ద్వారా నివృత్తి చేసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సూచించారు.
ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా శాస్త్రవేత్తలకు విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అన్నదాతలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. తద్వారా మరిన్ని నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంటుందని మంత్రి వెల్లడించారు.



## ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి : టిజిఇ జాక్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేదంటే జూన్ 9వ తేదీ నుంచి ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల, కార్మికుల పెన్షనర్స్ ఐక్య కార్యాచరణ సమితి(టిజిఇ జాక్) హెచ్చరించింది. 'ఈనెల 15న హైదరాబాద్‌తో సహా అన్ని జిల్లాలలో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని, జూన్ 9న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్క్ వద్ద ప్రదర్శన, మహాధర్నా నిర్వహిస్తామని సదస్సు తీర్మానించింది. అప్పటికి ప్రభుత్వం స్పందిచకపోతే నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతంచేస్తామని, మానవహారం, ప్రభుత్వ కార్యాలయాల ముందు సాముహిక భోజనాలు, రాష్ట్ర వ్యాప్తంగా పెన్‌డౌన్, సామూహిక సెలవులు ప్రకటించాలని సదస్సు నిర్ణయించింది. 'టిజిఇ జాక్' రాష్ట్ర సదస్సు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. ఈ సదస్సుకు 33 జిల్లాల నుండి జెఎసి ప్రతినిధులు పాల్గొన్నారు. ఉద్యోగులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. యుద్ధ ప్రాతిపదికన పెండింగ్ బిల్స్‌ను క్లియర్ చేయాలని, ఐదు కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని, వేతన సవరణ కమిటీ నివేదికను వెంటనే తెప్పించుకుని, 51 శాతం ఫిట్‌మెంట్, ఉద్యోగుల ఆరోగ్యం రక్షణ పథకాన్ని అమలు చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని సదస్సులో తీర్మానించారు. ఈ సదస్సులో టిజిఇజాక్ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు,అదనపు ప్రధాన కార్యదర్శి పి.దామోదర్ రెడ్డి, కోచైర్మన్లు జి.సదానందంగౌడ్, చావారవి, మధుసూధన్‌రెడ్డి, వి.రవీందర్‌రెడ్డి, దాస్యా నాయక్, ఎన్.తిరుపతి, వైస్‌చైర్మన్ ఎం.చంద్రశేఖర్‌గౌడ్,తిప్పర్తి యాదయ్య, అంజిరెడ్డి, ఉమారెడ్డి, డిప్యూటీ సెక్రెటరీ జనరల్ ఎస్.ఎస్.హుస్సేని(ముజీబ్) పాల్గొన్నారు.

# నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం

నేడు వెంపటి సూర్యనారాయణ సంస్మరణ



వెంపటి సూర్యనారాయణ ఐదు దశాబ్దాల పాటు ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో తరచూ వినిపించిన పేరు. కార్యకర్తగా, నాయకునిగా ఏ బాధ్యత అప్పగించినా నిబద్ధతతో, నిజాయితీతో పనిచేసి కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు బలోపేతానికి కృషి చేశాడు. వైరా మండలం గొల్లెనపహాడ్ గ్రామంలో రైతాంగ కుటుంబంలో జన్మించిన వెంపటి సూర్యనారాయణ పిన్న వయస్సులోనే నాడు జరుగుతున్న స్వాతంత్ర్య సంగ్రామంలో పాలుపంచుకున్నాడు. పలు ఆందోళనల్లో పాల్గొన్నారు. అభ్యుదయ భావాలు కలిగిన సూర్యనారాయణ కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులయ్యారు. కమ్యూనిస్టు పార్టీ చీలిన సమయంలో సిపిఎం వైపు మొగ్గిన ఆయన తిరిగి మాతృ సంస్థలో చేరి కార్మికవర్గ సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేశారు. నల్లమల గిరిప్రసాద్, మహ్మద్ రజబ్‌అలీ, పువ్వాడ నాగేశ్వరరావు, దొండపాటి వెంకయ్య, చావా వెంకటేశ్వరరావు, తాళ్లపల్లి రాములు, పారుపల్లి పుల్లయ్య, కర్నాటి కృష్ణయ్య, వాసిరెడ్డి వెంకటపతి, వెంపటి రాంకోటయ్య, తుళ్లూరి పెద్దసత్యం తదితరులతో కలిసి ఆయన పనిచేశారు. 1967లో మహ్మద్ రజబ్‌అలీ తదితరులు సిపిఎం నుంచి సిపిఐలో చేరేందుకు మిగిలిన పార్టీ బాధ్యులతో కలిసి సూర్యనారాయణ కృషి చేశారు. 1967 శాసనసభ ఎన్నికల సందర్భంగా పార్టీలో చేరక ముందే మహ్మద్ రజబ్‌అలీకి కంకి కొడవలి గుర్తుపై పోటీ చేసే అవకాశం కల్పించడంలో సూర్యనారాయణ కీలక భూమిక పోషించారు. రజబ్ అలీ గెలుపు కోసం అదే రీతిలో కృషిచేశారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శిగా సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం కృషిచేసిన సూర్యనారాయణ ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్అండ్‌బి తదితర సంస్థల్లో యూనియన్‌ను స్థాపించి బలమైన సంఘంగా తీర్చిదిద్దారు. సంఘ సభ్యులకు ఏ ఇబ్బంది కలిగినా తాను ఉన్నానంటూ వాలిపోయేవాడు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యునిగా పార్టీ ఏ ప్రాంతంలో పనిచేసే బాధ్యత అప్పగించినా ఆ ప్రాంతంలో పనిచేస్తూ అందరి ప్రశంసలు పొందేవాడు. కొత్తగూడెంలో పనిచేస్తున్నప్పుడు సిద్ధి వెంకటేశ్వర్లును పాల్వంచ ప్రాంతంలో నాయకునిగా తీర్చిదిద్దడంలోనూ సిపిఐని బలమైన పార్టీగా నిలపడంలోనూ ఆయన కృషి మరువలేనిది. జర్నలిస్టుగా పనిచేసేందుకు కొత్తగూడెంకు వచ్చిన కూనంనేని సాంబశివరావుకు స్థానిక పరిస్థితులను వివరించడమే గాక సిపిఐతో అనుబంధం ఏర్పడి నాయకునిగా ఎదిగేందుకు అవకాశం కల్పించారు. ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యునిగా అప్పటి జిల్లా కార్యదర్శి టివి చౌదరికి సంపూర్ణ సహాయ సహకరాలను అందించిన ఆయన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిగా అప్పట్లో కూలీ రేట్ల పెంపు కోసం గ్రామ గ్రామాన సభలు, సమావేశాలు నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షునిగా సైతం పనిచేశారు. పార్టీ నిధి సేకరణ విషయంలో సూర్యనారాయణ అందరికీ ఆదర్శం. నిధి సేకరణ కోసం గ్రామ గ్రామాన తిరుగుతూ నిధి వసూలు చేయడమే గాక ఆ నిధిని పార్టీ కార్యాలయానికి చేర్చేవరకు బాధ్యతగా వ్యవహరించే వారు. 1970, 1980 దశకాల్లో సాగిన భూ పోరాటాల్లో వెంపటి సూర్యనారాయణ కీలక భూమిక పోషించారు. పంచె కట్టుతో నిండైన రూపం గల సూర్యనారాయణ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారుల తోడ్పాటు పొందే విషయంలోనూ ఆయనది ప్రత్యేకశైలి. చాలా కాలం సుదూర ప్రాంతాల్లో పార్టీ కార్యక్రమాల కోసం బస్సులోనే ప్రయాణించిన సూర్యనారాయణ ఆ తర్వాత టివిఎస్ మోపెడ్‌పై తిరిగేవారు. నిండు నూరేళ్ల పరిపూర్ణ జీవితాన్ని గడిపిన ఆయన స్వాతంత్ర్య సమరయోధునిగా, కమ్యూనిస్టు పార్టీలో శ్రామికజన నేతగా పేరొందారు. కుటుంబ సభ్యులను సైతం తన మార్గంవైపే నడిపించారు. వెంపటి ప్రకాష్, వెంపటి అరుణ్ లు ఎఐటియుసిలో పనిచేశారు. ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు పార్టీ విస్తరణ, నిర్మాణంలో తనదైన ముద్ర వేసిన ఆయన ఇప్పటి ఆర్థిక స్థితిగతులను అప్పుడే వివరిస్తూ పార్టీ శిక్షణా తరగతుల్లో అర్థశాస్త్రం బోధించే వారు. ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు పార్టీపై తనదైన ముద్ర వేసిన సూర్యనారాయణ అమరుడు, ధన్యజీవి. ఆయన మార్గం సదా అనుసరణీయం.

**మాట కరుకు... మనస్సు సున్నితం : కూనంనేని సాంబశివరావు**
వెంపటి సూర్యనారాయణతో నాకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉండేవి. నేను మొదటి విశాలాంధ్ర విలేకరిగా కొత్తగూడెం వచ్చినప్పుడు పార్టీ నిర్మాణ బాధ్యతల్లో ఆ ప్రాంతంలో ఉన్న ఆయన నన్ను ఇంటికి పిలిచి అప్యాయంగా మాట్లాడడంతోపాటు స్థానిక పరిస్థితులను, కమ్యూనిస్టు పార్టీ పంథాను వివరించారు. ముఖ్యంగా పాల్వంచ ప్రాంతంలో సిద్ది వెంకటేశ్వర్లు, నూతి వెంకట్రావు, వీసంశెట్టి వెంకటేశ్వర్లును కమ్యూనిస్టు పార్టీ నాయకులుగా తీర్చిదిద్ది ఆ ప్రాంతంలో బలమైన కమ్యూనిస్టు పార్టీని నిర్మించడంలో విశేష కృషి చేశారు. సమస్యల పట్ల తన అభిప్రాయాన్ని నిష్కర్షగా ఉండే సూర్యనారాయణ ముక్కుసూటిగా వ్యవహరించే వారు. ఆయన మాట మాత్రం కరుకుగా ఉండేది కానీ మనస్సు మాత్రం సున్నితం.
నేను ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేస్తూ ఎదిగేందుకు సహకరించిన అనేక మందిలో సూర్యనారాయణ ఒకరు. వారి కుటుంబంతో నాకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉండేవి. వారి కుటుంబ సభ్యులు కూడా కమ్యూనిస్టు భావాజలంతో పనిచేయడం అభినందనీయం. నేను సిపిఐ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించడంలోనూ సూర్యనారాయణ కీలక భూమిక పోషించారు. మరణించి ప్రజల మధ్య జీవించే అరుదైన వ్యక్తులలో సూర్యనారాయణ ఒకరు. సంస్మరణ సందర్భంగా విప్లవజోహార్లు అర్పిస్తూ ఆయన ఆశయ సాధనకు పునరంకితమవుతూ ...




# మతవాదాన్ని ధిక్కరించిన ఆజాద్

మతవాదాన్ని నరనరాన జీర్ణించుకున్న బంగ్లాదేశ్ వంటి దేశంలో, మతానికి వ్యతిరేకంగా గళం విప్పే సాహసం అతి కొద్దిమందిలోనే ఉంటుంది. అలాంటి అరుదైన వారిలో ప్రముఖ కవి, నవలా రచయిత, విమర్శకుడు, భాషావేత్త, కాల మిస్టు హుమాయున్ ఆజాద్ (28 ఏప్రిల్ 1947–12 ఆగస్టు 2004) ఒగరు. ఢాకా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేసిన ఆజాద్ నవలలు, కథలతోపాటు 70కి పైగా వ్యాసాలు రాశారు రాశారు. బెంగాలీ భాషాశాస్త్రానికి ఆయన చేసిన కృషికిగాను 1986లో ఆయనకు బంగ్లా అకాడమీ సాహిత్య పురస్కారం లభించింది. 2012లో, బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆయనకు మరణానంతరం 'ఎకుషే పదక్'ను ప్రకటించింది. బిక్రం పుల్‌లోని రార్హిఖల్ గ్రామంలో జన్మించిన ఆజాద్ అసలుపేరు హుమా యున్ కబీర్. ఈ గ్రామం ప్రస్తుతం మున్షిగంజ్ జిల్లాలోని శ్రీనగర్ పరి ధిలో ఉంది. ప్రముఖ శాస్త్రవేత్త జగదీష్ చంద్ర బోస్ కూడా అదే గ్రామంలో జన్మించాడు. ఆజాద్ 1962లో సర్ జగదీష్ చంద్ర బసు ఇన్‌స్టిట్యూట్ నుండి సెకండరీ పరీక్ష, 1964లో ఢాకా కళాశాల నుండి హయ్యర్ సెకండరీ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. 1967, 1968లో సంవత్సరాల్లో వరుసగా ఢాకా విశ్వవిద్యాలయం నుండి బెంగాలీ భాష, సాహిత్యంలో బిఎ, ఎంఎ డిగ్రీలను పొందాడు. 1976లో ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయం నుండి 'బంగ్లాలో ప్రోనా మిన లైజేషన్' అనే తన థీసిస్‌ను సమర్పించి భాషాశా స్త్రంలో పిహెచ్‌డి పూర్తిచేశాడు. నారాయణగంజ్ జిల్లా మేజిస్ట్రేట్ నుంచి అనుమతి పొందిన ఆయన, 28 సెప్టెంబర్ 1988న ఇంటి పేరును కబీర్ నుండి ఆజాద్‌గా మార్చుకున్నాడు. విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న తర్వాత, 1969లో చిట్టగాంగ్ కళాశాలలో చేరడం ద్వారా తన కెరీర్‌ను ప్రారంభించాడు ఆజాద్. 1970 ఫిబ్రవరి 11న చిట్టగాంగ్ విశ్వవిద్యాలయంలో, అదే ఏడాది డిసెంబర్‌లో జహంగీర్‌నగర్ విశ్వవిద్యాలయంలో లెక్చరర్‌గా చేరాడు. 1978 నవంబర్ 1న ఢాకా విశ్వవిద్యాలయంలో బెంగాలీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియమితుల య్యాడు. 1986లో ప్రొఫెసర్ పదవికి పదోన్నతి పొందాడు. ఉపాధ్యా యుడిగా ఒకవైపు తన వృత్తిని కొనసా గిస్తూనే, మరోవైపు సాహిత్యం పై కూడా దృష్టి కేంద్రీకరించాడు. 1968–1972 మధ్యకాలంలో ఆజాద్ రాసిన కవితల సంకలనం 1973లో 'అలాయుకిక్ ఇస్టిమార్'గా ప్రచురితమైంది. అదే సంవత్సరం ఆజాద్ ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయం నుండి భాషాశా స్త్రంలో పిహెచ్‌డి చదవడానికి స్కాట్లాండ్‌కు వెళ్ళాడు. 1979లో 'ఒనోబోరోటో తుషార్‌పత్' అనే చిన్న కథ రాశాడు. ఢాకా విశ్వవిద్యాలయ సహచరుడు లతీఫా వివాహం కోహి నూర్‌తో జరిగిన తర్వాత చోటు చేసుకున్న పరి ణామాల నుంచి ప్రేరణ పొందిన ఆజాద్ ఆ కథ రాశాడు. బ్రిటన్‌లో ఒక రోజు, ఆజాద్ తన భార్యతో కలిసి భారీ హిమపాతం సమయంలో కారు నడుపుతున్నప్పుడు ఎదు రైన అను భూలను కూడా అతను చిన్న కథాంశంగా మార్చుకున్నాడు. చాలా సంవత్సరాల తర్వాత ఆజాద్ ఈ చిన్న కథను తన 1996 పుస్తకం 'జాదుకోరేర్ మృత్యు' సంకలనంలో చేర్చాడు. ఈ పుస్తకం అతను స్వయంగా రాసిన ఐదు చిన్న కథల సంకలనం. రచనా వ్యాసాంగాన్ని కొనసా గిస్తూ, 1980ల చివరి నాటికి, ఆయన సమకాలీన సామాజిక రాజకీయ అంశాలపై దృష్టి సారించాడు. వార్తాపత్రికలలో కాలమ్ రాయడం ప్రారంభించాడు. ఆయన వ్యాఖ్యానాలు 1990 దశకాల్లో బహుళ ప్రాచుర్యం పొందాయి. ఆ వ్యాఖ్యానాల సంఖ్య పెరి గేకొద్దీ పుస్తకాలుగా ముద్రితమ య్యాయి. 1990 దశకంతోపాటు, 2000 దశకం ప్రారం భంలోనూ ఆయన ప్రముఖ నవలా రచయితగా కొనసాగాడు. 1992లో ఆజాద్ బెంగా లీలో మొదటి సమగ్ర స్త్రీవాద పుస్తకాన్ని 'నరీ' (మహిళ) పేరుతో ప్రచురించారు. నరీ ఒక గ్రంథంపై భిన్నా భిప్రాయాలు వ్యక్తమ య్యాయి. కొంత మంది ఈ పుస్తకాన్ని స్వాగతించగా, మత ఛాందసులు మాత్రం విమర్శలు గుప్పించారు. ఎవరి అభిప్రాయాలు ఎలావున్నా, బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం తర్వాత మొదటి పూర్తి స్థాయి స్త్రీవాద పుస్తకంగా ఈ నవల గుర్తింపు సంపాదించింది. ఈ రచనలో ఆజాద్ బ్రిటిష్ రాజ్ యొక్క ఇద్దరు ప్రసిద్ధ బెంగాలీ సామాజికరాజకీయ సంస్కర్తలు.. రాజా రామ్మోహన్ రాయ్, ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్ మహిళాభ్యుద యానికి చేసిన కృషిని ఆజాద్ ప్రస్తావించాడు. ప్రసిద్ధ బెంగాలీ కవి, నోబెల్ గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్, 19వ శతాబ్దపు ప్రసిద్ధ బెంగాలీ నవలా రచయిత బంకిం చంద్ర ఛటర్జీపై విమర్శనాస్త్రాలు గుప్పించడం అప్పట్లో చర్చనీయాంశ మైంది. మహి ళల పట్ల సమాజం వ్యవ హరిస్తున్న తీరును, పితృస్వామ్య విధానాన్ని, పురుషాధిక్యాన్ని ఆజాద్ తన రచనలో ఎండగట్టాడు. మహిళలకు జరుగుతున్న అన్యాయాలపై సమాజాన్ని నిల దీశాడు. పాలకులను ప్రశ్నించాడు. సహజంగానే బంగ్లాదేశ్ పాఠకుల్లో కొంత మంది 'నరీ' నవలను తీవ్రంగా విమర్శించారు. కానీ, ఎక్కువ మంది ఆయన వైఖరిని సమర్థించారు. మతం పేరుతో మహి ళలకు జరుగుతున్న అన్యా యాలపై గళం విప్పినందుకు ప్రశంసించారు. అయితే, మతవాదుల ఒత్తిడి కారణంగా బంగ్లాదేశ్ ప్రభుత్వం 1995లో ఈ పుస్తకాన్ని నిషేధించింది. ఆజాద్ దేశ హైకోర్టులో జరి పిన చట్టపరమైన పోరాటంలో గెలిచిన తర్వాత, 2000లో నిషేధాన్ని ఎత్తి వేశారు. ఆయన 1994లో తన మొదటి నవల 'చప్పన్నో హజార్ బోర్గోమైల్' ('యాభై ఆరు వేల చదరపు మైళ్ళు, బంగ్లాదేశ్ ప్రాంతం')ను ప్రచురించారు. ఈ నవల 1980ల దశాబ్దంలో బంగ్లాదే శ్‌లో సైనిక పాలనను వివరిస్తుంది. బంగ్లాదేశ్ సమాజంలోని వ్యక్తుల మధ్య సంబం ధాల ఆధారంగా రాసిన తన రెండవ నవల 'సబ్ కిచు భేనే పరే' (1995) ఆయనకు ప్రత్యేక గుర్తింపును సంపాదించిపెట్టింది. 'ఏక్ థీ ఖునేర్ స్వప్న' ('ఒక హత్య కలలు కనడం') అనే ప్రేమ ఆధారిత నవలను కూడా ఆజాద్ రాశాడు. దీనిలో ప్రధాన పురుష పాత్ర ధారి ఢాకా విశ్వవిద్యాలయంలోని సలీముల్లా ముస్లిం హాల్‌లో ఆజాద్ సహ విద్యార్థిదే కావడం విశేషం. ఇది 2004లో ప్రచురణ పొందిన ఆజాద్ చివరి నవల. అదే ఏడాది ఆయన మరణించాడు. ఆయన రాసిన ఇతర ముఖ్య మైన నవలలు 'కోబి ఒథోబా దొండిటో ఔపురుష్', 'నిజర్ షోంగే నిజర్ జిబోనర్ మోధు'. వీటిలో మొదటిది 20వ శతాబ్దపు చివరిలో బంగ్లాదేశ్ పురుష కవి జీవితం ఆధారంగా రూపొందించబడింది. అతను చాలా తక్కువ వయసుగల మహిళతో సహజీవనం చేసిన తర్వాత కుల బహిష్కరణకు గురవుతాడు. ఇందులోని ఇతివృత్తం ఆజాద్ యుక్తవయసును, అతని సొంత గ్రామీణ జీవితం నుంచి ప్రేరణ పొందింది. ఆజాద్ రాసిన మరో ప్రసిద్ధ నవల 'ఫాలి ఫాలి కోరే కటా చంద్'. ఇందులో ప్రధాన మహిళా కథానాయకి పాత్ర షిరిన్ విద్యావంతురాలు. అయితే,



ఎప్పుడూ ప్రగల్భాలు పలుకుతూ ఉంటుంది. దుష్ప్రవర్తనతో వ్యవ హరించి, భర్తను విడిచిపెడుతుంది. తర్వాత కాలంలో ఆమె వ్యభిచార వృత్తిలోకి దిగుతుంది. బంగ్లాదేశీ మహిళల్లో ఉన్న మరో కోణాన్ని ఆయన ఈ నవలలో ఆవిష్కరించాడు. మహి ళల తరఫున వకాల్తా పుచ్చుకొని, వారి అభ్యున్నతిని కోరే రచనలేకాదు... వారు అనుసరిస్తున్న అసాంఘిక విధానాలను కూడా ఆజాద్ తన రచనల్లో ప్రస్తావించాడు. ప్రశ్నించాడు. నిజాన్ని నిర్భయంగా వెల్లడించే తత్వం ఉన్న ఆజాద్ రచనల్లో టీనేజ్ సాహిత్యం కూడా ఉంది. 'లాల్ నీల్ దీపబలి' అనే ఉపన్యాస పుస్తకం ఆయన టీనేజ్ సాహిత్యంలో ప్రసిద్ధి చెందింది. ఈ పుస్తకం టీనేజ్ వయస్సు గల బాలురు, బాలికలను దృష్టిలో ఉంచుకొని రాశాడు. కౌమారదశలోని బంగ్లాదేశ్ బాలురు, బాలికలకు బెంగాలీ సాహిత్య చరిత్ర గురించి క్లుప్తంగా బోధించడమే లక్ష్యంగా పెట్టుకున్న ఆజాద్, ఆ దిశగానే కొన్ని రచనలు చేశాడు. బంగ్లాదేశ్ సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదిం చుకున్నాడు.


## మతవాదుల అసహనం

మహి ళల స్వేచ్ఛను కోరడం... పురు షాధిక్యతను ప్రశ్నించడం... హేతుబద్ధంగా ఆలోచించాలని పిలు పునివ్వడం ఆజాద్ చేసిన నేరాలుగా పరిగణించిన మతవాదులు ఆయనపై అసహనం ప్రదర్శించారు. మత ద్రోహిగా ముద్ర వేశారు. 2004 ఫిబ్రవరి 27న, వార్షిక బంగ్లా అకాడమీ పుస్తక ప్రదర్శన సందర్భంగా ఢాకా విశ్వవిద్యాలయ ప్రాంగణం సమీపంలో, ఇద్దరు దుండగులు ఆజాద్‌పై కుత్తలతో దాడి చేశారు. అతని దవడ, మెడ దిగువ భాగంతోపాటు చేతులపై అనేకసార్లు పొడిచారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆజాద్‌ను ప్రాథమిక చికిత్స కోసం సమీపంలోని ఢాకా మెడికల్ కాలేజ్ ఆసుపత్రికి తరలించారు. అప్పటి బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి ఖలీదా జియా ఆదేశం మేరకు, ఆజాద్‌ను ఆ వెంటనే మెరుగైన చికిత్స కోసం ఢాకాలోని కంబైన్డ్ మిలిటరీ హాస్పిటల్ (సి ఎం హెచ్)కి, ఆ తర్వాత థాయిలాం డ్‌లోని బుమ్రున్‌గ్రాడ్ ఇంటర్నేషనల్ హాస్పిట ల్‌కు తరలించారు. అక్కడ ఆయన కోలుకున్నాడు. 2003లో 'ది డైలీ ఇట్టేఫాక్' వార్తాపత్రిక పండుగ (ఈద్) ప్రత్యేక సంచికలో ఆజాద్ నవల 'పాక్ సర్ జామిన్ సాద్ బాద్'లోని కొన్ని భాగాలు ప్రచురితమయ్యాయి. అప్పటి నుంచి ఆయనపై మతవాదుల ఆగ్రహం పెరి గింది. పరిస్థితులు గమనించిన ఆజాద్ తనకు ప్రాణహాని ఉందని పలు సందర్భాల్లో ఆందోళన వ్యక్తం చేశాడు. మరుసటి సంవత్సరమే దాడి జరగడంతో, అతని భయం నిజ మైంది. ఆజాద్ తన నవలలో, అతను బంగ్లాదే శ్‌లోని ఇస్లామిక్ తీవ్రవాదుల రాజకీయ భావజాలాలను తీవ్రంగా విమర్శించాడు. వారి విధానాలను తప్పుబట్టాడు. అప్పటి నుంచే ఇస్లామిక్ ఛాందసవాదుల నుండి వివిధ రకాలుగా బెదిరింపులు ఎదుర య్యాయి. దాడికి వారం ముందు, బంగ్లాదేశ్ పార్ల మెంటు సభ్యులలో ఒకరైన డెల్వార్ హొస్సేన్ సయీది పార్ల మెం టులో మాట్లాడుతూ, ఆజాద్ రాజ కీయ వ్యంగ్య చిత్రం 'పాక్ సర్ జమిన్ సద్ బాద్'ను నిషేధించాలని డిమాండ్ చేశాడు ఈ రకమైన పుస్తకం కోసం బంగ్లాదేశ్ దైవదూషణ చట్టాన్ని కూడా విధించాలని అన్నాడు. 2006లో, ఫండ మెంటలిస్ట్ సంస్థ జమాతుల్ ముజాహి దీన్ బంగ్లాదేశ్ (జెఎంబి) నాయకులలో ఒకరు, తన కార్యకర్తలు రచయిత ఆజాద్‌పై దాడి చేశారని, అలాగే మరో రెండు హత్యలు, బాంబు పేలుళ్లు, 2002లో సినిమా థియేటర్లపై దాడులు చేశారని ఆర్ఎబి విచార ణాధికారుల ముందు అంగీకరించాడు. కాగా, దాడికి గురైన తర్వాత ఆజాద్ కోలుకున్నట్టు కని పించినప్పటికీ, అతని ఆరోగ్యం క్షీణించిందని కొందరు అంటారు. కారణాలు తెలియక పోయినా, 2004 ఆగస్టు 12న, ఆజాద్ జర్మనీలోని మ్యూని చ్‌లోని తన అపార్ట్‌మెం ట్‌లో చని పోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. పంతొమ్మిదవ శతాబ్దపు జర్మన్ శృంగార కవి హెన్రిచ్ హీన్‌పై పరిశోధన చేయ డానికి ఒక వారం క్రితమే అతను మ్యూనిచ్ చేరుకున్నాడు. ఒక పుస్తక ప్రదర్శనలో అతనిపై ఇస్లా మిస్టులు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన చాలా నెలల తర్వాత అతను ఎవరూ ఊహించని రీతిలో ప్రాణాలు కోల్పోవడంతో అతని కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. అతని మర ణంపై దర్యాప్తు జరిపించాలని కోరారు. ఈ మర ణంలో మునుపటి హత్యకు ప్రయత్నించిన తీవ్రవాదుల పాత్ర ఉందని ఆరోపించారు.

### నెరవేరని చివరి కోరిక..


ఆజాద్ చివరి కోరిక నెరవేరనే లేదు. జీవించి ఉన్నప్పుడు అతను తన మరణం తర్వాత తన శరీరాన్ని వైద్య కళాశాలకు దానం చేయాలనే కోరికను వ్యక్తం చేశాడు. అయితే, అతను జర్మనీలో మృతి చెందడంతో, పార్థివ శరీరం జర్మనీ నుండి బంగ్లాదేశ్ చేరు కోవ డానికి చాలా రోజులు పట్టింది. దీనితో వైద్యులు అతని శరీరాన్ని వైద్య పరిశోధన కోసం తీసు కోవ డానికి నిరాకరించారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో, ఆజాద్ మృత దేహాన్ని బంగ్లాదే శ్‌లోని అతని గ్రామం రార్హిఖల్‌లో ఖననం చేశారు.

# 62 దేశాల్లో అధికార భాషగా ఇంగ్లీషు!



ఐక్యరాజ్య సమితి గుర్తింపు పొందిన 190కి పైగా ఉన్న దేశాలలో 62 దేశాలలో మాత్రమే ఇంగ్లీషు అధికార భాషగా కాకపోయినా, పరోక్షంగానైనా అధికార భాషగా చెలామణి అవుతోంది. ఈ అర వైరెండు దేశాలలో కోటికి పైగా జనాభా ఉన్నవి 21 దేశాలు. 75 లక్షలనుంచి 10 లక్షల జనాభా ఉన్నవి 14 దేశాలు. ఒక వెయ్యి నుంచి 8 లక్షల జనాభా ఉన్నవి 27. ఈ దేశాలు చాలావరకు బ్రిటిషు వలస పాలనలో మగ్గిన దేశాలే. ఐతే వీటిలో 24 దేశాలు ఆఫ్రికా ఖండంలోనూ, 15 దేశాలు మధ్య అమెరికా ఖండంలోనూ, ఆస్ట్రేలియా ఖండ దరిదాపుల్లో 15 దేశాలూ, ఆసియా ఖండంలో 6 దేశాలు, ఐరోపాలో 2 దేశాలూ ఉన్నాయి. ఐతే వీటిలో ఇండియా, పాకిస్తాన్, నైజీరియా, బంగ్లాదేశ్, ఫిలిప్పైన్స్, ఇథియోపియా లాంటివి తప్పించి మిగిలినవన్నీ చిన్నా చితకా దేశాలే. బ్రిటిష్ వలసవాద ఆధిపత్యపు పీడనలో నలి గిన దేశాలే ఇవి. ఇంకా ఆనాటి వలసవాద అవశేషంగా మిగిలిన ఆనవాలే ఇంగ్లీషు. చాలావరకూ ఈ దేశాలలో వాళ్ల సొంత భాషలే మాట్లాడుతున్నా అధికారిక కార్యకలాపాలూ ఉన్నత విద్య మొద లైనవి మాత్రం ఇంగ్లీ షులోనే. వీటిలో చాలా దేశాలలో ఇంగ్లీ షును పక్కన పెడదామని ఎన్ని ప్రణాళికలు వేసుకొన్నా ఆర్థిక వేసులుబాటు లేని కార ణంతోనూ, అంతర్గత రాజకీయ సామా జిక కార ణాలచేతనూ ఇంగ్లీ షును భరించక తప్పటం లేదు. అసలు విషయం ఏమంటే ఇంగ్లీ షును సొంత భాషగా మాట్లాడే దేశాలైన ఇంగ్లండు, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిల్యాండులలో ఇంగ్లీషు ఈ నాటికీ అధికార భాషగా గుర్తింపుకు నోచుకోలేదు. ఆసియా ఖండంలో మొత్తం 50 దేశాలు ఉండగా 15 దేశాలలో మాత్రమే పాఠశాలవిద్యలో స్థానిక భాషలతోబాటు ఇంగ్లీషు మాధ్యమం కూడా వాడుకలో ఉంది. వీటిలో కోట్లల్లో జనాభా ఉన్న భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాలులూ, లక్షలలో మాత్రమే జనాభా ఉన్న హాంకాంగ్, లావోస్, సింగ పూర్, కువైట్, ఖాతర్, బహ్రైన్, భూటాన్, బ్రునేయ్, మాల్దీవులు ఉన్నాయి. నిన్న మొన్నటివరకు నేరుగా బ్రిటిషు వలస దేశాలుగా ఉండమే దీనికి ప్రధాన కారణం. మొత్తం 439 కోట్లమందిలో మూడింట ఒకవంతు మాత్రమే ఇంగ్లీషు మాధ్యమానికి మారినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. ఇక ఐరోపా ఖండంలో ఉన్న 49 దేశాలలో ఐర్ల్యాండు, ఐస్ల్యాండు ఇంకా రెండు మూడు చిన్నా చితకా దేశాలు తప్పితే అన్నీ పాఠశాలవిద్య మాతృభాషామాధ్యమంలోనో లేక స్థానిక భాషలలోనో విద్యా బోధన జరుపుతున్నాయి. అయితే, నెదర్ ల్యాండ్స్ (డెన్మార్క్), స్వీడన్, ఫిన్‌లాండ్ జనాభాలో 70నుంచి 90శాతం మంది ఇంగ్లీ షును రెండవభాషగా మాట్లాడతారు. మిగిలిన ఐరోపా దేశాలలో 5520 శాతం మంది మాత్రమే ఇంగ్లీషు మాట్లాడగలరు.56 దేశాలతో సుమారు 120 కోట్ల జనాభాతో ఉన్న ఆఫ్రికా ఖండంలో 70 శాతం ప్రాథమిక విద్య 200 కి పైగా ఉన్న ప్రధాన మాతృభాషలలోనే ఉంది. ఐతే మాధ్య మిక స్థాయి నుండి విద్యబోధన అంతా ఇంగ్లీషు, ఫ్రెంచి, కొన్నిసార్లు యొరుబా, స్వాహిలీ భాషలలోనే జరుగుతోంది. ఉత్తర దక్షిణ అమెరికా ఖండాలలో మొత్తం 35 దేశాలు ఉండగా అమెరికా (సం.రా.), కెనడా లాంటి వాటితో కలుపు కొని మొత్తం 12 దేశాలలో ఇంగ్లీషు అధికార భాష. మిగిలిన దేశాలన్నింటా స్పానిషు, పోర్చుగీసు, ఫ్రెంచి లాంటి ఐరోపా భాషలూ, అమెరికనిండియన్ భాషలైన గ్వరానీ, క్వెచువా, అయమార లాంటివి ఉన్నాయి. ఆస్ట్రేలియాఓషేనియా పరిధిలో ఉన్న 14 దేశాలలో ఏ దేశంలోనూ అధికార భాషగా ఆంగ్లం లేకపోయినా వాస్తవానికి అధికార భాషగా ఇంగ్లీషు చలామణిలో ఉంది. ఆస్ట్రేలియా, పపువాన్యూగినీ, న్యూజిల్యాండు తప్పితే మిగతావి మిలియను జనాభా దాటని చిన్న దేశాలే. పపువాన్యూ గినీలో ఇంగ్లీషు మాట్లాడగలి గినవారి జనాభా రెండు శాతంకంటే తక్కువే. న్యూజిల్యాండులో మావోరీ అధికారభాష. అయి తేం అన్నింటా ఇంగ్లీ షుదే వాస్తవ అధికారం. ఇక ఆర్థిక విషయాలు చూద్దాం. నిర క్షరాస్యులతో పోల్చితే, ప్రాథమికవిద్య నేర్చినవారి వ్యక్తిగత ఆదాయం 20 శాతంవరకూ పెరుగుతున్నట్లు తెలు స్తోంది. జాతీయ నమూనా సర్వేక్షణలో సేకరించిన సమాచార విశ్లేష ణలో ప్రతి ఏటా చదు వుకున్న చదువు పురు షులలో 8 శాతం, మహి ళలలో 10 శాతంవరకూ ఉత్పాదకతను పెంచుతోంది అని తెలిసింది (ప్రోబ్ నివేదిక, 1998). అందరికీ చదు వుకు మాతృభాషా మాధ్యమమే సులువైన సాధనమూ మార్గం.

## సాహిత్య వికాసం..



సాహిత్యం అనేది భావోద్వేగాలకు, ఆలోచనలకు, సృజనాత్మకతకు రూపకల్పన. ఒక సమాజం యొక్క సంస్కృతి, జీవనవిధానాలు, మానవ విలువలు సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి. కాలంతో పాటు సాహిత్యమూ మారుతుంది, అభివృద్ధి చెందుతుంది. ఈ ప్రక్రియే సాహిత్య వికాసం. ఇది కాలానుగుణంగా అభివృద్ధి చెందిన భావనలు, శైలులు, విధానాల సమాహారం. ప్రతి యుగానికీ తన ప్రత్యేక మైన సాహిత్య ధోరణి ఉంటుంది. ఉదా హరణకి, పురాణ యుగంలో మతపర మైన సాహిత్యం ప్రధానమై ఉండగా, మధ్య యుగంలో భక్తి సాహిత్యం వికసించింది. ఆధునిక యుగంలో వ్యక్తి స్వేచ్ఛ, సమాజపర మైన సమస్యలు సాహిత్యంలో ప్రధాన్యం సంతరిం చుకుంటున్నాయి. సాహిత్య వికాసానికి అనేక అంశాలు దోహదపడ తాయి. సమాజంలో జరి గిన మార్పులు, రాజకీయ పరి ణామాలు, సాంకేతిక అభివృద్ధి, ప్రపంచదృష్టి ప్రభావం వల్ల సాహిత్యం అభివృద్ధి చెందింది. మునుపటి కాలంలో ముక్త కవిత్వం కనిపించకపోయినా, నేడు భావప్ర ధానం, స్వేచ్ఛాపూరిత రచనలు విస్తృతమ య్యాయి. 19వ శతాబ్దంలో తెలుగు సాహిత్యంలో పాశ్చాత్య ప్రభావం, నూతన ఆలోచనలు ప్రవేశించాయి. శ్రీశ్రీ, విశ్వనాథ సత్యనారాయణ, గురజాడ అప్పారావు వంటి మహానుభా వులు సాహిత్యాన్ని ప్రజల సమస్యల వైపు మళ్లించారు. సాహిత్య వికాసం మనిషి మనసు వికాసానికి మార్గం. ఇది సమాజానికి దిశానిర్దేశం చేయగల శక్తి కలి గిఉంది. సాహి త్యాన్ని అభ్యసించడం వల్ల మనలో భావనా శక్తి, విశ్లేష ణశక్తి, మాన వీయ విలువలు పెరుగు తాయి. స్థూలంగా చెప్పాలంటే, సాహిత్య వికాసం అనేది నిరంతర ప్రయాణం. కాలాన్ని అనుసరించి, మారుతున్న అవసరాలను ప్రతిబింబిస్తూ సాహిత్యం అభివృద్ధి చెందుతుంది. అందువల్ల, సాహి త్యాన్ని మనం అభివృద్ధి చేస్తూ, ప తరాలకు అందించాల్సిన బాధ్యత మన అందరిదీ.

## ఆనంద వనంలో విహరింపజేసేదే అసలైన కవనం!

కళాత్మక వర్ణన, ప్రమోదంగా కథను చెప్పడం, సామా జిక అవల క్షణాలను వేలెత్తి చూపడం, హృదయాలను దోచుకోవడం, మానవ వెతలను బయట పెట్టడం, మెదడును ఉత్తేజపరచడం, మానవా ళి చైతన్యపరచడం, మానవ ఆలోచనలకు రూపం ఇవ్వడం, ప్రజలను ఐక్యం చేయడం, మానసిక ఉద్వేగానికి ఊతం ఇవ్వడం, భావోద్వేదాలను వ్యక్తం చేయడం, మానవీయ విలువలకు పట్టం కట్టడం, భాషాభిమానం పెంచడం లాంటి పలు ముఖ్య మైన ప్రయోజనాలు కలి గిన అక్షర పదకేళి కవిత్వం. కవిత్వంలో దాగి ఉన్న అనంత శక్తిని ప్రజలకు అవగా హన పరచడానికి యునెస్కో ప్రయత్నిస్తున్నది. భాషకు సరి హద్దులు లేవు, కవిత్వానికి వివక్ష లేదు. ఏ భాషలోనైనా కవి త్వానికి పెద్ద పీట వేయబడింది. కవిత్వ పఠనం విజ్ఞాన, వినోద, జ్ఞానోదయ, వారసత్వాల ఊట బావి వలె ప్రాధాన్యం ఇవ్వబడింది. మన సాంస్కృతిక వారస త్వాలకు పట్టం కట్టడం, భాషా వైవి ధ్యాలకు మరో రూపం ఇవ్వడం కవిత్వంతో సుసాధ్యం అవుతున్నాయి. అంతరించే దుస్థితిలో ఉన్న భాషలకు ఊపిరి పోవడానికి కవిత్వం ఓ మంచి సాధనంగా మారింది. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యా లైన అసమానతల తొల గింపు, నాణ్యమైన విద్య, ప్రపంచ శాంతి, సమ న్యాయం, సుస్థిర సంస్థల స్థాపన లాంటివని సుసాధ్యం చేయడంలో కవికడత్వం కూడా దోహదపడుతున్నది. ప్రపంచ కవిత్వ దినోత్సవం రోజున కవులు, కవిత్వ పోషకులు, ముద్రన యంత్రాంగాలను గుర్తించ డానికి ప్రపంచ కవిత్వ దినం వేదికలు పని చేస్తున్నాయి. స్థానిక సమస్యల నుంచి అంతరిక్షం వరకు, రవి చూడని ప్రదేశాల నుంచి కవి చూసే అదృశ్య దృశ్యాల వరకు అన్ని కవికి కవితా వస్తువులే. మంచిని మెచ్చుకోవడం, లోపాలను వేలెత్తో చూపడం, ప్రకృతి అందాలను వర్ణించడం, ప్రజలను చైతన్య పరచడం, సృజనకు పట్టం కట్టడం, భాష అందాలను ఆవిష్కరించడం, ప్రపంచ మానవా ళి ఏకం చేయడం, కవుల మనోభావాలను తెలుసు కోవడం లాంటి అనేక ఉపయోగాలు కలి గిన కవిత్వాలను రాయడం లేదా చదవడం మన జీవనశైలిలా భాగం కావాలి.

## సాహితీ పదనిసలు

- ఒకే రచయిత రాసిన అత్యంత పెద్ద లేదా విస్తారమైన గ్రంథం ఏమిటో తెలిసా? 'మహాభారతం'. వ్యాసుడు రచించిన ఈ భారతీయ ఇతిహాసంలో 100,000 శ్లోకాలు, 18 లక్షల పదాలు ఉన్నాయి.
- ఎవరైనా ఒకే రకమైన రచనలు చేస్తారా? అంటే లేదనే చెప్తారు. రకరకాల ఇతివృత్తాలను ఎన్నుకుంటారు. నవసరాలను పండించే రీతిలో రచనలు ఉండాలని కోరుకుంటారు. కానీ, నోరా రాబర్ట్స్ మాత్రం ఈ జాబితాలో చేరదు. ఎందుకంటే, అతనికి రోమాంటిక్ (శృంగార) రచనలు చేయడం అంటే ఇష్టం. రచయితగా అతను ఏకంగా 225 రోమాంటింగ్ నవలలు రాశాడు. ప్రపంచ వ్యాప్తంగా అతని పుస్తకాలు 50 కోట్లు అమ్ముడయ్యాయి. అంటే, ఒకే తీరులో అన్ని నవలలు వాసినా, వేటి ప్రత్యేకత వాటివే.
- చాలాకాలం సైన్స్ ఫిక్షన్ నవల్లో శ్వేత జాతీయులదే పైచేయిగా కొనసాగింది. 1969లో నల్ల జాతీయుడైన శామ్యూల్ ఆర్. డెలానీ గొప్ప సైన్స్ ఫిక్షన్ నవల రాశాడు. అతని రచించిన 'ది బ్లాక్ కారిడార్' సంచలనం రేపింది. అమ్మకాల ప్రభంజనం సృష్టించింది.
- అమెరికాలో నిషేధానికి గురైన తొలి నవల 'ది న్యూ ఇంగ్లీష్ కానన్'. మత ఛాందస వాదానికి, కరడుగట్టిన విశ్వాసాలకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టేదిలా ఉందనే కారణంగా, ఆ నవలను 1637లో నిషేధించారు.
- జర్మనీలో 1663లో ప్రారంభమైన 'ఎర్బాలిచె మొనాథ్స్ అన్‌టెరెడగన్'ను ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన సాహితీ పత్రికగా పేర్కొం టారు. అయితే, మరికొందరి వాదన ప్రకారం, 1684లో మొదలైన ఫ్రెంచ్ పత్రిక 'నొవెలెస్ డి లా రెబెక్ డిఎస్ లెట్టర్స్'ను మొదటి సాహితీ పత్రిక. సాధారణంగా ఇప్పుడు మార్కెట్‌లో కనిపించే వార, మాస పత్రికలకు మాతృకగా 1741లో లండన్ కేంద్రంగా వెలువడిన 'ది జెంటిల్మన్స్ మ్యాగజైన్'ను పేర్కోవాలి. సాహిత్యంతోపాటు, సామాజిక అంశాలతో కూడిన వ్యాసాలు, కథనాలు అందులో ఉండేవి. అమెరికాలోని 'ది అట్లాంటిక్ మంత్లీ' మ్యాగజైన్‌ను 1857లో ప్రారంభించారు. గత 165 సంవత్సరాలుగా ఈ పత్రిక వెలువడుతునే ఉంది.

ఈ వారం కవితలు

## జోహార్లు ! పశ్య కన్నమ్మ

ఏ మహనీయుల స్ఫూర్తి
నిను మలిచె వీరవనితగా
ఓ పశ్య కన్నమ్మ
ఏ బడుగు జీవుల గోడు
నిను నడిపెనో ఎర్ర జెండా వైపు
మా కామ్రేడు కన్నమ్మ నిన్ను..

పగబట్టి పల్లెల్లో దాడులు
చేసేటి దొరలు రజాకారులు
గుండాల నెదిరించి నేలకొరిగిండు.
నీ అన్న శంభిరెడ్డి ఓతల్లి కన్నమ్మ నాడు

అదిగదిగో ఆనాడే శత్రు వర్గంబుపై
శపథంబు పూని పోరు బరిలోన
దూకిన పులి బిడ్డవు నీవమ్మా
మా కామ్రేడు పశ్య కన్నమ్మ నీవు..

పోరాట యోధుడు పశ్య
రామరెడ్డికే అర్థాంగివై నీవు..
సాయుధ సమరాల కలిసి మెలిసి
అడుగు లేసిన వీరవనితవు నీవమ్మా..

దొరలు రజాకారుల గుండాల
గడ గడ లాడించిన ధర్మబిక్షం
భీమిరెడ్డి దొడ్డా చింతల పూడి
బొబ్బరాములమ్మ పద్మమ్మల
బాటలో నడిచినావు.
జోహార్లు జోహారులు
పశ్య కన్నమ్మ నీకు
విప్లవ జోహార్లు
పశ్య కన్నమ్మ నీకు

– బొమ్మగాని నాగభూషణం
9849622633

## రక్త కన్నీరు




పాక్ ఉగ్రవాదం పంజా విప్పి
సరి హద్దుదాటిన విషపు నీడ
ప్రకృతి ప్రశాంత ప్రదేశమంతా
నర మేధపు వికృత రాక్షస జాడ
ఇప్పుడు&..(హిమాలయ శిఖరాల నీడలో,
ఫైన్ వృక్షాల పహారాలో
సందర్శకుల మనసులు దోచే
కాశ్మీరు సుందర వదనం
రక్త కన్నీరుతో తడిసిన గాయం

డాల్ సరస్సు నీలి కలల సౌరభం
గాంఢ్రింపుల కాల్పులలో కన్నీరైన దృశ్యం
చినార్ ఆకులు రక్తసిక్తమయంగా
శిశిరం రాకుం డనే రాలుతున్న దృశ్యం
(పుష్పాల లోయలో గులాబీల సుగం ధం) తు
పాకీ మంటల్లో కాలి బూడి దైది
శాంతి పావురం ఆకాశంలో గాయపడి (చిరి గిన
రెక్కలతో నేల రాలి పోయింది

చినార్ చెట్ల ప్రేమ సాక్షి కాల్పుల నీడలో మౌనం
పొంగిన పాటల కెరటం జల్వా నదిలో రుధిరం
అమ్మ ఒడిలో పిల్లల కళ్లలో విషాద గాయం
కొనసాగాలా ఇలాగే ఇంకా కలకాలం

ఈ గాయాల నడుమ చిద్ర మైన కాశ్మీరం కల
చిగురించేందుకు ఉగ్రవాద హింసా చెరలో
శాంతి ఉదయం స్థాపించేందుకు
మత మేదైనా మానవత గొంతుతో
స మైక్య సమరం సాగించాలి

– వేల్పుల నారాయణ
9440433475

## ఏదో ఒక అజెండా

పురి ట్లోనే మతము, కులము రంగులు
రక్తంలో రంగరించి పోస్తరు
పర మతం, కులం నచ్చని ఎచ్చమే
రోజు మతం, కులం కలి పిన భోజనమే రుచిస్తది
రోజు కార్యక్రమాలలో ఉట్టిపడుతుంది
కులంలో, మతంలో పుట్టినందుకు బహుమతులు
మర్యాదలు మంతనాలు దానికి తగ్గట్టే
కులం మతం కాలర్ ఎగురు తూనే ఉంటది
గాలి నిండా తరంగాలై ఎక్కడైనా
కులమత ద్వేషాలు గొప్ప విషయాలు నేడు
ఏదో ఒక జెండాతో ఎగిరి తేనే నీవు
నలుగురిలో ఉన్నట్లు
లేదంటే మూలపడ్డ మసి గుడ్డే
మని షిని వెతికే మనుసులను వెతకాలి
ఎక్కడ తప్పిపోయినవో
కులము మతము పెళ్ళల కింద నలుగుతుందేమో చూడండి
కాస్త చెయ్యేసి లేపండి మరి.

– గుండెల్లి ఇస్తారి, 9849983874

## ఓ శ్రామికా

విద్య లవి ఎన్ని చదివినన్
విజ్ఞాన మది యెంత యున్నన్
విత్త మెంత ఆర్జించినన్
వీసమెత్తు శ్రమ లేక
చిత్తవృత్తులు నెరవేరునా
విరి యూనా సిరులు భువి పై!

ఎవరికి వారు ఏ కాంతులు
అందు కోేమో అవసరాలలో
అన్యుల అవ ధోని ఆసరాయే
అవనికి అందించు జీవన కాంతులు!

ఓ శ్రామిక నీ ఊపిరి
అవనికి సిరుల పంట
అలు పెరుగని నీ శ్రమయే
ఈ జగతికి అందాల వెలుగంట!

– పి.బక్కారెడ్డి
9705315250

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## లోయలో పడ్డ ఆర్మీ వాహనం.. ముగ్గురు జవాన్లు మృతి

**శ్రీనగర్ :** జమ్ముకశ్మీర్‌లోని రాంభన్ జిల్లాలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆర్మీ జవానులతో వెళ్తున్న వాహనం లోయలో పడింది. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు అక్కడికక్కడే మృతి చెందారు. పలువురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న ఆర్మీ అధికారులు హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. దాదాపు 700 అడుగుల లోయలో ఈ ఆర్మీ వాహనం పడిపోయింది.

జమ్ము నుంచి శ్రీనగర్‌కు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుందని ఆర్మీ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇక ఘటనాస్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ సహాయక చర్యల్లో ఆర్మీ అధికారులు, కాశ్మీర్ పోలీసులు, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌తోపాటు స్థానిక వాలంటీర్లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ తప్పులకు బాధ్యత వహించడం సంతోషంగా ఉంది

### 1984లో జరిగిన అల్లర్లలో చాలా తప్పులు చోటు చేసుకున్నాయి ఆ సమయంలో నేను అక్కడ లేను : రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ :** సిక్కులకు వ్యతిరేకంగా 1984లో జరిగిన అల్లర్లలో చాలా తప్పులు చోటు చేసుకున్నాయని.. కానీ ఆ సమయంలో తాను అక్కడ లేనని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఎంపి రాహుల్ గాంధీ వెల్లడించారు. అయితే పార్టీ చరిత్రలో తప్పు జరిగిన ప్రతిదానికీ బాధ్యత వహించడానికి తాను ఎప్పుడూ సంతోషంగా ఉంటానని అన్నారు. 80వ దశకంలో జరిగింది తప్పని తాను బహిరంగంగా చెప్పానని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ గుర్తు చేశారు. ఏప్రిల్ 21న అమెరికాలోని బ్రౌన్ విశ్వవిద్యాలయంలోని వాట్సన్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్‌లో జరిగిన ఇంటరాక్టివ్ సెషన్‌లో గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సంభాషణ వీడియోను శనివారం వాట్సన్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్ యొక్క యూట్యూబ్ ఛానెల్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ సందర్భంగా వారు అడిగిన ప్రశ్నలకు రాహుల్ గాంధీ సమాధానమిచ్చారు. భారత్‌లో సిక్కులు తల పాగా ధరించేందుకు, కడా పట్టుకునేందుకు, గురుద్వారాలో ప్రవేశించేందుకు వారు చాలా పెద్ద యుద్ధమే చేయాల్సి వస్తుందంటూ రాహుల్ గాంధీని ఒక యువకుడు సూటిగా ప్రశ్నించారు. అలాగే బిజెపి వల్ల సిక్కుల్లో భయాన్ని నెలకోల్పేందుకు మీరు ప్రయత్నిస్తున్నారంటూ రాహుల్‌తో ఓ యువకుడు పేర్కొన్నారు. అంతేకాదు.. రాజకీయాలు ఎలా ఉండాలో మీరు మాట్లాడారు. తాము కడలు ధరించడమే కాదు. తలపాగలు ధరించడంతోపాటు భావప్రకటన స్వేచ్ఛను సైతం తాము కోరుకుంటున్నామని ఈ సందర్భంగా తెలిపారు. కానీ గతంలో కాంగ్రెస్ పార్టీ దీనిని అనుమతించలేదని స్పష్టం చేశారు. రాహుల్ స్పందిస్తూ 'సిక్కులను ఏదీ భయపెట్టదని నేను అనుకోను. నేను చేసిన ప్రకటన ఏమిటంటే, ప్రజలు తమ మతాన్ని వ్యక్తపరచడానికి అసౌకర్యంగా ఉండే భారతదేశం మనకు కావాలా? కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పుల విషయానికొస్తే, ఆ తప్పులు నేను లేనప్పుడు జరిగాయి, కానీ కాంగ్రెస్ పార్టీ చరిత్రలో చేసిన ప్రతిదానికీ బాధ్యత వహించడానికి నేను సంతోషంగా ఉన్నాను. 80వ దశకంలో జరిగినది తప్పు అని బహిరంగంగా చెప్పానని, స్వర్ణ దేవాలయానికి చాలాసార్లు వెళ్ళానన్నారు. భారతదేశంలోని సిక్కు సమాజంతో తనకు చాలా మంచి సంబంధం ఉందని, వారితో ప్రేమపూర్వక సంబంధం ఉందని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు అన్నారు. 'అందరు గొప్ప రాజకీయ ఆలోచనాపరులు, సామాజిక సంస్కర్తలు. ఒక్కసారి 3000 సంవత్సరాల వెనక్కి వెళ్లండి.. బుద్ధుడు, గురునానక్, కర్ణాటకలో బసవ, కేరళలో నారాయణ గురు, పూలే, గాంధీ, అంబేద్కర్, మీరు ఒకే ప్రవాహాన్ని చూస్తారు. వీరిలో ఎవరూ మతతత్వవాదులు కాదు. ఈ వ్యక్తులలో ఎవరూ 'మేము ప్రజలను చంపాలనుకుంటున్నాము, ప్రజలను ఒంటరిగా చేయాలనుకుంటున్నాము, ప్రజలను అణిచివేయాలనుకుంటున్నాము, పనులు ఒకే విధంగా జరగాలని మేము నమ్ముతున్నాము' అని చెప్పలేదు. మన రాజ్యాంగంలో ఉన్న ఈ ప్రజలందరూ, ముఖ్యంగా ఒకే విషయాన్ని చెబుతున్నారు, వారు అందరినీ సత్యం, అహింసను ముందుకు తీసుకువెళతారు' అని ఉద్ఘాటించారు.

## మార్క్స్‌ను పునర్దర్శించుకోవటం నేటి అవసరం

ఇంగ్లండ్‌లో 1836–1844 మధ్య చార్టిస్ట్ ఉద్యమం (కార్మికులు తమ కోర్కెలపై విజ్ఞాపనలు అందజేసే ఉద్యమం) ప్రారంభమైంది. అది కార్మికవర్గం రాజకీయపాత్ర చేపట్టేందుకు సహాయపడింది. అది 1847–48లో కారల్ మార్క్స్ 'కమ్యూనిస్టు మ్యానిఫెస్టో' ప్రచురించబడిన కాలం కూడాను. అది కార్మికవర్గ పాత్రకు భాష్యం చెప్పింది. సార్వజనీన రూపంలో ఆ ప్రాతను నిర్దిష్టపరిచింది. అది త్వరలోనే ఆధునిక చరిత్ర మొత్తానికి అనువర్తింపచేయబడింది. 1848–1850 కాలంలో ఫ్రాన్స్‌లో వర్గపోరాటాల కాలంలో అది మరింతగా నిర్ధుష్టపరచబడింది. కార్మికవర్గం ఇంకెంతమాత్రం అవ్యవస్థితంగా లేదు, ప్రపంచ చరిత్రలో బలమైన శక్తిగా ఆవిర్భవిస్తున్నది, తన సొంత వ్యూహం, ఎత్తుగడలను కూడా అభివృద్ధి చేసుకుంటున్నది. ఈ క్రమంలో అది చైతన్యం కలిగిన చారిత్రకవర్గంగా తయారైంది. చరిత్ర గూర్చిన భౌతికవాద భావన నిర్దిష్టంగా అనువర్తింపజేయుటం ద్వారా ఆ మొత్తం క్రమం కనుగొనబడింది, విశ్లేషించబడింది. రాజకీయపోరాటాలు ప్రాథమికంగా రెండువర్గాల ఆర్థిక ప్రయోజనాల మధ్య సంఘర్షణ అని కారల్ మార్క్స్, తాను ప్రవేశపెట్టిన శాస్త్రీయ పద్ధతి ద్వారా వెలుగులోకి వచ్చిందని ఫ్రెడరిక్ ఏంగెల్స్ కూడా పేర్కొన్నారు. ఆ 40వ దశాబ్దంలోని చివరి సంవత్సరాలు 1847లో సంభవించిన ప్రపంచ వాణిజ్య సంక్షోభం కారణంగా ఎంతో కల్లోలంగా తయారైనాయి. 1848 ఫిబ్రవరిలో, మార్చిలో రెండు విప్లవాలకు హేతుబద్ధతను ఇచ్చాయి.

భౌతికవాద తాత్వికుడు, శాస్త్రవేత్త అయిన మార్క్స్ పెట్టుబడిదారీ విధానం ఆవిర్భావాన్ని, దాని అంతాన్ని గుర్తించారు. ఆధునిక యుగం మానవుడైన కారల్‌మార్క్స్ 19వ శతాబ్దంలోని మూడు ప్రధాన సైద్ధాంతిక ధోరణులను గుర్తించిన మహామేధావి. ఆయన 1818, మే 5న జర్మనీలోని (నాడు ప్రష్యాలో భాగం) ట్రైయిర్స్ అనే చిన్న పట్టణంలో మధ్యతరగతి ఉదారవాద



కుటుంబంలో జన్మించారు. మార్క్స్ ఆ ధోరణులను సైద్ధాంతికం, రాజకీయ అర్థశాస్త్రం, ఫ్రెంచి విప్లవ సిద్ధాంతాలుగా గుర్తించారు. సిద్ధాంతం జర్మనీ ప్రాచీన తత్వశాస్త్రానికి ప్రాతినిధ్యం వహిస్తుండగా, రాజకీయ అర్థశాస్త్రం ప్రాచీన ప్రామాణిక ఇంగ్లీష్ తాత్వికతకు ప్రతిరూపం. మూడవ ధోరణి స్థూలంగా ఫ్రెంచి విప్లవ ప్రతిపాదనలతో పోల్చదగినది. ఈ ధోరణులను కలిపిచూస్తే అవి భౌతికవాదం అవుతాయి. యావత్ నాగరిక ప్రపంచంలో కార్మికవర్గానికి అది సిద్ధాంతం, ఆధునిక శాస్త్రీయ సోషలిజం కార్యక్రమం అయింది. తన మహా మేధాశక్తితో మార్క్స్ ఇలా పేర్కొన్నారు. ''ప్రపంచం నిజమైన ఐక్యత దాని పాదార్థికవాదంతో కూడుకుని ఉంది... 'తత్వశాస్త్రం, ప్రకృతి శాస్త్రం దీర్ఘకాలంలో, చికాకు కలిగించే తర్జనభర్జనలతో అభివృద్ధి చెందిన తీరు దీన్ని రుజువు చేస్తున్నది.' పదార్థం ఉనికి రూపం చలనం అని కూడా ఆయన పేర్కొన్నారు. పదార్థం లేకుండా చలనం అస్థిత్వంలో ఉండలేదు. పదార్థం విషయంలోనూ అది అంతే నిజం. ఆలోచనలు, చైతన్యం అంటే ఏమిటి? అవి ఎక్కడి నుంచి వస్తాయి? అనే ప్రశ్నకు ఈ వాస్తవం దారితీస్తుంది. స్వయంగా పాదార్థికవాది అయిన మార్క్స్ అవన్నీ మెదడు నుంచి కలుగుతాయని, మానవ ప్రాణియే ప్రకృతి నుంచి ఉద్భవించిన పదార్థం అని సమాధానమిచ్చారు. మానవపరిణామమే శ్రమ, భాష వల్ల పురోభివృద్ధి చెందింది. అవసరాలు తీర్చుకోవటానికి శ్రమ చేయడం ముఖ్యం. అందుకు గాను మనిషి పనిముట్లు తయారుచేసుకున్నాడు. పరస్పరం సంభాషించుకోవటానికి భాష ముఖ్యం. అది చైతన్యం వికసించటానికి సహాయపడింది. మార్క్స్, ఏంగెల్స్ ఇలా రాశారు : ప్రపంచాన్ని సర్వసిద్ధంగా ఉంచిన వస్తువుల మేరుపర్వతంగా అవగాహన చేసుకోకూడదు. అదొక సంక్లిష్టమైన క్రమం. అందులో వస్తువులు మనస్సులో కనిపించే వాటి ప్రతిరూపాలకన్నా తక్కువ అస్థిరంగా ఉండవు. ఈ క్రమం అవిచ్ఛిన్నమైన మార్పుతో ఉనికిలోకి వచ్చిపోతుండే వస్తువుల రూపంలో ఉంటుంది. ఈ గొప్ప ప్రాథమికమైన ఆలోచన, హెగెల్ నాటి నుండీ ఎన్నడూ ఖండనకు గురికాలేదు. ఈ సాధారణ ఆలోచనా క్రమం ఖండనకు గురికాకుండా కొనసాగుతూ వుంది. గతి తార్కికత ఇక్కడే వస్తుంది. దాని ప్రకారంగా ఏదీ అంతిమం, పరిపూర్ణం కాదు, పవిత్రమైంది కూడా కాదు. అది ప్రతిదానియొక్క తాత్కాలిక లక్షణాన్ని వెల్లడిస్తుంది. దానిముందు ఏదీ దీర్ఘకాలం మనుగడలో ఉండదు. దానిప్రకారం పదార్థం ఎప్పుడూ చలనంలో ఉంటుంది, ముగుస్తుంది, కొత్త లక్షణాలతో తిరిగివస్తుంది. ఈ క్రమమే గతితార్కికం, ఐక్యతలో, పోరాటంలో ఎల్లప్పుడూ వస్తూపోతూ ఉంటుంది. గతి తార్కిక భౌతికవాదం అనేది మెదడులో ఈ క్రమం ప్రతిబింబం తప్ప మరొకటి కాదు. కాబట్టి, గతితార్కికత అనేది సర్వసాధారణ చలన సూత్రాల శాస్త్రం–అది బాహ్యప్రపంచం, మానవ ఆలోచన రెండూను. లెనిన్ ప్రకారం, గతి తార్కిక భౌతికవాదానికి దానిపై నిలబడే తత్వశాస్త్రం అవసరం ఇంకెంతమాత్రం లేదు మార్క్స్‌ను పునర్దర్శనం చేసుకోవలసిన సమయం ఇది.

మార్క్స్ ఏ ఇతర శాస్త్రజ్ఞునికన్నా ఎక్కువగా 20 శతాబ్దాన్ని ప్రభావితం చేశారు. అప్పుడు అతన్ని పునర్దర్శించుకున్నారు. ఆయన ఉనికి కొనసాగుతుంది. ప్రవక్తలాంటి ఆయన వచనాలు ఇలా చెబుతున్నాయి: ''పెట్టుబడిదారీ వ్యవస్థ తన సమాధి తవ్వేవాళ్లను అదే తెచ్చుకుంటుంది.'' ఆయన రాజకీయ అర్థశాస్త్రం ఆయన ప్రాథమిక సూత్రీకరణ. ఫ్యూడలిజం అంతమై పెట్టుబడిదారీ విధానం వచ్చినట్లు, సమాజ పరిణామ గతితార్కిక క్రమం సోషలిజం దిశను సూచిస్తున్నది. వ్యవస్థ మార్పు అనేది ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తి సంబంధాలు రెండింటిలోనూ విప్లవాత్మక మార్పు. పెట్టుబడిదారీ విధానం – సోషలిజం మధ్య మార్పు టెక్నాలజీని ముందుకు తీసుకుపోవటంలో వస్తుంది. ఉత్పత్తి సాధనాల్లో కూడా మార్పు వస్తుంది. ఈ మార్పు తనతోపాటు పెట్టుబడిదారీ విధానంలో మరికొంత పరిణామం తెస్తుంది. ద్రవ్యపెట్టుబడి సందర్భాన్ని అది తొలగిస్తుంది. దానికి తొలి సూచన – పారిశ్రామిక క్రమం పురోగతిలో తగ్గుదల, పెట్టుబడిలో తగ్గుదల, పెట్టుబడిదారీ క్రమం కుంచించుకుపోవటం.

ఆర్థిక వ్యవస్థ గుత్తపెట్టుబడి కిందకు రావటం పెట్టుబడి కేంద్రీకరణకు, రాజ్యాధికారంపై దాని ఆధిపత్యానికి దారితీస్తుంది. అది వ్యవస్థలో గుడ్డి విశ్వాసాన్ని ప్రోత్సహిస్తుంది. దానికి ఎదురయ్యే వ్యతిరేకతను ఆటవికంగా అణచివేస్తుంది. దాని సూక్ష్మ ఛాయలను నేటి ప్రపంచంలోని అనేక భాగాల్లో చూస్తున్నాం. మన దేశం కూడా అందుకు దూరంలో లేదు. ద్రవ్యపెట్టుబడిపాలన ప్రతి ఒక్క రంగంలో కనిపిస్తున్నది. పెట్టుబడిదారీ విధానానికి సంబంధించినంతవరకు, అది రాజీ వ్యూహాలను, వ్యతిరేకతను రెండింటినీ చేబడుతుంది. మరోవైపున ద్రవ్య పెట్టుబడి తన అధికారానికి బలం చేకూర్చేందుకై ప్రతిపక్ష లౌకిక శక్తులను బలహీనపరచే విచ్ఛిన్న సాధనాల్లో ఒకటిగా మతోన్మాదాన్ని చేబట్టింది.

– కృష్ణ ఝా

## కుల గణనపై మోదీలో ఆకస్మిక మార్పు



**న్యూఢిల్లీ :** కుల గణనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యుటర్న్ తీసుకున్నారని కాంగ్రెస్ పేర్కొంది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తన విధానాన్ని అధికారికంగా మార్చుకుందని, అటువంటి సర్వే కోసం ఒక కాలక్రమానికి కట్టుబడి ఉందని అంగీకరించే నిజాయితీ ఆయనకు ఉందా అని ప్రశ్నించింది. కుల గణనపై ప్రధానమంత్రి మోదీ ఆకస్మిక, సంపూర్ణ, నిరాశాజనకమైన మలుపు తీసుకున్నట్లు ఆధారాలు పుష్కలంగా ఉన్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. ఏప్రిల్ 28, 2024న ఒక టీవీ ఇంటర్వ్యూలో కుల గణనను డిమాండ్ చేస్తున్న వారందరినీ మోదీ 'పట్టణ నక్సల్స్'గా ముద్రవేశారని ఉదాహరణలను ఉటంకిస్తూ రమేష్ అన్నారు. జనాభా గణనలో ఎస్‌సి, ఎస్‌టిలు కాకుండా ఇతర కులాల వారీగా జనాభాను లెక్కించకూడదని విధానపరంగా నిర్ణయించింది జులై 20, 2021న, మోదీ ప్రభుత్వం పార్లమెంటుకు తెలిపిందని జైరామ్ రమేష్ ఎక్స్‌లో పోస్టు చేశారు. సెప్టెంబర్ 21, 2021న సుప్రీంకోర్టుకు దాఖలు చేసిన అఫిడవిట్‌లో, 'జనాభా గణన (2021) పరిధి నుండి ఏదైనా ఇతర కులానికి (ఎస్సీలు మరియు ఎస్టీలు కాకుండా) సంబంధించిన సమాచారాన్ని మినహాయించడం అనేది మునుపటి పేరాల్లో వివరించిన విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఒక చేతన విధాన నిర్ణయం' అని మోదీ ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. వాస్తవానికి ఒబిసిల కోసం కుల గణనను ఆదేశించవద్దని మోదీ ప్రభుత్వం సుప్రీంకోర్టును స్పష్టంగా కోరింది. అటువంటి పరిస్థితిలో రానున్న జనాభా గణన, 2021లో గ్రామీణ భారతదేశంలోని బిసిసిలకు సంబంధించిన సామాజిక,ఆర్థిక డేటాను లెక్కించాలని ఈ గౌరవనీయ న్యాయస్థానం నుండి జనాభా గణన శాఖకు ఏదైనా ఆదేశం, ప్రార్థన చేసినట్లుగా, చట్టంలోని సెక్షన్ 8 కింద రూపొందించిన విధాన నిర్ణయంలో జోక్యం చేసుకున్నట్లు అవుతుంది అని రమేష్ అన్నారు. ప్రధానమంత్రికి మూడు ప్రశ్నలు సంధిస్తూ, గత 11 సంవత్సరాలుగా కుల గణనపై తన ప్రభుత్వం తన విధానాన్ని అధికారికంగా మార్చుకుందని అంగీకరించే నిజాయితీ మీకు ఉందా అని రమేష్ అడిగారు. ప్రభుత్వ విధానంలో మార్పుకు గల కారణాలను ప్రజలకు, పార్లమెంటుకు వివరిస్తారా అని రమేష్ అడిగారు. ప్రధాని కుల గణన కోసం కాల పరిమితికి కట్టుబడి ఉంటారా అని కూడా ఆయన ప్రశ్నించారు. ప్రతి మంచి పథకం లేదా విధానాన్ని మొదట వ్యతిరేకించడం, దానిని కించపరచడం, ప్రజల ఒత్తిడి, వాస్తవికత నేపథ్యంలో అదే విధానాన్ని అవలంబించడం అనే దాని నమూనాకు ప్రభుత్వ కుల గణన నిర్ణయం అనుగుణంగా ఉందని కాంగ్రెస్ పేర్కొంది. ప్రధాని మోదీ 'గడువు లేకుండా శీర్షిక ఇవ్వడంలో నిష్ణాతుడు' అని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్తాన్‌పై బలమైన చర్య తీసుకోవాలనే డిమాండ్ల నేపథ్యంలో ప్రభుత్వ కుల గణన నిర్ణయాన్ని 'మళ్లింపు వ్యూహం' అని పేర్కొంది. స్వాతంత్ర్యానంతరం మొదటిసారిగా కుల గణన తదుపరి జనాభా గణనలో భాగంగా ఉంటుందని, కుల వివరాలను చేర్చనున్నట్లు కేంద్రం బుధవారం ప్రకటించింది. కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు దేశవ్యాప్తంగా కుల గణనను నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి, దీనిని ప్రధాన ఎన్నికల అంశంగా మార్చాయి. బీహార్, తెలంగాణ, కర్ణాటక వంటి కొన్ని రాష్ట్రాలు ఇటువంటి సర్వేలను నిర్వహించాయి.

## పద్మశ్రీ అవార్డు గ్రహీత బాబా శివానంద్ కన్నుమూత



**వారణాసి :** ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, పద్మశ్రీ అవార్డు గ్రహీత బాబా శివానంద్ శనివారం రాత్రి ఆరోగ్య సమస్యల కారణంగా కన్నుమూశారు. బాబా శివానంద్ (128) కొన్ని అనారోగ్య సమస్యల కారణంగా ఏప్రిల్ 30న బిహెచ్‌యు ఆసుపత్రిలో చేరారు. శనివారం రాత్రి ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని కబీర్‌నగర్ కాలనీలోని ఆయన నివాసంలో ఉంచారు. కాగా, శివానంద్ బాబా మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. యోగా సాధకుడు, కాశీ నివాసి శివానంద్ బాబా జీ మరణం చాలా బాధాకరం. యోగా సాధనకు అంకితమైన ఆయన జీవితం దేశంలోని ప్రతి తరానికి స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. యోగా ద్వారా సమాజానికి సేవ చేసినందుకు ఆయనకు పద్మశ్రీ కూడా లభించింది. శివానంద్ బాబా నిష్క్రమణ కాశీ నివాసితులందరికీ ఆయన నుంచి ప్రేరణ పొందిన కోట్లాది మందికి తీరని లోటు. ఈ దుఃఖ సమయంలో నేను ఆయనకు నివాళులు అర్పిస్తున్నానని ప్రధాని మోదీ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సంతాపం తెలియజేశారు. శివానంద్ బాబా వారణాసిలోని భేలుపూర్ ప్రాంతంలోని దుర్గాకుండ్‌లో ఉన్న కబీర్ నగర్‌లో నివసించారు. ఆయన ప్రతిరోజూ కూడా క్రమం తప్పకుండా యోగా, ప్రాణాయామం చేసేవారు. ఆయన జీవితం బ్రహ్మచర్యానికి అనేక మందికి ఉదాహరణగా నిలిచింది. 2022లో అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శివానంద్ బాబాను పద్మశ్రీతో సత్కరించారు. ఆ గౌరవాన్ని అందుకోవడానికి, ఆయన చెప్పులు లేకుండా రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో ఆయన మోకాళ్లపై కూర్చుని ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి మోదీ కూడా ఆయనను గౌరవించడానికి తన కుర్చీలోంచి లేచి నిలబడ్డారు. అప్పటి రాష్ట్రపతి కోవింద్ కూడా వంగి బాబాను గౌరవంగా పైకి లేపారు. శివానంద్ బాబా యోగాభ్యాసం ప్రధాని మోదీని ప్రత్యేకంగా ఆకట్టుకుంది.

### బ్రిటిష్ ఇండియాలో..

శివానంద్ బాబా 1896 ఆగస్టు 8న అప్పటి బ్రిటిష్ ఇండియాలోని శ్రీహట్టి (ఇప్పుడు బంగ్లాదేశ్‌లో ఉంది)లో ఒక పేద బ్రాహ్మణ భిక్షాటన కుటుంబంలో జన్మించారు. ఆయన నాలుగు సంవత్సరాల వయసులోనే తల్లిదండ్రులు అతన్ని నవద్వీప్ నివాసి బాబా ఓంకారానంద్ గోస్వామికి


ఫైల్

అప్పగించారు. అతనికి ఆరు సంవత్సరాల వయసులో, అతని తల్లిదండ్రులు, సోదరి ఆకలితో చనిపోయారు. ఆ తరువాత, అతను తన జీవితాంతం బ్రహ్మచర్యాన్ని అనుసరించాడు. ఆ క్రమంలో తన జీవితాన్ని యోగా, తపస్సు, సేవకు అంకితం చేశారు. యోగాతో పాటు శివానంద్ బాబాకు ప్రజాస్వామ్యంపై కూడా అచంచలమైన నమ్మకం ఉంది. ఆయన ప్రతి ఎన్నికల్లో కూడా వారణాసికి వెళ్లి ఓటు వేసేవారు. ఆయన మరణం యోగా, భారతీయ సంప్రదాయంలోని ఒక ప్రత్యేకమైన యుగానికి ముగింపు పలికిందని చెప్పవచ్చు.

## ఈ ఏడాది ఎన్‌సిడబ్ల్యుకి 7,698 ఫిర్యాదులు

**న్యూఢిల్లీ :** ఈ ఏడాదికి జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యు)కు 7,698 ఫిర్యాదులు అందాయి. దేశ వ్యాప్తంగా గృహహింస, దాడి, నేరపూరిత బెదిరింపులు వంటి అత్యంత సాధారణ ఫిర్యాదులు ఉన్నాయి. ఈ ఏడాది ప్రారంభం నాటి నుంచి గృహహింస ఫిర్యాదులు అత్యధికంగా 1,594 వచ్చాయి. జనవరిలో 367 కేసులు, ఫిబ్రవరిలో 390, మార్చిలో 513, ఏప్రిల్‌లో 322, మేలో రెండు ఉన్నాయి. అన్ని ఫిర్యాదులలో కేవలం గృహహింస ఫిర్యాదులు దాదాపు 20 శాతంగా ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఆ తరువాత స్థానంలో క్రిమినల్ బెదిరింపు ఫిర్యాదులు ఉన్నాయి. మూడు నెలల్లో 989 కేసులు నమోదయ్యాయి. జనవరిలో 268, ఫిబ్రవరిలో 260, మార్చిలో 288, ఏప్రిల్‌లో 170, మేలో మూడు దాఖలయ్యాయి. మూడవ స్థానంలో అత్యంత సాధారణంగా సమస్య అయిన దాడి ఉన్నది. మొత్తం 950 ఫిర్యాదులు రాగా, జనవరిలో 249, ఫిబ్రవరిలో 239, మార్చిలో 278, ఏప్రిల్‌లో 183, మేలో ఒకటి నమోదయ్యాయి. ఇతర ముఖ్యమైన ఫిర్యాదుల్లో వరకట్న వేధింపులకు సంబంధించి 916, అత్యాచారం, అత్యాచార యత్నానికి సంబంధించి 394 ఫిర్యాదులు, మహిళలను వేధించడం లేదా అవమానించడం వంటి ఫిర్యాదులు 310 ఉన్నాయి. లైంగిక వేధింపులకు సంబంధించి 302 ఫిర్యాదులు, మహిళలపై సైబర్ నేరాలు 110 కేసులు నమోదయ్యాయి. ద్విభార్యత్వం, కార్యాలయంలో లైంగిక వేధింపులు వంటివి తరచుగా వస్తున్నప్పటికీ, అలాంటి కేసులు కూడా ఈ సారి వచ్చాయి. ఉత్తరప్రదేశ్‌లో అత్యధిక సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి. మొదటి త్రైమాసికంలో 3,921 కేసులు నమోదయ్యాయి. జనవరిలో 952, ఫిబ్రవరిలో 841, మార్చిలో 957, ఏప్రిల్‌లో 1,087 మరియు మేలో 84 నమోదయ్యాయి. ఈ సంఖ్య దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం ఫిర్యాదులలో 50 శాతానికి పైగా ఉంది. తర్వాత ఢిల్లీలో 688 ఫిర్యాదులు వచ్చాయి. అందులో జనవరిలో 146, ఫిబ్రవరిలో 172, మార్చిలో 184, ఏప్రిల్‌లో 183, మేలో మూడు, మహారాష్ట్రలో 473 ఫిర్యాదులు నమోదయ్యాయి. మధ్యప్రదేశ్, బీహార్, హర్యానా రాష్ట్రాలలో 351, 342, 306 ఫిర్యాదులు వచ్చాయి. గత సంవత్సరం ఎన్‌సిడబ్ల్యు పోర్టల్‌లో మొత్తం 25,743 ఫిర్యాదులు వచ్చాయి, గౌరవంగా జీవించే హక్కు, గృహ హింస, వరకట్న వేధింపుల వర్గాల కింద ఫిర్యాదులు పోర్టల్‌లో అందిన అత్యంత సాధారణ ఫిర్యాదులు.

## ఇడి అధికారాల తీర్పుపై దాఖలైన పిటిషన్ల విచారణకు.. త్రిసభ్య ధర్మాసనాన్ని పునర్నిర్మించిన 'సుప్రీం'

**న్యూఢిల్లీ :** ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్‌ఎ) కింద అరెస్ట్ చేసి ఆస్తులను జప్తు చేయడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) అధికారాలను సమర్థిస్తూ 2022లో ఇచ్చిన తీర్పును పున: పరిశీలించాల్సిన అవసరం ఉందా అని నిర్ణయించడానికి సుప్రీంకోర్టు ముగ్గురు సభ్యుల ధర్మాసనాన్ని పునర్నిర్మించింది. 2022 తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ల బ్యాచ్‌ను పునర్నిర్మించబడిన జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టనుంది, మే 7న ఈ అంశం విచారణకు జాబితా చేయబడింది. అంతకుముందు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కాంత్, జస్టిస్ భుయాన్, జస్టిస్ సిటి.రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై విచారించింది. అయితే జస్టిస్ రవికుమార్ జనవరి 5న పదవీవిరమణ చేశారు. మార్చి 6న డివిజన్ బెంచ్ ముందు ఈ పిటిషన్లు జాబితా చేసిన తర్వాత, ఈ అంశంపై హాజరైన న్యాయవాదులను ఉద్దేశించి జస్టిస్ కాంత్ మాట్లాడుతూ అది తప్పుగా జాబితా చేయబడిందని చెప్పారు. ఈ దీనికి సంబంధించిన పిటిషన్ విచారణను త్వరలోనే త్రిసభ్య ధర్మాసనం ముందుకు వస్తుందని జస్టిస్ హామీ ఇచ్చారు. పిఎంఎల్‌ఎ కింద సెర్చ్, సీజ్ చేయడం, మనీలాండరింగ్‌లో భాగస్వాములైన వారి ఆస్తిని జప్తుచేయడం, అరెస్ట్ చేయడం వంటి అధికారాలను ఈడి కలిగి ఉండటాన్ని సుప్రీంకోర్టు 2022జులైలో సమర్థించింది. 2022 ఆగష్టులో అత్యున్నత న్యాయస్థానం పిటిషన్ల విచారణను సమీక్షించాలన్న అభ్యర్థనలను అంగీకరించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఇసిఐఆర్) అందించని రెండు అంశాలు, నిర్దోషిత్వాన్ని పున:



ప్రారంభించడాన్ని పున:పరిశీలించాల్సిన అవసరం ఉందని గమనించింది. ఆర్థిక వ్యవస్థ సజావుగా పనిచేయడానికి ఆర్థిక వ్యవస్థ ఒక ముప్పు అని, ప్రపంచవ్యాప్తంగా సర్వసాధారణమని గమనించిన సుప్రీంకోర్టు పిఎంఎల్‌ఎలోని కొన్ని నిబంధనల చెల్లుబాటును సమర్థిస్తూ అది 'సాధారణ నేరం కాదు' అని నొక్కిచెప్పింది. 2022 చట్టం కింద అధికారులు 'పోలీస్ అధికారులు ఏమీ కాదని అలా వ్యవహరించడానికి' అని సుప్రీంకోర్టు చెప్పింది. కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సిఆర్‌పిసి) కింద ఎఫ్‌ఐఆర్ చేయడానికి ఇసిఐఆర్ దానికి సమానమైనది కాదని వివరించింది. సంబంధిత వ్యక్తికి ప్రతీ సందర్భంలోనూ ఇసిఐఆర్ కాపీని అందజేయడం తప్పనిసరి కాదని, ఈడి అరెస్ట్ సమయంలో దానికి గల మూలకారణాలు ఏమిటన్నది వెల్లడిస్తే సరిపోతుందని ధర్మాసనం తెలియజేసింది. పిఎంఎల్‌ఎకు సంబంధించిన పలు నిబంధనల గురించి ఇతర దర్యాప్తు సంస్థలు, వ్యక్తులు దాఖలు చేసిన 200కు పైగా పిటిషన్ల బ్యాచ్ ధర్మాసనం ముందుకు వచ్చిన నేపథ్యంలో తీర్పు వెలువడింది. ప్రభుత్వం దీనిని ఆయుధంగా చేసుకుని ప్రతిపక్షాలను వేధించేందుకు ఆయుధంగా ఉపయోగించుకుంటున్నదని పిటిషన్‌దారులు పలువురు ఆరోపించారు.

## 'నమామీ గంగే' వ్యర్థాల నిర్వహణ విజయవంతం

### పార్లమెంటరీ కమిటీకి కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ :** నమామి గంగే కార్యక్రమం కింద వ్యర్థాల నిర్వహణ విజయవంతమైనదని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ పార్లమెంటరీ కమిటీకి తెలిపింది. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని రెండు ప్రాంతాలు మినహాయించి అంతటా 'నమామి గంగే కార్యక్రమం' నిర్వహణ కొనసాగింది. మూడు ప్రమాణాలను పరిగణనలోనికి తీసుకుని స్నానపు నీటి ప్రమాణాలను పాటించింది. 2017 సంవత్సరం నుంచి నది ప్రధానప్రాంతంలో ఎలాంటి చేపల మరణాలు సంభవించలేదని ఒక అధికారిక నివేదిక వెల్లడించింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ వాతావరణ మార్పు నీటి కాలుష్యంపై పార్లమెంటరీ కమిటీకి అందజేసిన ఒక నోట్‌లో 'ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్స్ రెస్పాన్సిబిలిటీ' (ఇపిఆర్)లో గణనీయమైన అంతరాన్ని ముఖ్యంగా ప్రస్తావించింది. ఒక సమగ్రవిధానం ధ్యేయంగా వివిధరకాల వ్యర్థాలను తొలగించడం, బాధ్యతలను నిర్వర్తించడం, లక్ష్యాలను సాధించడం జరిగిందని ఆ నివేదిక వెల్లడించింది. పర్యావరణ అనుకూల వాహనాలను స్వీకరించాలనే ఒత్తిడి మధ్య దేశ వ్యాప్తంగా బ్యాటరీ వ్యర్థాల కోసం ఇపిఆర్ ఆబ్లిగేషన్ 3.35లక్షల మెట్రిక్ టన్నులపైన ఉండగా లక్ష్యం కేవలం 53,755 మెట్రిక్ టన్నులను మాత్రమే సాధించిందం జరిగిందని నివేదిక తెలియజేసింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఈ సమాచారాన్ని సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పులపై ఏర్పాటైన స్టాండింగ్ కమిటీకి



సమర్పించింది. అదేసమయంలో ప్లాస్టిక్ వ్యర్థం కోసం ఇపిఆర్ ఆబ్లిగేషన్ 34లక్షల మెట్రిక్ టన్నులకు పైగానే ఉన్నప్పటికీ దాదాపు 19లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని మాత్రమే సాధించిందని తెలిపింది. అయితే ఈవేస్ట్ విషయంలో జాతీయ స్థాయి గణాంకాలను పరిశీలిస్తే మెరుగ్గానే ఉన్నదని వివరించింది. ఇపిఆర్ ఆబ్లిగేషన్ 2.54 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 2.75లక్షల మెట్రిక్ టన్నుల వద్ద నిలిచింది. టైర్ వ్యర్థాల విభాగంలో ఇపిఆర్ ఆబ్లిగేషన్ 20.35లక్షల టన్నులకుగాను దాదాపు 17.32 లక్షల టన్నులు సాధించడం జరిగిందని నివేదిక వెల్లడించింది. నరేంద్ర మోదీ ప్రభుత్వం గంగానది పరిరక్షణ, పునరుజీం కోసం 'నమామీ గంగా కార్యక్రమాన్ని' ప్రారంభించిందని నోట్ పార్లమెంట్ కమిటీకి తెలిపింది. గంగా జలాలు పిహెచ్‌ను ఆమోదించాయని, కాన్పూర్‌లోని పురానా రాజ్‌పూర్, ఫరూఖాబాద్, మిర్జాపూర్ నుంచి తరిఘాట్ తప్ప అంతటా స్నానంచేయడానిక ఆక్సిజన్ డిమాండ్ ప్రమాణాలను రద్దు చేశాయని పేర్కొంది.



# జనరల్

STATE & REGIONAL NEWS

## 5 వ తరగగతి ‘ గురుకుల సెట్-2025’ ఫలితాలు విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ ) ఆధ్వర్యంలో టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్, టిజిటిడబ్ల్యుఆర్ఇఐఎస్,టిజిఎంజెబిపిడబ్ల్యుఆర్ఇఐఎస్,టిజిఆర్ఇఐఎస్) 5 వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశపరీక్షలో ఫేస్ 2లోని వివిధ కేటగిరికి చెందిన ఫలితాలను ఆదివారం విడుదల చేశారు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారి ఫలితాలను మొదటి ఫేజ్ లో రెండు దఫాలుగా విడుదల చేయగా, మిగిలిన వివిధ కేటగిరీలకు చెందిన 13 ,130 సీట్ల ఫలితాలను టిజి సెట్ 2025 చీఫ్ కన్వీనర్ డాక్టర్ వి.ఎస్ అలగు వర్షిణి విడుదల చేసినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థుల జాబితా కోసం గురుకుల అధికారిక వెబ్‌సైట్‌లో (www.tgswreis.telangana.gov.in) ఫలితాలను చూసుకోవాలని సూచించారు. అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోపు సంబంధిత ఇనిస్టిట్యూట్ లో రిపోర్ట్ చేయాలని అలగు వర్షిణి తెలిపారు.



## ‘వియత్నాం’లో తెలంగాణ ప్రభుత్వ పథకాలను విపులీకరించిన ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వియత్నాంలో జరుగుతున్న అంతర్జాతీయ రాజకీయ శిక్షణా కార్యక్రమంలో ఆదివారం జరిగిన ‘భారత దేశంలో రాజకీయ వ్యవస్థ,పార్టీలు, ప్రముఖ రాజకీయ నేతలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, తెలంగాణలో ప్రజా పాలన’’ అనే అంశంపై భారత ప్రతినిధిగా హాజరైన కాంగ్రెస్ ఎంఎల్‌సి డాక్టర్ బల్మూర్ వెంకట్ ప్రసాంగించారు. దేశంలోని రాజకీయ వ్యవస్థ, ప్రముఖ రాజకీయ నాయకుల చరితరను వివరించడంతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. నాలుగు రోజులుగా జరుగుతున్న ఈ అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమంలో 13 దేశాల నుంచి ప్రతి నిధులు పాల్గొనగా, భారత్ నుంచి బల్మూర్ వెంకట్‌తో పాటు బూసా అనులేఖ హాజరయ్యారు.

## పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయండి

డిగ్రీ పరీక్షలు నిర్వహించండి

మాజీ మంత్రి హరీశ్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, తక్షణమే డిగ్రీ పరీక్షలు నిర్వహించి, విద్యార్థుల జీవితాలు అంధకారం కాకుండా కాపాడాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు నెలల్లో మొత్తం బకాయిలను క్లియర్ చేస్తామని, కళాశాల యాజమాన్యాలకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ నీటి మూటగా మారిందని ఎద్దేవా చేశారు. సిఎం నుంచి మంత్రుల వరకు ఎవ్వరూ మాటమీద నిలబడటం లేదని, ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని హరీశ్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఏటా సగటున రెండు వేల కోట్ల రూపాయల చొప్పున తొమ్మిదిన్నరేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో మొత్తం రూ.19వేల కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేశామని హరీశ్ రావు వివరించారు. బడా కాంట్రాక్టర్లకు వేల కోట్ల బిల్లులు చెల్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, విద్యార్థులకు చెందిన ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులను ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. డిగ్రీ కళాశాలలకు దాదాపు రూ.800ల కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో 6 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో పరీక్షలు నిర్వహించకపోతే పిజిసెట్, లా సెట్, ఇతర పోటీ పరీక్షలు రాయడానికి మూడో సంవత్సరం విద్యార్థులు అర్హత కోల్పోతున్నారని తెలిపారు.

## వాహనాలు, డ్రిల్లింగ్ యంత్రాలను తగలబెట్టిన మావోయిస్టులు

**లాతేహర్ :** జార్ఖండ్‌లోని లాతేహర్ జిల్లాలో మావోయిస్టులు ఆరు వాహనాలు, రెండు డ్రిల్లింగ్ యంత్రాలను తగలబెట్టారని పోలీసులు ఆదివారం తెలిపారు. చంద్వా పోలీస్ స్టేషన్ పరిధిలోని తురిసాట్ గ్రామంలో శనివారం రాత్రి ఈ సంఘటన జరిగిందని ఒక సీనియర్ అధికారి తెలిపారు. బాలుమత్ డిఎస్‌పి వినోద్ రావణి మాట్లాడుతూ, రెండు కార్లు, అనేక ట్రక్కులు సహా ఆరు వాహనాలు, రెండు డ్రిల్లింగ్ యంత్రాలను తగలబెట్టినట్లు తెలిపారు. మావోయిస్టులు నుండి విడిపోయిన ఒక సమూహం ఈ సంఘటనలో పాల్గొనవచ్చని మరొక పోలీసు అధికారి తెలిపారు. గ్రామంలో పనిచేస్తున్న కార్మికులు, మావోయిస్టు దుస్తులలో ఉన్న కొంత మంది వ్యక్తులు వచ్చి తమ మొబైల్ ఫోన్‌లను దోచుకున్నారని ఆరోపించారు. వారు వాహనాలను తగలబెట్టారని ఒక కార్మికుడు తెలిపారు.

## సుంకాలు, వాణిజ్యం యుద్ధంతో సమానం : బఫెట్

**ఒమహా :** వాణిజ్యాన్ని దేశాలపై ఒక ఆయుధంగా ఉపయోగించడం ట్రంప్ చేసిన అతిపెద్ద తప్పిదమని బెర్క్‌షైర్ హాత్‌వే చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వారెన్ బఫెట్ విమర్శించారు. ట్రంప్ ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ట్రంప్ అనుసరించిన ‘‘ట్రేడ్ అండ్ టారిఫ్ విధానం’’ యుద్ధంతో సమానమైనదని ఆయన అన్నారు. అమెరికా నెబ్రస్కా రాష్ట్రంలోని ఒమహాలో బెర్క్‌షైర్ హాత్‌వే వాటాదారుల ఈ వార్షిక సమావేశం జరిగింది. తాను సిఇఓ పదవి నుండి వైదొలగుతున్నట్లు బఫెట్ ప్రకటించిన వెంటనే సమావేశానికి హాజరైన వేలాదిమంది లేచి నిలబడి ఆయన గౌరవార్థం చప్పట్లు కొడుతూ స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ఆర్థిక రక్షణవాద చర్యలు దీర్ఘకాలంలో ప్రతికూల పరిస్థితులకు దారితీస్తాయని వారెన్ బఫెట్ హెచ్చరించారు. అమెరికా పత్రికలు శనివారంనాడు ఈ వార్తలు ప్రచురించాయి. బెర్క్‌షైర్ హాత్‌వే గతంలో ఎన్నడూలేనిరీతిలో ఈ త్రైమాసికంలో ఘోరంగా లాభాలు నష్టపోయింది.బెర్క్‌షైర్ హాత్‌వే ఆపరేషనల్ ఆదాయాలు 14 శాతం మేరకు క్షీణించాయి. అదేవిధంగా వారెన్ బఫెట్ కూడా సిఇఓ పదవి నుండి వైదొలగుతున్నట్లు ప్రకటించారు.

## అక్రమార్కులపై పోలీసుల ఉక్కుపాదం

4 కేజీల గంజాయి పట్టివేత : నిందితుల అరెస్టు



**ప్రజాపక్షం/మధిర:** అక్రమార్కులపై స్థా నిక పోలీసులు ఉక్కుపాదం మోపారు. మ ధిర టౌన్ ఎస్‌హెచ్ఓ, ట్రైనీ ఐపిఎస్ రుత్విక్ సాయి ఆధ్వర్యంలో అక్రమంగా గంజా యి, ఇసుకను తరలిస్తున్న వాహనాలను, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం స్థానిక టౌన్ పోలీస్‌స్టేషన్‌లో జ రిగిన విలేకరుల సమావేశంలో ఎస్‌హెచ్ఓ రుత్విక్ సాయి మాట్లాడుతూ ఒరి స్సా రాష్ట్ర ం పుష్పలంక నుండితీసుకు వచ్చిన సుమారు రూ.2లక్షల విలువ చేసే 4కేజిల గ ంజాయిని దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపా రు. గంజాయితో పాటు ఒక బైక్, రూ.6 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొబైల్ నెంబర్ ట్రేస్ కాకుండా ఇం స్టాగ్రామ్ గ్రూప్ ద్వారా విక్రయాలు జరుగుతున్నాయని , మొత్తం 12మంది ముఠా సభ్యులపై కేసు నమోదు చేసినట్లు తెలిపా రు. అదేవిధంగా ఆంధ్రా నుండి తెలంగాణ కు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలను మడుపల్లి వై జంక్షన్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. రెండు ఇసుక లారీలు, క్వారీ లారీని, నాలుగు కార్లను అదుపులో కి తీసుకున్నామని, మై వీల్స్ యాప్ ద్వారా అక్రమ ఇసుక దందా జరుగుతుందని, అక్రమ ఇసుక రవాణాకు సంబంధించిన 7గురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులను కోర్టుకు రిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పర్మినెంట్ వీసా లేని పాకిస్థాన్ మహిళతో

# భారత జవాను రహస్య వివాహం!




**జమ్మూ :** సరిహద్దులు దాటి వచ్చిన ఒక పాకిస్థాన్ మహిళతో భారత జవాను రహస్యంగా వివాహం చేసుకున్నాడు! పాకిస్థానీయులను దేశం నుండి పంపిచే ప్రక్రియలో భాగంగా సైనికాధికారులు ఇటీవల ఈ విషయం తెలుసుకుని నిర్ఘాంతపోయారు. ఆ జవానును ఉద్యోగం నుండి ఊడబెరికారు. ఆమె వీసా గడువు దాటిపోయిన తర్వాత కూడా ఆ మహిళను రహస్యంగా తనవద్దనే ఉంచుకున్నాడనేది భారత సైన్యం అభియోగం. గత ఏడాది మే 24న ఆన్‌లైన్ వీడియో కాల్ ద్వారా మినల్‌ఖాన్‌ను మునీర్ వివాహం చేసుకున్నాడు. తన భార్య మొదటిసారి ఫిబ్రవరి 28న 15 రోజులు తాత్కాలిక వీసాపై సరిహద్దులు దాటి వచ్చిందని, లాంగ్ టర్మ్ వీసాకు తాను దాఖలు చేశానని సదరు జవాను చెబుతున్నాడు. పాకిస్థాన్ మహిళ మినల్ ఖాన్ ఈ ఏడాది ఫిబ్రవరి 28న వాఘా–అత్తారీ సరిహద్దుదాటి వచ్చింది. ఆమె వీసా చెల్లుబాటు కేవలం నెలరోజులు మాత్రమే. అంటే మార్చి 22వ తేదీతో ఆమె వీసా గడువు తీరిపోయింది. ఈ విషయాన్ని జవాను దాచిపెట్టి ఆమెను ఇనాళ్ళుగా కాపాడుతూ వచ్చాడు. అసలు విషయం ఏమిటంటే, తాను వివాహం చేసుకోవడానికి ముందుగానే భారత సైనిక ప్రధాన కార్యలయం నుండి గత ఏడాదిలోనే ముందుగా అనుమతి పొందాననీ, ఆ తర్వాతే పాకిస్థాన్ మహిళను వివాహం చేసుకున్నాననీ సదరు జవాను వాదిస్తున్నారు. తనవైపు న్యాయం ఉందనీ, ఈ విషయాన్ని న్యాయస్థానంలో సవాలు చేస్తాననీ, తనకు న్యాయస్థానంలో న్యాయం జరుగుతుందని తిరిగి ఉద్యోగం సంపాదించుకుంటాననీ సదరు జవాను ఆత్మవిశ్వాసంతో ఉన్నాడు. సిఆర్‌పిఎఫ్‌కు చెందిన జవాను మునీర్ అహ్మద్ ఒక పాకిస్థానీ మహిళ మినల్ ఖాన్‌ను వివాహం చేసుకున్నాడు. వీసా గడువు తీరిపోయిన తర్వాత కూడా ఉద్దేశపూర్వకంగా ఆ విషయం వెల్లడించకుండా రహ్యసాన్ని దాచిపెట్టాడు మునీర్ అహ్మద్. ఈ వివాహాన్ని బయటకు చెప్పకుండా రహస్యంగా దాచిపెట్టాడన్న కారణంగా మునీర్ అహ్మద్‌ను సర్వీస్ నుండి తొలగించారు. తాను వివాహం చేసుకున్న నెలరోజుల తర్వాత గత ఏడాదిలోనే తాను ప్రధాన సైనిక కార్యాలయం నుండి అనుమతి పొందానని మునీర్ అహ్మద్ చెబుతున్నాడు. 2017 ఏప్రిల్ నెలలో మునీర్ అహ్మద్ సిఆర్‌పిఎఫ్‌లో జవానుగా చేరాడు.

‘‘నన్ను ఉద్యోగంలోంచి తొలగించినట్లు మీడియా ద్వారా నేను మొదట తెలుసుకున్నాను, ఇప్పుడే సిఆర్‌పిఎఫ్ ద్వారా ఒక లేఖ అందుకున్నాను, నేను, నా కుటుంబం దిగ్భ్రాంతి చెందాం, కేంద్ర కార్యాలయాన్ని నేను అడిగే పెళ్ళి చేసుకున్నాను’’ అని మునీర్ అహ్మద్ టెలిఫోన్ ద్వారా పిటిఐ వార్తాసంస్థ విలేకరికి ఆదివారంనాడు చెప్పారు. ఐతే కోర్టు పుణ్యమా అని ఆ పాకిస్థానీ మహిళకు స్టే లభించింది. ఆమె ఇప్పుడు జమ్మూలోని మునీర్ అహ్మద్ ఇంట్లోనే నివాసం ఉంటోంది. కానీ మునీర్ అహ్మద్‌కు సిఆర్‌పిఎఫ్ జవాను ఉద్యోగం మాత్రం పోయింది. 2022 డిసెంబరు 31వ తేదీన నేను మొదటిసారి పాకిస్థానీ మహిళను వివాహం చేసుకుంటున్నానని చెప్పాను, అందుకు సంబంధించిన పూర్తి లాంఛనాలన్నీ పూర్తిచేశాను, పాస్‌పోర్టు, మ్యారేజీ కార్డు, అఫిడవిట్ అన్నీ సమర్పించాను, నా తల్లితండ్రులకు కూడా నా మ్యారేజీ అఫిడవిట్ సమర్పించాను, సర్పంచ్‌కు, జిల్లా అభివృద్ధి మండలి సభ్యుడి ద్వారా ఈ కాగితాలన్నీ సమర్పించి 2024 ఏప్రిల్ 30వ తేదీన సైనిక ప్రధాన కార్యాలయానికి తెలియజేసి అనుమతి సంపాదించుకున్నానని మునీర్ వాదిస్తున్నాడు.

తాను నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌కు దాఖలు చేశాననీ, కానీ తాను అప్పటికే పూర్తిస్థాయి లాంఛనాలన్నీ పూర్తిచేసినందువల్ల ప్రభుత్వానికి తెలియజేసినందువల్ల ఈ విధమైన నిబంధన అందుబాటులో ఉండదనితనకు చెప్పారన్నారు. ఆన్‌లైన్ వీడియో కాల్ ద్వారా వివాహం చేసుకున్న తర్వాత అందుకు సంబంధించిన ఫోటోలను తాను నిఖా పత్రాలను మ్యారేజ్ సర్టిఫికెట్‌ను నా 72వ బెటాలియన్‌కు సమర్పించానని మునీర్ చెబుతున్నారు.

## ఉక్రేన్‌లో అణ్వాయుధ ప్రయోగావసరం లేదు : పుతిన్



**మాస్కో :** ఉక్రేన్‌లో అణ్వాయుధాన్ని ప్రయోగించాల్సిన అవసరం లేదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ అన్నారు. రష్యా ప్రభుత్వ టెలివిజన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, ఉక్రేన్‌లో అణ్వాయుధాన్ని ప్రయోగించాల్సిన అవసరం రాకపోవచ్చునన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఇంటర్వ్యూ ఇంకా ప్రసారం కాలేదు. దీనికి సంబంధించిన వివరాలను ఆదివారంనాడు టెలిగ్రామ్‌లో పుతిన్ పోస్టు చేశారు. ఉక్రేన్ విషయంలో అణ్వాయుధం వరకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా వాస్తవాల ఆధారంగా జాగ్రత్తగా నిర్ణయం తీసుకుని సమస్యను పరిష్కరించడానికి ఎంతో వీలు ఉందన్నారు. రష్యా ప్రయోజనాలకు అనుగుణంగా ఫలితాన్ని సాధించగల శక్తిసామర్థ్యాలు తమకున్నాయన్నారు. నాజీలపై రష్యా సాధించిన చారిత్రక విజయోత్సవం 80వ వార్షిక వేడుకల సందర్భంగా ఈనెల 8 నుండి 10వ తేదీ వరకూ ఉక్రేన్‌లో ఉక్రేన్‌లో ఏకపక్షంగా పుతిన్ యుద్ధ విరమణ ప్రకటించారు. దీనిని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యతిరేకిస్తూ, ఈయుద్ధ విరమణ కనీసం 30 రోజులైనా ఉండాలన్నారు. యుద్ధవిరమణపట్ల, అమెరికా మధ్యవర్తిత్వ చర్యలపట్ల పుతిన్‌కు చిత్తశుద్ధిలేదని విమర్శించారు. ఇదిలా ఉండగా మొట్టమొదటిసారి రష్యా యుద్ధ విమానాన్ని తాము కూల్చివేశామని ఉక్రేన్ ప్రకటించింది. అదేవిధంగా మరో 69 డ్రోన్లను కూడా కూల్చివేశామని ప్రకటించింది. రాత్రికి రాత్రే రష్యా మొత్తం 165 డ్రోన్లు ప్రయోగించింది. కాగా రష్యా డ్రోన్ల దాడిలో 11 మంది ఉక్రేన్ ప్రజలు గాయపడ్డారు. 2014లో డాన్‌బాస్‌లో రష్యా యుద్ధం ప్రారంభించింది. ఆ తర్వాత 2022 ఫిబ్రవరి 24న ఉక్రేన్‌పై పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభమైంది. ఇప్పటివరకూ రష్యా ఉక్రేన్‌కు సంబంధించిన 20 శాతం భూభాగాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకుంది. ఉక్రేన్‌లో యుద్ధం ప్రారంభమై ఇప్పటికి మూడు సంవత్సరా తొమ్మిదివారాల మూడురోజులు గడిచింది. తాను అధికారంలోకి వచ్చిన 100 రోజుల లోపు ఉక్రేన్‌లో యుద్ధాన్ని ఆపుతానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. కానీ ఇంతవరకూ అటు ఉక్రేన్‌ను, ఇటు రష్యాను ఒప్పించలేకపోయారు.

## ప్లాట్లు అమ్మినట్టే అమ్మి కబ్జాకు యత్నం

సొంత జాగాలోకి వెళ్లనివ్వకుండా గూండాలతో దాడులు

‘శివోమ్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్’పై చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వానికి బాధితుల వేడుకోలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ పైసా పైసా కూడబెట్టి ప్లాట్లు కొనుగోలు చేస్తే విక్రయించిన బిల్డర్లే కబ్జాకి యత్నిస్తున్నారని బాధితులు వాపోయారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శివోమ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కంబాలిపాటి హరిబాబు బాధితులతో కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల మండలం, కుత్బుల్లాపూర్ గ్రామంలోని సర్వే నెంబర్ 18, 19లోని మొత్తం 3 ఎకరాల 35 గుంటల్లో శివోమ్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ జిహెచ్ఎంసి ఆమోదం పొందిన లేఔట్‌లో 45 ప్లాట్లను విక్రయానికి పెట్టిందన్నారు. 2017లో 40 ప్లాట్లను తాము కొనుగోలు చేయగా, మిగిలిన ఐదు ప్లాట్లను జిహెచ్ఎంసికి మార్టిగేజ్ చేశారన్నారు. కొనుగోలు సయయంలో శివోమ్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇసుకపాట్ల సాంబమూర్తి, డైరెక్టర్లు వివిఎస్ఎన్.రాజు, పి.బోసురాజు, చిలుకూరి నరేశ్‌లు కొనుగోలు సమయంలో ఈ ప్లాట్లను పూర్తిగా అభివృద్ధి చేసి అప్పగిస్తామన్నారని తెలిపారు. కానీ గత ఎనిమిది సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధి చేయకుండా కాలయాపన చేశారని చెప్పారు. పైగా జిహెచ్ఎంసికి మార్టిగేజ్ చేసిన ప్లాట్లను సైతం విక్రయించి డబ్బులు తీసుకొని రిజిస్ట్రేషన్ చేయలేదన్నారు. తమ ప్లాట్ల పక్కనే ఉన్న లేఔట్‌లకు సంబంధించిన వారితో కుమ్మక్కై కావాలనే అభివృద్ధి చేయకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై 40 మంది ప్లాట్ల ఓనర్లు నిలదీస్తే వారిపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తమ ప్లాట్లలోకి వెళ్లనివ్వకుండా నిత్యం అక్కడ గుండాలతో పహారాకాస్తూ అడ్డుకుంటున్నారని వాపోయారు.

తమ ప్లాట్లను సైతం కబ్జా చేసి తిరిగి విక్రయానికి పెట్టేందుకు కుట్రలుజేస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గత అధికార పార్టీకి చెందిన నాయకులతో వారికి సంబంధాలు ఉన్నాయని, అది అడ్డుపెట్టుకొని ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తమకు న్యాయం చేసి ప్లాట్లను యజమానులకు అప్పగించాలని కోరారు. ఈ సమావేశంలో రాధాకృష్ణ, సంతోషి, దీపిక, సునీత, రాజమౌళి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## డెడ్ స్టోరేజీకి సాగర్ రిజర్వాయర్

అడుగంటిన నీరు

రెండు రోజుల్లో కనీస మట్టానికి



**ప్రజాపక్షం/నందికొండ :** గత కొంత కాలంగా ప్రతిరోజు కుడి ఎడమ కాలువల ద్వారా వేల క్యూసెక్కుల నీటిని ఇష్టానుసారంగా లెక్కకు మించి విడుదల చేయడంతో ఈ వేసవి లో రిజర్వాయర్లో నీటి నిల్వలు అడుగంటి రెండు మూడు రోజుల్లో డెడ్ స్టోరేజీకి చేరుకోనున్నాయి.దీనితో నాగార్జునసాగర్ ప్రాజెక్టులో కనీస నీటిమట్టం నిర్వహణ సాధ్యమయ్యేలా కనిపించడం లేదు.ప్రణాళి లోపంతో ఇష్టానుసారంగా నీటి విడుదలపై ఈవేసవి గట్టెక్కేది అనుమానమేనని, గతంలో వర్షాభావ పరిస్థితుల లో కూడా ఎన్నడూ రిజర్వాయర్ నీటి మట్టం ఈ స్థాయిలో లేదని నీటి రంగ నిపుణులు తమ అభిప్రాయాన్ని తెలియజేశారు ఏప్రిల్ మొదటి వారంతో పంటలకు సాగునీటి అవసరాలు తీరిపోగా మళ్లీ వానకాలం వర్షాలు కురిసే వరకు తాగునీటి అవసరాలు తీరాల్సి ఉంది కానీ ఈ ఏడాది రిజర్వాయర్ నిండుకుండలా మారి జలకళను సంతరించుకున్నా ఈసారి మార్చి నెల ప్రారంభంలోనే అడుగంటుకు పోయి డెడ్ స్టోరేజ్ కి చేరువయ్యాయి. దీనికి గల ప్రధాన కారణం ప్రతిరోజు వేల క్యూసెక్కు ల నీరు లెక్కకు మించి వదలటమే ప్రస్తుతం రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు గాను 513 అడుగుల వద్ద కొనసాగుతుండగా మరో 3అడుగులు తగ్గితే రిజర్వాయర్ డెడ్ స్టోరేజ్ కి చేరుకోనుంది. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 138.3868 టీఎంసీల నీరు ఉండగా అందులో డెడ్ స్టోరేజ్ కింద 131 టీఎంసీలు తీసివేస్తే అందుబాటులో 7.3868టీఎంసీలు కూడా ఉండటం లేదు ఏప్రిల్ మొదటి వారంతో రబీ పంట సాగు పూర్తవడంతో సాగునీటి అవసరాలు తీరిపోగా ఈ వేసవి లో మిగిలిన నీటితో హైదరాబాదుతో సహ ఇతర జిల్లాలకు తాగునీటిని అందించాల్సి ఉంది.

**సాగర్ రిజర్వాయర్ సమాచారం...**

నాగార్జునసాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి గరిష్ట నీటి మట్టం 590 అడుగులు కాగా ఇది 312.50 టి ఎంసీ లకు సమానం. ప్రస్తుత నీటిమట్టం 513.90అడుగులు ఉండగా ఇది 138.3868 టి.ఎం.సిలకు సమానం. కుడి ఎడమ కాలువ ద్వారా ఎటువంటి నీటి విడుదల కొనసాగడం లేదు ఎస్ఎల్బీసీ ఏఎంఆర్పి ద్వారా మాత్రం 1350 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో గా విడుదలవుతూ ఉండగా ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి ఎటువంటి విద్యుత్తు ఉత్పత్తి జరగడం లేదు. రిజర్వాయర్ నుండి మొత్తం అవుట్ ఫ్లో 1350 క్యూసెక్కులు కాగా, ఇన్ ఫ్లో నిల్

# మధిర పట్టణాభివృద్ధే ధ్యేయం

రూ.128కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు

ప్రారంభించిన డిప్యూటీ సిఎం భట్టి



**ప్రజాపక్షం/మధిర:**నియోజకవర్గ కేంద్రమైన మధిరను స్మార్ట్ సిటిగా అభివృద్ధి చేయటమే తన ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మధిర పట్టణంలోని వైఎస్ఆర్ విగ్రహం సమీపంలో రూ.128కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణ పనులను ఆదివారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధిర పట్టణంలో అండర్ డ్రైనేజి ఏర్పాటు కావాలన్న ప్రజల చిరకాల కోరిక నెరవేర్చడానికి రూ.128 కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించటం జరిగిందని తెలిపారు. మధిర పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. మధిర మున్సిపాల్టీ పరిధిలోని మధిర పట్టణం, అంబారుపేట, మడుపల్లి, ఇల్లెందులపాడు, జిలుగుమాడు గ్రామాలకు కలుపుకుని అండర్ డ్రైనేజి నిర్మాణం చేపట్టడం జరుగుతుందని వివరించారు. మధిర పట్టణంలో మేజర్ స్మార్ట్ వాటర్ డ్రైన్ ఆర్‌సిసి రిటైనింగ్ వాల్, ఒసి ఇ ఎంఎస్ పరికరాల అమరిక పూర్తి చేస్తామని ఈ పనులను రెండు సంవత్సరాల సమయంలో పూర్తి చేయడం జరుగుతుందని, పనులు పూర్తి చేసిన తర్వాత నిర్మాణ సంస్థ 5సంవత్సరాల పాటు నిర్వహణ చేయాల్సి ఉంటుందని, మధిర పట్టణంలో అండ్ గ్రౌండ్ డ్రైనేజి పనులు నాణ్యతతో చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి సంబంధింత అధికారులను ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణ పనులు సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నాణ్యత ప్రమాణాలకు ఎక్కడ రాజీ లేకుండా చూడాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణం వల్ల పట్టణవాసుల ఆరోగ్యం మెరుగుపడుతుందని, పట్టణంలో పారిశుద్ధ్యం, గ్రీనరీ పెరిగేందుకు దోహదం అవుతుందని అన్నారు. మధిర పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప జలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. వైరా ఎమ్మెల్యే, రాష్ట్ర గిడ్డంగుల స ంస్థ చైర్మన్ , ఖమ్మం ఆర్‌డిఓ , డిసిసి అధ్యక్షులు ,మండల అధ్యక్షులు , పట్టణ అధ్యక్షులు , మున్సిపల్ కమీషనర్ , మధిర తహసీల్దార్ , ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ‘ఆపరేషన్ కగార్’ను వెంటనే నిలిపివేయాలి : తమ్మినేని




**ప్రజాపక్షం/ఖమ్మం :** కేం ద్రం ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని మావోయిస్టుల పేరున ఆదివాసీలపై జరుగుతున్న అమానుష దాడులను నిలిపి వేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యు లు తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశా రు. ఏడాది కాలం నుంచి ఆపరేషన్ కగా ర్ పేరుతో మావోయిస్టులను అంతం చేస్తామంటూ బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలపై దాడులు చేస్తుందని ఆయన ఆరోపించారు. శాంతి చర్చలకు మావోయిస్టులు సిద్ధమంటూ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా అణిచివేత చర్యలకు పాల్పడడం దారుణమని ఇది ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని తమ్మినేని తెలిపారు. ఆదివారం సిపిఎం జిల్లా కమిటీ సమావేశం బండారు రమేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తమ్మినేని మాట్లాడుతూ పౌర సమాజంలోని మేధావులు, పౌర హక్కుల సంఘాల నేతలు శాంతి చర్చలకు తాము మధ్యవర్తులుగా వ్యవహరిస్తామని కోరిన కేంద్రం స్పందించకపోవడం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కా ర్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు మాదినేని రమేష్, సీనియర్ నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

# సమాజాన్ని మీడియా ప్రతిబింబించాలి

కెయు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ బి సురేష్ లాల్

**ప్రజాపక్షం/హనుమకొండ :** సమాజంలో చోటు చేసుకున్న పరిణామాలు సంఘటనలను రాజకీ యం ఒక చిత్రాన్ని ప్రజల మనోగతాన్ని మీ డియా ప్రతిబించాలని కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం సంచాలకులు ప్రొఫె సర్ బి.సురేష్‌లాల్ చెప్పారు. కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రం 2022–2024 జర్నలిజం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమంకు దూర విద్య కేంద్రం సమావేశం మందిరంలో జర్నలిజం విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ సంగాని మల్లేశ్వర్ అధ్యక్షత వహించారు. సమావేశానికి ముం దుగా పహల్గంలో ఉగ్రవాదుల దా డుల్లో మరణించిన వారికి సంతాపం తెలిపి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బి.సురేష్‌లాల్ మాట్లాడుతూ పేదరికం నిరక్షరాస్యత ఆకలి లాంటి రుగ్మతలు లేని సమాజం ఉం డాలని, జర్నలిస్టులు తపన పడాలని ఆకాంక్షించారు.మంచి సమాజం కోసం నిరంతరం నిఘా వేసుకొని ఉండాలన్నారు. ప్ర స్తుత ఆధునిక సమాజంలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సామాజిక మధ్యమాల విస్తృతి మూలంగా ప్రపంచంలో ఏ సం ఘటన జరిగిన కణాల్లో శరవేగంగా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్నాయని ఆయన గుర్తు చేశారు.

జర్నలిజంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవడానికి జర్నలిజం విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ తో పాటు కాలంతో పోటీ పడి పనిచేసే తత్వం ఉండాలని, ప్రపంచీకరణ నేపథ్యంలో శా స్త్ర సాంకేతిక రంగంలో వచ్చిన మార్పు మూ లంగా గుర్తించిన మేధ (ఏఐ) మిషన్‌లర్నింగ్ (ఎంఎల్)మీడియా స్వరూపంలో మార్చేశా య న్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రజా సంబంధాల అధికారి ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజం పట్ల కుటుంబం పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. తెలంగాణలోని వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల మట్టి వాసన తెలిసిన వ్యక్తిగా ఈ ప్రాంతానికి వచ్చానని ఆయన తెలిపారు.

అనంతరం డాక్టర్ వెంకటరమణ, ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జర్నలిజం విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ సంగని మల్లేశ్వర్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జర్నలిజం విభాగం అధ్యాపకులు కంజర్ల నరసింహా రాములు, పెరుమళ్ళ వెంకటేశ్వర్లు, ఈర్ల సురేందర్, చిరంజీవి, డాక్టర్ శంకర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిని అవమానించినందుకే శిలాఫలకం తొలగింపు : బిజెపి

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** మల్కాజ్గిరి ఎంపి ఈటెల రాజేందర్ విషయంలో ప్రోటోకాల్ పాటించనందుకే శిలాఫలకం తొలగించడం జరిగిందని బిజెపి బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు కొంతం నవకిషోర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఎన్జీవోస్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 1న ఎన్జీవోస్ కాలనీలో గ్రంథాధాలయం భవనం శంకుస్థాపన సందర్భంగా ప్రోటోకాల్ పాటించకుండా ఎంపిని అవమానించే విధంగా శిలాఫలకం ఉంటే దానిని మా నాయకులు లచ్చిరెడ్డి, శ్రీనివానిస్‌రెడ్డిలు తొలగించారని తెలిపారు. దీనిపై బిఆర్‌ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. బిజెపి అంటే క్రమశిక్షణకు మారుపేరని, మా కార్యకర్తలు క్రమశిక్షణతో ఉంటారని, చిల్లర పనులు మేము చేయబోమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్ రావు, శంకర్ గౌడ్, శ్రీధర్ రావు, జైపాల్ రెడ్డి, శివశంకర్ గౌడ్, మహేందర్‌రెడ్డి, సురేష్, సుధీర్, కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలతోనే పార్టీ బలోపేతం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కార్యకర్తలతోనే పార్టీ బలోపేతం సాధ్యమని ఎల్‌బి నగర్ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వనస్థలిపురంలో దూసరి మధుగౌడ్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులను బిఆర్‌ఎస్‌లో ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా, లగ్గొని శ్రీధర్ గౌడ్, మల్లేష్ గౌడ్, చాపల శ్రీనివాస్ యాదవ్, ఆనంద్ రాజ్, మిట్ట రామ్మోహన్, పార్టీ చేరిన వారిలో పులి వేణు, యాదగిరి, సుమన్‌రెడ్డి, హరి నాయుడు, చంద్రశేఖర్, పూర్ణ గౌడ్, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

## తక్షణమే చర్చలకు పిలవాలి

సమస్యలు పరిష్కారం కాకుంటే 7నుంచి సమ్మె :

ఆర్‌టిసి జెఎసి పిలుపు



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఈనెల 7వ తేదీ నుంచి తెలంగాణ ఆర్‌టిసి జెఎసి ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించినున్నట్లు ఆర్‌టిసి జెఎసి కోకన్వీనర్ కత్తుల యాదయ్య, హయత్‌నగర్ డిపో కన్వీనర్ ఆమనగంటి వెంకన్నలు అన్నారు. ఆదివారం హయత్ నగర్ డిపో 1, 2 వద్ద సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మెకు వెళ్లే పరిస్థితులు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. మేము గత ఆరు, ఏడు నెలల నుండి వివిధ పద్ధతులలో డిపో స్థాయి నుండి ఎండి ఆఫీస్ వరకు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సమ్మె నోటీసు రెండు మార్లు ఇవ్వడం జరిగిందని, ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. మేడే మొదటి రోజున రేవంత్‌రెడ్డి స్పందించి సమ్మెకు వెళ్లకుండా సమస్యను సామరస్యం పరిష్కరించుకోవాలని సూచించడం జేఏసీగా మేమే స్వాగతిస్తున్నామని, ఆర్థిక పరిస్థితి బాగోలేనందున సమ్మెలోకి వెళోద్ధు అని రేవంత్‌రెడ్డి పిలుపునివ్వడం మంచి పరిణామమే అయినా, 90 శాతం వరకు ఆర్థికపరమైన అంశాలు లేకుండా మేము 21 డిమాండ్‌లో ప్రధానంగా ఆర్టీసీని ప్రభుత్వం విలీనం చేయాలని కోరామని తెలిపారు. ఆర్టీసీ యూనియన్లని అనుమతించాలని పనిభారాలు తగ్గించాలని, అధికారుల వేధింపులు మానుకోవాలని కోరుతున్నామన్నారు. మిగతా అంశాలు విడతల వారీగా పరిష్కారం చేస్తామని హామీ ఇస్తే సమ్మెలోకి వెళ్ళమన్నారు. సమ్మె చేయాలని కార్మిక వర్గానికి లేదని, తక్షణమే ప్రభుత్వం చర్చలకు పిలిచి ప్రధానమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. సమస్యలు పరిష్కారం కానీ ఎడల తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని వారు తెలిపారు.కార్యక్రమంలో జంగయ్య, జ్యోతి, అమరావతి, ధన్‌సింగ్, ఉమాదేవి, సురేష్, సుజాత, అంజయ్య, కెఎల్‌రెడ్డి, రామిరెడ్డి, జంగిరెడ్డి, హైమావతి, సుమతి తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్లులేని నిరుపేదలకే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు అందించాలి


సిపిఐ శేరిలింగంపల్లి కార్యదర్శి రామకృష్ణ



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** ఇళ్ళు లేని నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లను అందించి అదుకోవాలని సిపిఐ శేరిలింగంపల్లి కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం శేరిలింగంపల్లి సిపిఐ మండల సమావేశం మాదాపూర్‌లోని ఇజ్జత్‌నగర్‌లో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ శేరిలింగంపల్లి కార్యదర్శి రామకృష్ణ హాజరై మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పేదలకు ఇప్పటికీ ఇల్లు లేవన్నారు. ఏ ప్రభుత్వం వచ్చిన పేదల బతుకులు ఎక్కడ వేసిన గొంగడి అన్నట్టుగా మారిందన్నారు. శేరిలింగంపల్లి మండల పరిధిలో ప్రభుత్వ భూములలో పేదలకు 100 గజల చొప్పున స్థలం ఇచ్చి ప్రభుత్వమే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు భూ కబ్జాదారులకు సహకరిస్తూ చోద్యం చూస్తున్నారని కబ్జాకు గురైన భూములను అధికారులు రక్షించకపోతే సిపిఐ అధ్వర్యంలో భూపోరాటాలు నిర్వహించి భూములను పేదలకు పంచుతామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కె. చందుయాదవ్, వెంకటస్వామి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు సుధాకర్, కాసిం, జెట్టి శ్రీనివాస్, కొండలయ్య, రఘు, వెంకటేష్ పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు సంఘటిత ఉద్యమాలు

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** బిజెపి ప్రభుత్వం తెస్తున్న నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు అసంఘటిత కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించాలని స్ఫూర్తి భవన నిర్మాణ కార్మిక సంఘం సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిరుడు రవి పిలుపునిచ్చారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో కార్మిక సంఘం సమాఖ్య జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్మిక సంఘం సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నిరుడు రవి కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్పోరేట్ సంస్థలతో కుమ్మక్కై కార్మికుల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు.భవన నిర్మాణ కార్మికులకు లేబర్ అడ్డాల ప్రాంతాలలో మౌలిక సదుపాయలు కల్పించి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కార్మికులకు రెండు వందల రోజులు పని దినాలు కల్పించి, ఇందిరమ్మ ఇళ్ళు మంజూరి చేయాలని డిమాండ్ చేశారు.అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే కార్మికుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం సమాఖ్య నాయకులు,కార్మికులు పాల్గొన్నారు.



ప్రేమ వివాహం చేసుకున్న అనాధ మహిళ ఉప్పల్ భార్గవికి అండగా నిలిచి సీమంతం చేసిన జీవన వారధి ఫౌండేషన్, విబి ఫుడ్స్ ప్రతినిధులు

# మౌలిక సౌకర్యాల కల్పన పనులపై దృష్టి



క్షేత్ర స్థాయి పర్యటనలకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన కె.రామకృష్ణారావు క్షేత్ర స్థాయి పర్యటనలకు శ్రీకారం చుట్టారు. మౌలిక సౌకర్యాల కల్పన పనులపై ఆయన దృష్టిసారించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఆదివారం ఆయన హైదరాబాద్‌లో ఆకస్మికంగా పర్యటించారు. ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో పురోగతిలో ఉన్న పలు అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, నిర్మాణంలో ఉన్న ఫుట్‌ఓవర్, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, పాతబస్తీ మెట్రో రైల్ నిర్మాణ పురోగతి, కెబిఆర్ పార్కు చుట్టూ హెచ్‌సిటీ పనులు, ఎస్‌టిపిల నిర్మాణం తదితర పనుల పురోగతిని స్వయంగా తనిఖీ చేశారు. సిఎస్‌తో పాటు పురపాలకశాఖ కార్యదర్శి డాక్టర్ కె.ఇలంబర్తి, హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్, జలమండలి ఎండి. అశోక్‌రెడ్డి, ఇడి. మయాంక్ మిట్టల్, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండి. ఎన్‌విఎస్.రెడ్డి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు. నగర మౌలిక సదుపాయాలకు సంబంధించిన కీలకమైన ప్రాజెక్టులు ప్రణాళిక ప్రకారం పూర్తయ్యేలా చూడాలని సంబంధిత శాఖల అధికారులను రామకృష్ణారావు ఆదేశించారు. ముందుగా బంజారాహిల్స్‌లోని జివికె మాల్ వద్ద సుమారు రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిని పరిశీలించారు. అనంతరం దారుల్‌షిఫా వద్ద మెట్రోలైన్ అలైన్‌మెంట్ (ఓల్డ్ సిటీ కారిడార్) పరిశీలించారు. ఓల్డ్ సిటీ కారిడార్ ఎంజిబిఎస్ బస్ స్టేషన్ నుండి చాంద్రాయణగుట్ట వరకు చేపట్టే మెట్రోరైల్ పనుల వివరాలను రామకృష్ణారావుకు మెట్రో లైన్ ఎండి ఎన్‌విఎస్.రెడ్డి వివరించారు. హుస్సేనీ ఆలమ్‌లో ఉన్న ఖుర్షీద్ ఝా దేవిడి హెరిటేజ్ భవనం హెచ్‌ఎండిఏ నిధులతో కన్సర్వేషన్ రెస్టోరేషన్, మరమ్మత్తులు పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా సిఎస్ నిర్వాహకులతో మాట్లాడుతూ పార్కింగ్ అనువైన స్థలం ఉన్న నేపథ్యంలో హెరిటేజ్ భవనాన్ని నిర్వహణ కోసం ఎగ్జిబిషన్ ఇతరత్రా వినూత్న ఈవెంట్స్‌ను నిర్వహించి, వచ్చిన నిధులతో హెరిటేజ్ భవనం నిర్వహణకు ఖర్చు చేసుకొనే వెసులుబాటు ఉంటుందని సూచించారు. అక్కడ నుండి ఫలక్‌నుమా ఆర్‌ఓబి పనులను పరిశీలించారు. జిహెచ్‌ఎంసి సంబంధించిన పనులు తుది దశలో ఉన్నాయని, రైల్వే పోర్షన్ పూర్తి చేసిన తరువాత సర్వీస్ రోడ్డుకు 5 ఆస్తులను సేకరణ పూర్తి చేసి, నెలరోజుల్లో పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నట్టు పురపాలక శాఖ కార్యదర్శి డాక్టర్ కె.ఇలంబర్తి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ సిఎస్‌కు వివరించారు. ఆగస్టు వరకు పూర్తి చేయాలని సిఎస్ ఆదేశించారు. ఫలక్‌నుమా ఫ్లైఓవర్ నుండి నల్లగొండ ఫ్లైఓవర్ పనులను పరిశీలించారు. మూసీ నదిపై ముసారాంబాగ్ వద్ద చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులను తనిఖీ చేశారు. భూసేకరణ ప్రక్రియ గురించి సిఎస్ అడుగగా ఇంకా కొన్ని ఆస్తులను సేకరించాల్సి ఉందని అధికారులు సిఎస్‌కు తెలిపారు. అక్కడ నుండి జలమండలి ద్వారా చేపట్టిన ఎస్‌టిపి పనులను పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఎండి అశోక్ రెడ్డిని ఆదేశించారు. వివిధ పనులను తనిఖీ చేస్తున్నప్పుడు, ప్రతి పనిని నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించేలా చూడాలని, సకాలంలో పూర్తి చేయడానికి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.





### హైదరాబాద్‌పై సిఎం ప్రత్యేక దృష్టి

ఈ సందర్భంగా సిఎస్ రామకృష్ణ రావు మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధిపై సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. సిఎం ఆదేశాలతో హైదరాబాద్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించామని తెలిపారు. పాతబస్తీ మెట్రోకు నిధుల కొరత లేదన్నారు. పాతబస్తీ మెట్రోకు ఆస్తుల సేకరణ త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. జిహెచ్‌ఎంసి ఎస్‌ఆర్‌డిపి ద్వారా నిర్మిస్తున్న ఫ్లైఓవర్ ఇతర మౌలిక సదుపాయాల పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించామన్నారు.

### మిస్ వరల్డ్ పోటీలను సమన్వయంతో విజయవంతం చేయాలి

హైదరాబాద్‌లో నిర్వహించే మిస్ వరల్డ్ పోటీలను తెలంగాణ ప్రభుత్వం ప్రతిస్టాత్మకంగా తీసుకుందన్నారు. మిస్‌వరల్డ్ పోటీలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పర్యాటకశాఖతో అన్నిశాఖలు సమన్వయం చేసుకొని మిస్ వరల్డ్ పోటీలు విజయవంతం చేస్తామన్నారు.

### కొత్త కారిడార్‌ల డిపిఆర్‌లకు త్వరలో ఆమోద ముద్ర..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినట్టుగా మెట్రో రైల్ రెండవ దశ (పార్ట్‌బి) డిపిఆర్‌లు సిద్ధమయ్యాయని, రాబోయే హెచ్‌ఏఎంఎల్ బోర్డు సమావేశంలో వాటినిపరిశీలించి, ఆమోదిస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. వీటిని త్వరలోనే రాష్ట్ర మంత్రి వర్గం కూడా ఆమోదించాక కేంద్రానికి పంపుతామని తెలిపారు. జెబిఎస్ మేడ్చల్ (24.5 కి.మీ), జెబిఎస్ శామీర్‌పేట్ (22 కి.మీ) కారిడార్‌లతో పాటు శంషాబాద్ ఫ్యూచర్ సిటీ కొత్త కారిడార్(40 కి.మీ)కి కూడా డిపిఆర్‌లు సిద్ధం అయ్యాయన్నారు. మెట్రో ఎండితో ఈ డిపిఆర్‌ల గురించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చర్చించారు. జిహెచ్‌ఎంసి చీఫ్ ఇంజనీర్లు భాస్కర్ రెడ్డి, సహదేవ్ రత్నాకర్, ఎన్.రవికిరణ్, వెంకన్న, ప్రాజెక్ట్ ఇఇ రోహిణి, బిఎల్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పైలెట్ ప్రాజెక్టుగా కొందుర్గు మండలం

రెండు టీములతో

భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** భూ భారతి గ్రామ రెవెన్యు సదస్సులు ఈనెల 5 నుంచి 20 వ తేదీ వరకు నిర్వహించెందుకు గ్రామ రెవెన్యు సదస్సులో భాగంగా జిల్లాలో కొందుర్గు మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. గ్రామ రెవెన్యు సదస్సులకు సంబంధించి సదస్సులు నిర్వహించే చోట అన్ని ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్లకు పలు సూచనలు, సలహాలతో పాటు దిశా నిర్దేశం చేయడం జరిగిందని ఆయన వివరించారు. ఈనెల 5 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఆదేశాల ప్రకారం ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని జిల్లా కేంద్రాలను మినహాయించి జిల్లాలో ఒక మండలాన్ని పైలెట్‌గా తీసుకుని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులను తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో కొందుర్గు మండలాన్ని పైలెట్ గా తీసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కొందుర్గు పైలెట్ లో రెండు టీమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. గ్రామానికి వెళ్ళే ముందు రోజు గ్రామాల్లో టామ్‌టామ్ (చాటింపు) వేయించాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఉండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా అన్ని రికార్డులు సిద్ధంగా ఉంచుకోవాలని, 20 గ్రామాల్లో సదస్సులు ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే ప్రణాళికా సిద్ధం చేసి, అందుకనుగుణంగా పని చేయాలని అధికారులకు సూచించామన్నారు. అలాగే హెల్ప్ డెస్క్, దరఖాస్తుల, రెవెన్యు సదస్సుల ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జూన్ 2 వరకు పైలెట్ ప్రాజెక్ట్ కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. భూ భారతి చట్టంలో దరఖాస్తు చేసుకునే సమయంలో సరిగ్గా దరఖాస్తులు నమోదు అయ్యేలా హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో పొజిషన్ లో ఉన్న రైతులకు సంబంధించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పట్టాలు ఉండి పొజిషన్‌లో లేని దరఖాస్తులు కూడా పరిశీలించడం జరుగుతుందని అన్నారు.హై కోర్టు అనుమతులు రాగానే 12–10–2020 నుండి 10–11–2020 వరకు పెండింగ్ లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను పరిష్కారం చేయాలని, దీనికి అవసరమైన కార్యాచరణను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి వివరించారు. ఈ నెల చివరి వరకు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తప్పులు లేకుండా పరిష్కరిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

## ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకే ఆపరేషన్ కగార్

సిపి(ఐ)ఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** అటవీ ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకే కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిర్వహిస్తుందని సిపి(ఐ)ఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆరోపించారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని సిపి(ఐ)ఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధమని పదేపదే చెబుతున్న బిజెపి ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా మావోయిస్టులను అంతం చేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కర్రెగుట్టల చుట్టూ భారత బలగాలను దింపి మావోయిస్టుల పేరుతో అమాయక ఆదివాసులను పొట్టన పెట్టుకుంటుందని ఆయన విమర్శించారు. ఇప్పటికే 400ల మందికిపైగా ఆదివాసులను చంపివేశారని ఆయన తెలిపారు. కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్ నిలిపి, మావోయిస్టులతో చర్యలు జరపాలన్నారు. కేంద్రప్రభుత్వం కులజన గణన చేపడుతామని చెప్పినప్పటికి గరిష్ట సమయం చెప్పకపోవడం అంతర్యం ఏమిటో చెప్పాలన్నారు. చిత్తశుద్ధితో ఎప్పటిలోపు చేస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిశ్రమ నేతలకు అప్పగించేందు కే సవరణలు తీసుకువచ్చిందన్నారు. రాష్ట్రప్రభుత్వం ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి మహిళలకు ఉచిత బస్సు పథకం ఒకటే పూర్తిస్థాయిలో అమలు చేస్తుందని, మిగతా వాటిని అమలు చేయడం లేదన్నారు. మే 7నుండి రాష్ట్రంలో ప్రపంచ అందాల పోటీలు నిర్వహిస్తామని, దానిద్వారా రాష్ట్రానికి పెట్టుబడులువస్తాయని చెప్పడం సిగ్గుచేటన్నారు. అందాలపోటీల ద్వారా పాశ్చాత్య సంస్కృతి రాజ్యమేలుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు, నాయకులు ఆర్.శ్రీనివాస్, దేశనాయక్, గీత, ఆంజనేయులు, అశోక్, ఎం.శ్రీనివాసులు, ఈశ్వర్, నర్సింహ్మా, శివవర్మ, మధు, కాశన్న, శివరాం, సురేష్, కుర్మయ్య, నాగరాజుగౌడ్, రవి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మిస్ వరల్డ్ పోటీలతో..ప్రపంచ పర్యాటకంలో తెలంగాణ

తెలంగాణ టూరిజంను ప్రమోట్ చేసేందుకు ప్లాన్

పర్యాటక ప్రదేశాలను షోకేజ్‌కు చేసేందుకు ప్రభుత్వ ప్రత్యేక కార్యాచరణ








**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అద్భుత చారిత్రక, సాంస్కృతిక నేపథ్యం కలిగిన తెలంగాణను దేశంలో ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా రూపుదిద్దడం, పర్యాటక రంగంలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వం ఇటీవలే తెలంగాణ తొలి టూరిజం పాలసీనీ రూపొందించింది. ఇందుకోసం మిస్‌వరల్డ్ పోటీలను సరైన వేదికగా ఉపయోగించుకుంటుంది. 120దేశాల ప్రతినిధులు హాజరయ్యే, 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యే మిస్ వరల్డ్ ఈవెంట్‌లో తెలంగాణకు ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం కల్పించి తెలంగాణ పర్యాటకాన్ని ప్రముఖంగా ప్రమోట్ చేసేందుకు, తద్వారా ప్రపంచ పర్యాటకంలో తెలంగాణను ప్రముఖంగా నిలిపేందుకు, పెద్ద ఎత్తున విదేశీ పర్యాటకులను ఆకర్షించుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది.. 2024 సంవత్సరంలో తెలంగాణను 155113 మంది విదేశీ పర్యాటకులు సందర్శించారు. వీరి సంఖ్య గణనీయంగా పెరిగేందుకు ఈ మిస్ వరల్డ్ ఈవెంట్‌ను ఉపయోగించుకుంటోంది. మిస్ వరల్డ్ పోటీలలో భాగంగా హైదరాబాద్, వరంగల్ వేయి స్తంభాల ఆలయం, ఖిలా వరంగల్, భద్రకాళి, రామప్ప, నాగార్జున సాగర్, పోచంపల్లి, పిల్లలమర్రి వృక్షం ప్రముఖ పర్యాటక ప్రదేశాలను మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు సందర్శించనున్నారు. ఈనెల 12న హైదరాబాద్ సాంస్కృతిక వారసత్వం గొప్పదనం ప్రపంచానికి తెలియజేసేలా చార్మినార్, లాడ్ బజార్‌లలో మిస్ వరల్డ్ కంటెస్టెంట్ లు 'హెరిటేజ్ వాక్ ' నిర్వహిస్తారు. ఈ నెల 13న హైదరాబాద్ కే తలమానికంగా నిలుస్తున్న చౌమల్ల ప్యాలెస్‌ను సందర్శించి ఓల్డ్ సిటీ ఘనమైన వారసత్వాన్ని ప్రపంచానికి తెలియ జేచేస్తారు. ఈనెల 14న చారిత్రక, ఆధ్యాత్మిక నగరం వరంగల్‌లోని వెయ్యి స్థంభాల గుడి, వరంగల్ పోర్ట్‌ను సందర్శిస్తారు. ఇదే రోజు యునెస్కో వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని సందర్శిస్తారు. కాకతీయులు యుద్ధ రంగానికి వెళ్లే ముందు ప్రదర్శించే పేరిణి నృత్యంను రామప్పలో తిలకిస్తారు. ఈ నెల15 న మిస్ వరల్డ్ కాంటెస్టెంట్ లు ఆధ్యాత్మిక టూరిజంలో భాగంగా యాదగిరిగుట్ట ఆలయాన్ని సందర్శిస్తారు. హ్యాండ్లూమ్ ఎక్స్పీరియన్సల్ టూర్ లో భాగంగా పోచంపల్లిలో చేనేత వస్త్రాల తయారీని, ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకిస్తారు. ఈ నెల 16న మెడికల్ టూరిజం పరిచయ కార్యక్రమం చేపడతారు. మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి వృక్షాన్ని, హైదరాబాదు నగరానికే ప్రత్యేక ఆకర్షణగా ఉన్న ఎక్స్‌పిరియం పార్కును సందర్శిస్తారు. ఈ నెల 17న రామోజీ ఫిలిం సిటీని మిస్ వరల్డ్ కాంటెస్టెంట్‌లు సందర్శిస్తారు. 18 న తెలంగాణ పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి తెలంగాణ ప్రభుత్వం పౌరుల భద్రతకు తీసుకుంటున్న చర్యలను, ప్రభుత్వం సేఫ్టీ టూరిజం ఇనిషియేటివ్స్‌ను పరిశీలిస్తారు. ఇదే రోజు సాయంత్రం మిస్ వరల్డ్ కాంటెస్టెంట్‌లకు అధికారులు తెలంగాణ రాష్ట్ర గ్రోత్ స్టోరీ, చరిత్రను తెలియజేస్తారు. ట్యాంక్ బండ్ పైన ప్రతి ఆదివారం ఏర్పాటు చేసే సండే–ఫండే కార్నివాల్‌ను సందర్శిస్తారు. ఈనెల 20 లేదా 21న ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరగనున్న ఐపిఎల్ మ్యాచ్‌కు కంటెస్టెంట్లు హాజరవుతారు. 21న శిల్పారామంలో తెలంగాణ కళాకారుల చే నిర్వహించే ఆరట్స్ , క్రాఫట్స్ వర్క్ షాప్‌రే హాజరవుతారు. స్వయంగా వాటి తయారీలో భాగమై ప్రత్యక్షంగా తయారీ గురించి తెలుసుకుంటారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణతో ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ పర్యాటక ప్రదేశాలకు విశేష ప్రచారం దక్కనుంది. తెలంగాణ సాంస్కృతిక వైభవం, చారిత్రక గాథలు, ఆధునిక అభివృద్ధి, పర్యాటక ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలుపడంతో పాటు రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో ఒక 'మల్టీ డైమెన్షనల్ టూరిజం హబ్'గా నిలిపే అవకాశం లభిస్తుంది.

## విద్యార్థులకు అభినందనలు



**ప్రజాపక్షం/చర్లపల్లి :** చర్లపల్లి డివిజన్ పరిధిలోని సెయింట్ జోసఫ్ నవజీవన్ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణులైనారు. జె అమృత,వర్షిణీ 571,ఎస్ జ్ఞానశ్రీ 551,ఎం అనురాధ 542,బి లహరి 541, ఎస్ భార్గవి 536,బి మాధుర్య 525, ఎన్ శారోన్‌రోజ్ 512,దేవిశ్రీ 505 మార్కులు సాధించిన విద్యార్థులను ఫాధర్స్ జిత్తు,మార్టిన్ మాధ్యూలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శైనీ సామూయేల్ తదితరలు పాల్గొన్నారు.

## ఔటర్ రింగ్ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



**ప్రజాపక్షం/నాగారం :** ఔటర్ రింగ్‌లో రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.సిఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఔటర్ రిం గ్ రోడ్డు మైల్ స్టోన్ 77/400 వద్ద నైట్రోజన్ కంటెనైర్‌ను వెనకాల నుండి కారు(టిజి 07 జె 3256)ఢీకొట్టింది.దీంతో డ్రైవర్‌తో సహ ఇద్దరు చార్లెస్,యశ్వత్‌లు అక్కడిక్కడే మృతి చెందారు.వెనక సీట్లో కూర్చున్న ముగ్గురు తీవ్ర గాయాలు కాగా వారిని ఘట్కేసర్ ఆసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

## మానసిక ప్రశాంతతకు పార్కులు దోహదం



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** పిల్లల ఆటవిడుపుకు, పెద్దల మానసిక ప్రశాంతతకు పార్కులు ఎంతగానో దోహదపడతాయని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేక్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజుల రామారం డివిజన్ మహదేవపురంలో రూ.90 లక్షల వ్యయంతో నిర్మించిన పార్కును ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే కెపి వివేక్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కాలనీ, బస్తీల్లో పార్కులను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. పార్కులను అభివృద్ధి చేయడం వలన ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించిన వారమవుతామని చెప్పారు. పిల్లల ఆటవిడుపు కు, పెద్దల మానసిక ప్రశాంతతకు పార్కులు ఎంతగానో దోపడపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, నాయకులు శ్రీనివాస్ యాదవ్, విజయ రాంరెడ్డి, కమలాకర్, బాల్‌రాజ్, నవాబ్ బాయ్ , ఇబ్రహీం ఖాన్, తెలంగాణ సాయి, సుంకరి చందు, ఆంజనేయులు, వెంకటే శ్, జగదీశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ప్రసాద్ బాబు, జగదీశ్వర్ రెడ్డి, రంగారావు, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## దళితుడిపై దాడి దురదృష్టకరం

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 324వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ సుమారు 80 ఏళ్ల స్వతంత్ర భారతంలో ప్రతిరోజు దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, ఒకవైపు హిందువులంతా ఒక్కటే అని డాంబికాలు కొడుతూ సిద్దిపేట జిల్లా,చేర్యాల మండలంలో ఒక్క దళిత యువకుడు ఆంజనేయ స్వామి గుడిలోలోకి వచ్చాడని ఆ యువకుడిని విచక్షణహితంగా బట్టలు తీసి కొట్టడం దురదృష్టకరమని, యువకుడు దళితుడిగా పుట్టడమే అతని శాపమా..? లేక భారతీయుడుగా పుట్టడం అతని నేరమా? అని నత్తి మైసయ్య సూటిగా ప్రభుత్వాలను ప్రశ్నించాడు. ఒకవైపు పాకిస్తాన్ టెర్రరిజం పేరుతో భారతీయులను చంపుతుంటే, మరోపక్క దళితులనే కారణంతో ఎంతోమంది అమాయకులను బలి చేస్తున్నారని, సిద్దిపేటలోని దళితుడిపై దాడిని తీవ్రంగా ఖండిస్తూ కులం, మతం పేరుతో దాడులు చేసేవారు టెర్రరిస్టుల కన్నా ప్రమాదకరమని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని నింధితులను కఠినంగా శిక్షించాలని నత్తి మైసయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూపతి రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య, రాపోలు శ్రీరాములు, గరుగుల యాకయ్య, చిల్ల అంజయ్య, యేసురాజు, ఏ.రాజేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి తాత్కాలికంగా వాయిదా



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగింది అని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం నుండి జరి గే రెవెన్యూ సదస్సులు ఉన్నందు వలన ఈ నెల 5న జరిగే ప్రజావాణి రద్దు చేయడం జరిగిందన్నారు. ఈ విషయంపై జిల్లా ప్రజలు జిల్లా యంత్రాంగాని కి సహకరించాలని కలెక్టర్ కార్యాలనికి ప్రజలు ఎవ్వరు కూడా రాకూడదని వచ్చి ఇబ్బందులు పడవద్దని కలెక్టర్ కోరారు.


## ప్రశాంతంగా ముగిసిన నీట్ ప్రవేశపరీక్ష



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని నీట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జెడ్‌పి బాలికలు ,బాలుర ఉన్నత పాఠశాలలు ,గురుకుల పాఠశాల కళాశాల, సంఘం లక్ష్మీ బాయి గురుకుల ,కొత్తగడిలోని గురుకుల పాఠశాల, కళాశాలల్లో జరుగుతున్న నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్. జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డితో కలిసి పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీశారు. 5పరీక్షా కేంద్రాల్లో 1193 మంది విద్యార్థులకుగా పరీక్షకు హజరు కావాలసి ఉండగా 39మంది విద్యార్థులు గైర్హాజర్ అయ్యారు. 1154మంది పరీక్ష హజరు కావడం జరిగింది .

## ఈ నెల 9 నుండి ఆందోళనలు

ప్రభుత్వ ఉద్యోగుల జెఎసి



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించని పక్షంలో ఈ నెల 9 నుండి ఆందోళనలను ఉధృతం చేస్తామని తెలంగాణా రాష్ట్ర ఉద్యోగ సంఘాల జెఎసి ప్రకటించింది. జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్ పిలుపు మేరకు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఉద్యోగ సదస్సులో మేడ్చల్ జిల్లా జెఎసి ప్రతినిధులు పాల్గొన్నారు. తమ న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని సత్వరమే పరిష్కరించాలని,లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనలు చేస్తామని జెఎసి హెచ్చరించింది. మేడ్చల్ జిల్లా జెఎసి ప్రతినిధులు బి.రవిప్రకాష్, వై.రామేశ్వర్‌గౌడ్,భరత్ కుమార్, డి.రవీందర్, ఎం. శ్రీనివాస్, కుత్బుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ఆఫీస్ కాలనీ ముగిసిన ఎన్నికలు

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** కలెక్టర్ కార్యాలనికి అనుకుని ఉన్న కలెక్టర్ ఆఫీస్ కాలని ఎన్నికలు నిర్వహించారు. కాలని అధ్యక్షులుగా సాయిలు, ఉపాధ్యాక్షులుగా నాగేశ్వర్‌రెడ్డి , జనరల్ సెక్రిటరీగా గోవర్దన్‌రెడ్డి, ట్రెజరీ,కోశధికారి, మల్లేశం, మీడియ ఆర్గనైజర్ శేఖర్ గుప్త, లక్ష్మ ణ్, వెంకటయ్య, గోవర్ధన్‌రెడ్డిలను ఎకిగ్రీవంగా ఎన్నుకొవడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలని సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చించడం జరుగుతుంది అని అన్నారు.అందరం కలిసిమెలిసి ఉండటానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వెమరెడ్డి , శ్రీశైలం , అంజన్న విష్ణువర్ధన్‌రెడ్డి , శివశంకర్‌రెడ్డి , నాగరాజు, కాశయ్య, తదితరులు పాల్గోన్నారు.

# అక్రమ సంబంధాలు భర్తల ఉసురు తీస్తున్నాయ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రేమ పేరుతో పెళ్లి.. పితృత్వం పేరుతో బాధ్యత... కానీ అక్రమ సంబంధాల పేరుతో అవే బంధాలు రక్తపాతానికి దారితీస్తున్నాయి. ఇటీవల కేసుల్లో కొందరు భార్యలు తమ భర్తల్ని హత్య చేస్తూ, అక్రమ సంబంధాలను ముసుగు వేసుకుంటున్నారు. మానవ సంబంధాలపై మచ్చ వేసే ఈ ఘటనలు సమాజాన్ని అనేక ప్రశ్నలతో నిలబెడుతున్నాయి. అందంగా కనిపించిన ప్రేమ విషంగా మారిన బంధం ..తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు మనసు కలచివేస్తున్నాయి. కుటుంబ బంధాల్ని వదిలి, అక్రమ సంబంధాలకే ప్రాధాన్యం ఇచ్చిన కొందరు మహిళలు, తమ భర్తల ప్రాణాల మీదే పడుతున్నారు. ఇలాంటి సంఘటనలు ఆర్థిక, మానసిక ఒత్తిళ్లకు సూచనలుగా ఉంటాయి. ప్రేమలో నిష్ట ఉండకపోతే సంబంధాలే ప్రమాదకరంగా మారుతాయి. రంగారెడ్డి జిల్లాలో జరిగిన కేసులో ఓ మహిళ తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. కానీ పోలీసుల విచారణలో అసలు రహస్యాలు వెలుగు చూశాయి.



### రకరకాల కారణాలు..

పెళ్లిలో ప్రేమ లోపం.. భర్తల వైఖరి పట్ల అసంతృప్తి.. మానసిక అసమతుల్యత.. ఇంటర్నెట్, సోషల్ మీడియా వల్ల ఏర్పడుతున్న ఆకర్షణలు.ఇలాంటి కేసుల్లో సాధారణంగా ముందుగా భర్తను మానసికంగా బలహీనంగా చేయడం, తరువాత మత్తుపదార్థాలు ఉపయోగించడం, చివరికి ప్రియుడి సహకారంతో హత్య చేయడం వంటి మోసపూరిత ప్రణాళికలు కనిపిస్తున్నాయి.

### మానసిక వైద్య నిపుణుల అభిప్రాయాలు..

**భావోద్వేగ నియంత్రణ లోపం:** కొన్ని సందర్భాల్లో వ్యక్తు లు తమ కోపాన్ని, బాధను నియంత్రించలేక హింసాత్మక చర్యలకు పాల్పడతారు. ఇది ఇంపల్స్ కంట్రోల్ డిజార్డర్‌లాంటి మానసిక సమస్యలతో కూడి ఉండొచ్చు.

**అపరాధ భావన లేకపోవడం:** కొందరికి చేసిన దానికి పశ్చాత్తాపం ఉండదు. ఇది సంఘ వ్యతిరేక వ్యక్తిత్వ క్రమ రాహిత్యం లక్షణం కావచ్చు.

**సమాజంలో మారుతున్న విలువలు:** వ్యక్తిగత స్వేచ్ఛ పేరుతో, బాధ్యత లేకుండా సంబంధాలను కొనసాగించడం, దానిని సమర్థించుకోవడం కూడా ఒక కారణంగా చూపబడుతోంది.

**సామాజిక మాధ్యమాల ప్రభావం:** మోసపోయిన భావన, ఇతరుల లైఫ్‌స్టైల్ చూసి తాము తక్కువగా ఉన్నామనే భావన కూడా కుటీల నిర్ణయాలకు దారితీస్తోంది.

### పోలీసుల అభిప్రాయాలు

**ప్లాన్డ్ క్రైమ్లుగా మారుతున్నాయి:** చాలామంది ఈ చర్యలను ముందే ప్రణాళిక ప్రకారం చేస్తున్నారు. ఆధారాలను తుడిచిపెట్టడం, మానసికంగా తాయారు కావడం మొదలైనవి ఉంటున్నాయి.

**నేరాలకు కొత్త రూపం:** ప్రేమ, అక్రమ సంబంధాల పేరుతో జరిగే హత్యలు ఒక కొత్త మానవ సంబంధాల మలిన దశను చూపిస్తున్నాయి.

**పారదర్శక దర్యాప్తు అవసరం:** పోలీసులు బాధితుడు ఎవరికైనా సరే, న్యాయం జరిగేలా చూస్తామని చెబుతున్నారు. అయితే, సంబంధాల వివరాలను తేలికగా బయటపెట్టడం కష్టం కావడం వలన కొన్నిసార్లు కేసులు ఆలస్యంగా పరిష్కారమవుతాయి. ఈ ఉదంతాలు వ్యక్తిగత సంబంధాల్లో నైతికత, విశ్వాసం, బాధ్యత వంటి విలువల అవసరాన్ని పునఃస్మరింప చేస్తున్నాయి.

**వెల్దండాలో :** రత్నలవత్ రాజు అనే వ్యక్తి తన భార్య హిమబిందు, ఆమె ప్రియుడు చంటి, వారి స్నేహితుడు రాకేష్ కలిసి హత్య చేశారు. రాజు తన భార్య అక్రమ సంబంధాన్ని గమనించి హెచ్చరించడంతో, వారు కలిసి కుట్ర చేసి, రాత్రి నిద్రలో ఉన్న సమయంలో అతనిని హత్య చేశారు.

**వరంగల్‌లో :** డాక్టర్ సుమంత్ రెడ్డి తన భార్య ఫ్లోరా మరియా, ఆమె ప్రియుడు ఎర్రోళ్ల శామ్యూల్, మరియు ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మంచుకూరి రాజ్ కుమార్ చేత హత్య చేయబడ్డాడు. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంగా, వారు కలిసి సుపారీ ఇచ్చి హత్య చేశారు.

**హైదరాబాద్‌లో:** శ్రీలక్ష్మి అనే మహిళ తన ప్రియుడు రాజేశ్ మరియు రౌడీషీటర్ రాజేశ్వర్ రెడ్డి సహాయంతో భర్త విజయ్ కుమార్ను హత్య చేసింది. ఆమె భర్త గుండె పోటుతో మరణించాడని నమ్మించింది, కానీ రౌడీషీటర్ పోలీసులకు లొంగిపోవడంతో నిజం.

**నల్గొండలో :** నవ్య అనే మహిళ తన ప్రియుడు కనుగు సతీష్ సహాయంతో భర్త వనం ఈశ్వరు కారు లోపల గొంతు నులిమి హత్య చేసింది.

**భద్రాద్రి కొత్తగూడెంలో :**పుత్తల నరేష్ అనే వ్యక్తి తన భార్య, ఆమె ప్రియుడు సహాయంతో హత్యకు గురయ్యాడు.

**మల్కాజిగిరిలో:** ప్రవల్లిక అనే మహిళ తన కుర్ర ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది.

**మీర్‌పేట్‌లో :** అనే మహిళ తన భర్త రాములును అడ్డుగా భావించి, తన ప్రియుడు, మరొకరితో కలిసి అతన్ని గొడ్డలితో హత్య చేసింది.

**సిద్దిపేటలో:** పెళ్లైన నెల రోజులకే శ్యామల అనే మహిళ తన భర్త చంద్రశేఖర్ను పీక పిసికి, పైట బిగించి హత్య చేసింది. ఈ ఘటనలో ఆమె ప్రియుడు సహా మరికొందరు పాల్గొన్నారు. పోలీసుల విచారణలో ఈ విషయం బయటపడింది.

**హైదరాబాద్‌లో:** కుల్సుంపురా ప్రాంతంలో కృష్ణవేణి అనే మహిళ, తన సోదరి మరియు స్నేహితురాలితో కలిసి భర్తను వస్త్రంతో గొంతు బిగించి, దిండుతో హత్య చేసింది. ఈ విషయం ఏడాది తర్వాత పోలీసుల విచారణలో బయటపడింది.

## చర్లపల్లి టర్మినల్ వద్ద ఊడి పడిన పాల్ సీలింగ్ పరిశీలన



**ప్రజాపక్షం/చర్లపల్లి :** విమానాశ్రయలకు ధీటుగా రూ.450 కోట్లలతో నిర్మించిన చర్లపల్లి రైల్వే టర్మినల్ శనివారం ఈదురు గాలులతో కూడిన వర్షానికి ప్రధాన ముఖ ద్వారం పైకప్పుకు చేసిన పాల్ సిలింగ్ ఊడి పడిపోయింది.ఆ సమయంలో ప్రయాణీకులు ఉన్న ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.శనివా రం ప్రధాన ద్వారాన్ని అధికారులు మూసివేశారు. పైకప్పు ఊడిపోయిన ఘటనను ఆదివారం రైల్వే జిఎం అరుణ్‌కుమార్ జైన్,డిఆర్ఎం బత్తీస్‌కుమార్‌జైన్ లు జరిగిన సంఘటన స్థలాన్ని అధికారులతో కాంట్రాక్టర్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు కాంట్రాక్టర్‌ను విషయాలు అడిగి తెలుసుకుని మరమ్మతులు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సికింద్రాబాద్ ఎస్‌బిఐ బ్యాంక్‌లో భారీ అగ్నిప్రమాదం



రూ.రెండు కోట్ల నష్టం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)లో ఆదివారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్యాట్నీ సెంటర్‌లోని బహుళ అంతస్తు భవనంలోని నాలుగో అంతస్తులో ఎస్‌బిఐ బ్యాంక్ ఉంది. రాత్రి 8.20 గంటల ప ప్రాంతంలో బ్యాంక్‌లో నుంచి దట్టమైన పొగలు, మంటలు రావడంతో స్థానికులు గమనించి పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. నిముషాల్లో అక్కడికి ఐదు అగ్నిమాపక వాహనాలు వచ్చి మంటలను అదుపు చేశాయి. అయితే నాలుగో అంతస్తులో దట్టమైన పొగలు అలుముకోవడంతో లోనికి వెళ్లేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. అప్పటికే బ్యాంక్‌లో ఉన్న కీలక డాక్యుమెంట్లు, ఇతర ఫర్నిచర్, మొత్తం అగ్నికి ఆహుతి అయ్యాయి. సుమారు రెండు కోట్ల నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా. ఈ ప్రమాదానికి షాట్‌సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు. ఆదివారం కావడంతో బ్యాంక్‌లో సిబ్బంది ఎవరు లేరు. సమాచారం తెలియగానే బ్యాంక్ ఉన్నతాధికారులు హుటాహుటీనా సంఘటన స్థలానికి చేరుకున్నారు. బ్యాంక్‌లోని స్ట్రాంగ్‌రూంలో ఉన్న నగదు కాలిపోయిందా లేదా అనే వివరాలు ఇంకా తెలియరాలేదు. ఐదో అంతస్తుకు మంటలు చెలరేగకుండా అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు.

## కీసర ఓఆర్‌ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

ఇద్దరు దుర్మరణం,

మరో నలుగురికి గాయాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** మేడ్చల్ జిల్లా కీసర పరిధిలోని ఓఆర్‌ఆర్‌పై ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా మరో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో కారును జ్జునుజ్జయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీదర్ నుండి హైదరాబాద్‌కు అతి వేగంతో ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి ముందు వెళుతున్న కంటైనర్ వాహనాన్ని ఢీకొంది. దీంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జయి కారు నడిపిస్తున్న వ్యక్తితో పాటు ముందు పక్కనే కూర్చొన్న యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారు వెనుక కూర్చొన్న మరో నలుగురు వ్య క్తులు తీవ్రంగా గాయ పడగా వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మృతి చెందిన వారిని మేడిపల్లి, బోడుప్పల్ ప్రాంతాలకు చెందిన యశ్వంత్(25),చార్లెస్ (25) గుర్తించామని, క్షతగాత్రులను చికిత్స నిమి త్తం ఆస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.



## అక్రమ నిర్మాణాలు అడ్డుకోవడంలో రెవెన్యూ అధికారులు విఫలం

క్రీడా ప్రాంగణానికి కేటాయించిన స్థలం కబ్జా

రెండు అక్రమ నిర్మాణాలు కూల్చేసిన తాండాయూత్

అవినీతి మత్తులో పడి అధికారులు విధి నిర్వహణలో విఫలమయ్యారంటూ మండిపాటు



**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ మండలంలో రెవెన్యూ అధికారులకు తాండ యువకులు షాక్ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం యువత కోసం కేటాయించిన క్రీడా ప్రాంగణం కబ్జాలకు వేదిక అయ్యిందని అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని పలుమార్లు ఫిర్యాదు చేసిన రెవెన్యూ అధికారులు అవినీతికి అమ్ముడుపోయి చర్యలు తీసుకోలేదు. రెవిన్యూ గిరిదావర్ కబ్జాదారుల వైపు వత్తాసు పలుకుతుండడంతో తండా యువకులు ఏకమయ్యారు. తండాలో క్రీడా ప్రాంగణం స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న రెండు అక్రమ నిర్మాణ గదులను యువకులంతా కలిసి కట్టుగా వచ్చి అక్రమ నిర్మాణాలను స్వయంగా కూల్చి వేశారు. నెలనెల లక్షల రూపాయలు వేతనాలు అందుకుంటున్న మండల ఎమ్మార్వో, గిరిధర్, సిబ్బంది అక్రమ నిర్మాణాల అడ్డుకోవడంలో విఫలమయ్యారని యువకులు మండిపడ్డారు. లక్షలు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు కనుమరుగవుతుండడంతో తామే ఈ పని చేశామని యువకులు కరాకండిగా చెప్తున్నారు. తండా యువకుల చైతన్యం ఇతర ప్రాంతాల్లో కూడా ఉంటే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయొచ్చని పలువురు అభినందించారు. ఇప్పటికైనా దుండిగల్ మండలంలో రెవెన్యూ అధికారులు తమ నెలనెల పొందుతున్న వేతనానికైనా సరిపడే పనులు చేసి ప్రభుత్వ స్థలాలు కబ్జాలు కాకుండా తండా యువకులను ఆదర్శవంతంగా తీసుకొని పనిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

### పోలీసులకు ఫిర్యాదు చేసిన అక్రమ నిర్మాణదారుడు

దుండిగల్ మండలం తండా టు లో ప్రభుత్వ సర్వే నంబర్ 684లో స్థానిక నాయకుడు కౌన్సిలర్‌గా పోటీ చేసి ఓడిపోయిన వ్యక్తి క్రీడా ప్రాంగణం ప్రభుత్వం స్థలం కబ్జా చేసి అక్రమ నిర్మాణాలకు తెర లేపాడు. తనకు పాత ఇంటి నెంబర్లు ఉన్నాయని ఆ నంబర్ల ఆధారంగానే నిర్మాణాలను చేపడుతున్నానని, ఎక్కడివో నెంబర్‌లు ఇక్కడ చూపిస్తూ మేక పోతు గంభీర్యం ప్రదర్శిస్తూ తన పలుకు బడి ఉపయోగించి అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన యూత్ యువకులపై దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సంఘటన స్థలానికి పోలీసులు రావడంతో దాదాపు 100 మంది తండా యువకులు మేమేం ఏమి తప్పు చేశాము, గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణం మంజూరు చేసిందని ఇప్పుడు అది కబ్జా అవుతుంది అని అధికారులకు చెప్పామన్నారు. అయినా వారు కబ్జాలపై చర్యలు తీసుకోక పోవటంతో అధికారులు చేయవలసిన పని వారు చేయకపోతే మేం చేసాము అంటూ పోలీసులకు సైతం స్పష్టంగా వివరణ ఇచ్చారు. అయితే కబ్జా చేసిన వ్యక్తిని వదిలి పెట్టి యువకులపై పోలీసులు పడటం కొసమెరుపు. ఇప్పుడు రెవెన్యూ అధికారులు కబ్జా దారుడుపై చర్యలు తీసుకుంటారా? లేక తూతూ మంత్రపు చర్యలు చేపట్టి మమ అనిపిస్తారా? సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్‌తో పాటు, సైబరాబాద్ సీపీ కార్యాలయంలో ముందు న్యాయ పోరాటం చేస్తామని యువకులు తెలిపారు.

## ప్రసవానికి వస్తే ప్రాణాలకే ముప్పు

మాత, శిశు ఆసుపత్రిలో

అరకొర వైద్యం

పెరుగుతున్న మరణాలు

పట్టించుకోని ఉన్నతాధికారులు




**ప్రజాపక్షం/తాండూరు :** రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వాహిస్తున్న సొంత జిల్లాలలో ప్రసవాలు ప్రమాదకరంగా మారాయి. జిల్లా కేంద్రమైన వికారాబాద్‌లో పరిస్థితి అట్లే ఉంటే జిల్లాలోని తాండూరులో పరిస్థితి మరి దారుణగా మారింది. గర్భిణి, బాలింత, శిశు మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకున్న తాండూరులో మాత్రం ఈ మరణాలను అరికట్టడంలో విఫలమవుతున్నారు. సుఖ ప్రసవాలను అందించాలన్న లక్ష్యంతో తాండూరులో ప్రత్యేకంగా మాత శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసిన వైద్యం అంతంతా మాత్రమే అన్న చందంగా మారింది. వైద్యం అరకొరగానే మిగిలింది. కాని ఆ ఆసుపత్రికి వస్తే సుఖ ప్రసవం ఎమో గాని ప్రాణాలకు మాత్రం గ్యారంటీ లేకుండా పోతుంది. దీంతో సుఖవంతమైన ప్రసవాలకు గాను ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. తాండూరులో ఇటీవల జరిగిన పలు ఘటనలను పరిశీలిస్తే సుఖప్రసవం ప్రమాదకరమే అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సుఖ ప్రసవం ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే గర్భిణి, బాలింత, శిశు మరణాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఇట్టి విషయమైన కుటుంబ సభ్యులు ఎన్ని ధర్నాలు చేసిన ఫలితం లేకుండా పోతుందని పలువురులు బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే సంవత్సరంలో ఓ బాలింత మృతి చెందిన విషయం తెలిసిందే. గత నెల రోజుల క్రితం తాండూరులోని మాత శిశు ఆసుపత్రిలో నవజాత శిశువు మరణించిన విషయం మరువక ముందే శనివారం నిండు గర్భిణీ మృత్యువాత పడడం ఆందోళన కలిగిస్తుంది. సుఖ ప్రసవం కోసం పెద్దేముల్ మండల పరిధి పాషాపూర్ తాండకు చెందిన శాంతి బాయి తాండూరులోని మాత శిశు ఆసుపత్రికి వచ్చింది. వైద్య నిర్లక్ష్యంతో గర్భిణీ మృత్యువాత పడ్డడంతో పాటు కడుపులోని ఎనిమిది మాసాల శిశు కూడా మృత్యువాత పడడం ఆ కుటుంబానికి తీరని మనోవేదనకు గురిచేసింది. ఇట్టి విషయమైన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి వచ్చి ఆందోళన చేసిన ఫలింతం లేకుండా పోయింది. వైద్యుల నిర్లక్ష్యంతో తాండూరులో మాత శిశు ఆసుపత్రిలో ప్రసవమా నేను రాను బిడ్డో సర్కారు దవఖానకు అన్న చందంగా మారింది. ప్రభుత్వ ఆసుత్రిపై నమ్మకం తగ్గిపోతుండడంతో ప్రైవేటు ఆసుత్రులను ఆశ్రయించక తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. ఇక్కడ పని చేస్తున్న వైద్యులు పనిగట్టుకుని ప్రైవేటు ఆసుప్రతులకు ప్రోత్సహిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించిన తగు చర్యలు తీసుకోవాలని తాండూరు పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

ఫోకస్

# ఆరోగ్యం

## 'ఆటిజమ్'పై జాగ్రత్తలు అవసరం

సాధారణ పిల్లలు ఏడాది వయస్సులోనే పాకడం, నడవడం, నవ్వడం, ముద్దు ముద్దుగా మాట్లాడడం, తల్లితండ్రుల పిలుపుకు బదులు ఇవ్వడం లాంటివి చేయడానికి ప్రయత్నిస్తూ సఫలం అవుతూ ఉంటారు. కాని కొందరు పిల్లలు మానసిక ఎదుగుదల లోపం కారణంగా అసాధారణం ప్రవర్తన ప్రదర్శిస్తూ ఉంటారు. ఇలాంటి అసాధారణ ప్రవర్తనలో ఆటిజమ్ (మందబుద్ధి లేదా మూగ రుగ్మత) అనే అనారోగ్యం కూడా ఒకటిగా గుర్తించబడింది. వయస్సుకు తగిన మానసిక ఎదుగుదల లేకుండా ఉండే పరిస్థితి బాల్యంలోనే ప్రారంభమై జీవితకాల నాడీ సంబంధ ఆటిజమ్ రుగ్మతగా మారుతుంది. ప్రతి వంద మంది పిల్లల్లో ఒక్కరికి ఈ సమస్య వస్తుంది. పిల్లల మెదడులో కొంత భాగం సరిగా అభివృద్ధి చెందకపోవడం వల్ల ఆటిజమ్ రుగ్మత బయట పడుతుంది. ఆటిజమ్ పెద్ద ప్రమాదకర సమస్య కానప్పటికీ దీనిని నివారించడంలో అనేక సవాళ్లు ఎదుర్కోవలసి వస్తున్నది. మూడేళ్లు నిండక ముందే బయట పడే ఆటిజమ్ లక్షణాలతో మూర్ఛ, నిరాశ, ఆందోళన, హైపర్ ఆక్టివిటీ డిజార్డర్ వంటి రుగ్మతలు ప్రదర్శించబడతాయి.



- ☞ ఆటిజమ్ రుగ్మత పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడానికి, ఆ కుటుంబాలకు బాసటగా నిలువడానికి, ఆటిజమ్ పట్ల అపోహలను తొలగించడానికి ప్రతి ఏట 02 ఏప్రిల్ రోజున ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినం పాటించుట ఆనవాయితీగా మారింది. 2025 ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినం ఇతివృత్తంగా అడ్వాన్సింగ్ న్యూరోడైవర్సిటీ ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు2023 అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. భారత్‌లో ప్రతి 68 మంది పిల్లల్లో ఒక్కరికి ఆటిజమ్ వచ్చే అవకాశాలు ఉన్నట్లు తేలడం విచారకరం. ఇండియాలో దాదాపు 18 మిలియన్ల ఆటిజమ్ రోగులు ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.
- ☞ ఆటిజమ్ రుగ్మతను ఆటిజమ్ స్పెక్ట్రమ్ డిజార్డర్ (ఏఎస్‌డి)గా కూడా పిలుస్తారు. ఆటిజమ్ రావడానికి కారణాలుగా జన్యుపరమైనవి, గర్భధారణ సమయంలో ఇన్ఫెక్షన్లు, గర్భిణి తీవ్ర ఉద్రేకానికి గురికావడం, మెదడులో స్రవించే రసాయనాలు తగిన మోతాదులో స్రవించకపోవడం, నెలలు నిండకుండా ప్రసవం కావడం, కుటుంబ సభ్యులు తగిన సమయం ఇవ్వకపోవడం లాంటివి ప్రధానమైనవిగా పేర్కొనబడినవి. ఆటిజమ్ బారిన పడిన పిల్లలు వయసుకు తగిన మానసిక పరిపక్వత చూపకపోవడం, ఒంటరిగా ఉండడం, వ్యక్తుల కళ్లల్లోకి చూడకపోవడం, ఇతరుల పిల్లలతో కలిసి ఆడుకోవడానికి విముఖత చూపడం, చేసిన పనులనే పదే పదే చేయడం, గాయాలు తగిలినా గుర్తించకపోవడం, శబ్దాలను పట్టించుకోకపోవడం, పిలిచినా పలుకకపోవడం, సరిగా మాట్లాడకపోవడం, అకారణంగా ఏడ్వడం లాంటి లక్షణాలను ప్రదర్శిస్తారు.
- ☞ ఆటిజమ్ రుగ్మత బారిన పడిన పిల్లల తల్లితండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవడం కనీస అవసరమని తెలుసుకోవాలి. పిండిపదార్థాలు, కొవ్వులు, మాంసకృత్తులు, జనిత లవణాలు, విటమిన్లు, జింక్, ఐరన్, సెలినియం, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్‌ఈ, విటమిన్ కె లాంటి పోషకాలు కలిగిన ఆహారం అందించడం తల్లితండ్రుల బాధ్యత అని మరువరాదు. కాలీఫ్లవర్, బ్రొకోలీ, పెప్పర్, నారింజ, బత్తాయా, పైనాపిల్, స్ట్రాబెరీ, బొప్పాయి, బీన్స్, పుట్టగొడుగులు, పొద్దుతిరుగుడు విత్తనాలు లాంటి పోషకాహారాన్ని అందించాలి. గర్భిణీలు తగు పోషకాహారం తీసుకోవడం, తల్లులు దులవాట్లకు దూరంగా ఉండడం, గర్భిణిలు డాక్టర్ సలహాలు, తల్లులు వాయు కాలుష్యానికి/క్రిమిసంహారక మందులకు దూరంగా ఉండడం, గర్భిణిలు అన్ని రకాల టీకాలను తీసుకోవడం, గర్భంలో శిశువు కదలికల పట్ల వైద్యుల సలహాలు తీసుకోవడం లాంటి జాగ్రత్తలు ఆటిజమ్ సమస్యకు విరుగుడునా పని చేస్తాయని తెలుసుకోవాలి.
- ☞ పిల్లల ప్రవర్తనను తల్లితండ్రులు నిరంతరం గమనించడం, అసాధారణంగా కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం లాంటి చర్యలు ఆటిజమ్ రుగ్మత తీవ్రతను తగ్గించడంతో లేదా సమస్యను చాలా వరకు పరిష్కరించడం జరుగుతుందనే అవగాహన కలిగి ఉండడం తల్లితండ్రుల కనీస బాధ్యత అని తెలుసుకుందాం, ఆటిజమ్‌కు అవగాహన ఔషధాలతో సమాధానమిద్దాం.



## ఆనందమే.. వెలకట్టలేని మానసిక సంపద

ఆనందం వెల కట్టలేని మానవ మానసిక సంపద. ఆనందంగా జీవించడం ఓ అద్భుత కళ. మన అస్థిత్వానికి పునాది సంతోషమే. ఆనందం అంగట్లో దొరికే అగ్గువ సరుకు కాదు. ముఖంలో నవ్వులు నర్తిస్తే అసలైన ఆనందంగా ఉన్నట్లు కాదు, నవ్వని వారు విషాదంలో మునిగినట్లు కాదు. మానసిక సంతోషానికి, ముఖంలో కనిపించే నవ్వులకు సంబంధం లేదు. మానస్ఫూర్తిగా సంతోషించే వారి ముఖాల్లో కోటి దివ్వెల వెలుగులు జనిస్తాయి. అంతరంగ ఆనంద ఊట బాయిలో ఉబికే ఊటయే సంతోషాల మూట. మన అనుమతి లేకుండా మన నుంచి ఎవ్వరూ ఆనందాన్ని దూరం చేయలేరు. ఆనందం అమూల్య ఆరోగ్యకర మానసిక ఆస్తి. ఆనందాల వేటలో కష్టసుఖాలను అనుభవిస్తూ సాగిపోతున్నాం, కొంత వరకు సఫలం అవుతున్నాం, అధిక శాతం వైఫల్యాలతో సంతోషాలకు దూరం అవుతున్నాం. ఆనందానికి సుఖానికి వ్యత్యాసం మరిచి పోతున్నాం. ఆనందానికి కొలమానం లేదు ఆనందాన్ని చూడడానికి, వర్ణించడానికి వీలు కాదు. సంతోషాన్ని అనుభవించడమే మనకు తెలుసు, వర్ణించడానికి వాక్యాలు దొరకవు. పడుకోగానే మనసారా నిద్రలోకి జారుకునే వారు అదృష్టవంతులు, అసలైన భాగ్యవంతులు.

మన జీవనశైలి, ఆర్థిక స్థితిగతులు, ఆలోచనా విధానం, వ్యక్తిగత అలవాట్లు, విద్య వివేకాలు, సంతృప్త ఆధ్యాత్మిక భావనలు, మానవీయ దృక్కోణం, సర్దుకుపోయే గుణం, ఆశావహ దృక్పథం, కుటుంబ నేపథ్యం, సహచర బంధుమిత్రులు, కార్యాలయ లేదా పని ప్రదేశ్ ప్రభావాలు, సామాజిక స్థితిగతులు, సాంస్కృతిక ఆచార వ్యవహారాలు, మానవ సంబంధాలు, భావోద్వేగ నియంత్రణలు, చిన్న చిన్న విషయాల్లో గొప్ప గొప్ప సంతోషాలను వెతుక్కోవడం, ఆహార అలవాట్లు, ఆశదురాశలు, ఈర్ష్య అసూయ లాంటి అనేక అంశాలు మన ఆనంద క్షణాలను ప్రభావితం చేస్తాయి. ఒక చిన్న సమస్య మన ఆనందాన్ని లాక్కోవచ్చు. ఒక చిన్న సమస్యను తలుస్తూ వందల సార్లు వగచి, తలచి కుమిలిపోయే వారికి ఆనందం అందని ద్రాక్ష అవుతుంది. మనం చేసే ప్రతి పనికి అంతిమ లక్ష్యం ఆనందం వెతుక్కోవడమే. మానవ ఆరాటపోరాటాల గమ్య స్థానం ఆనంద నిధిని పొందడం మాత్రమే. ఆనందానికి, శ్రేయస్సుకు విడదీయరాని బంధం ఉంటుంది. నేటి వేగవంతమైన ఆధునిక డిజిటల్ ఏఐ యుగపు మానవుడికి ఆనందం అందని వస్తువే అవుతున్నది. ఆనందమయ జీవితం గడిపే వారికి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది. ఆనందమే ఆరోగ్యమని, ఆరోగ్యమే మహాభాగ్యమని తెలుసుకుందాం. సిరి సంపదలు, కీర్తి, పరువు ప్రతిష్టలు ఆనందాన్ని ఇవ్వకపోవచ్చు. డబ్బుతో విలాసవంతంగా బతకవచ్చు, కాని ఆనందంగా జీవిస్తామనే గ్యారంటీ లేదు. సంపద పెరిగితే సమస్యలు కూడా పెరుగుతూ మన ఆనంద క్షణాలు హరించుకుపోతాయి. శారీరక సౌకర్యమే సుఖం, మానసిక ఉత్తమ స్థితి సంతోషం అని తెలుసుకోవాలి.

ఆనందంగా జీవించడం అనే అద్భుత కళను ప్రచారం చేయడానికి 2012లో ఐరాస తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రపంచ దేశాలు ప్రతి ఏట 20 మార్చిన అంతర్జాతీయ ఆనంద దినోత్సవం లేదా ఇంటర్నేషనల్ డే ఆఫ్ హాపీనెస్‌ను 2013 నుంచి పాటించుట ఆనవాయితీగా మారింది. 2025 అంతర్జాతీయ ఆనంద దినోత్సవం ఇతివృత్తం షేరింగ్ అండ్ కేరింగ్ అని తెలుసుకొని, దానిని మన జీవన మంత్రంగా చేసుకొని సంతోషంగా జీవితాలను సుసంపన్నం చేసుకుందాం.

మనం ఇష్టపడే పనిలో సంతోషం దాగి ఉంటుంది. మన పనిని ఇష్టపడడం వల్ల ఆనంద నిధికి చేరువవుతాం. సంతోషంగా జీవించగలగడం ఓ అదృష్టం. బతుకడానికి, జీవించడానికి వ్యత్యాసం ఆనందమే. ఆనందంగా లేని వారు బతుకుతారు, సంతోషంగా జీవనయానం చేసే వారు జీవిస్తారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి అంశం నుంచి మనం ఆనందాన్ని వెతుక్కోవడం నేర్చుకోవాలి. ఆనందం ఎవరు ఇచ్చే వస్తువు కాదని, మనం ఆస్వాదించే జీవన విధానమే మనకు సంతోషాలను ఇస్తుంది. ఆనందంగా ఉండడం, సంతోషాలను పంచడం మన జీవిత లక్ష్యం కావాలి. మరొకరి సంతోషానికి మనం కారణం అయినపుడు మనకు అద్భుత ఆనంద నిధి దొరుకుతుంది. బి హ్యాపీ మేక్ అదర్స్ హ్యాపీ అనే సూత్రాన్ని అమలు చేస్తే మన వెంట ఆనంద సుగంధాలు వస్తాయి.



## వేసవిలో గుండె పదిలం

శీతాకాలంలోనే కాదు, వేసవిలో కూడా గుండె ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.. గుండెపోటు ప్రమాదం వేసవిలో ఎంత ఉంటుందో శీతాకాలంలో కూడా అంతే ఉంటుంది. కాబట్టి, ఇప్పటికే గుండె రోగులుగా ఉన్నవారు వేసవిలో కూడా తమ గుండె ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వేసవిలో గుండెపై ఎక్కువ ఒత్తిడి కలిగేలా ఎలాంటి పనులు చేయకూడదు.. ఇది కాకుండా, వేసవిలో గుండెపోటు కేసులు.. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఇంకా ఏమి చేయాలి.. నిపుణులు ఏం చెబుతున్నారో పరిశీలిస్తే... వేసవిలో ఎక్కువసేపు ఎండలో ఉండి కష్టపడి పనిచేసే వారికి గుండెపోటు వచ్చే ప్రమాదం పెరుగుతుంది.. చిన్న నిర్లక్ష్యం కారణంగా మిమ్మల్ని ఆసుపత్రిలో చేర్చే ప్రమాదం ఉంది. అందువల్ల, వేసవితోపాటు శీతాకాలంలో గుండె ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. వేసవిలో మీ ఆహారం, జీవనశైలిలో స్వల్ప మార్పులు చేయడం ద్వారా, మీరు మీ హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. శీతాకాలంలో గుండె ధమనులు ప్రభావితమైనట్లే, వేసవిలో కూడా అవే ప్రభావితమవుతాయి. రెండింటికీ కారణాలు ఖచ్చితంగా భిన్నంగా ఉన్నప్పటికీ.. గుండె సమస్యలు మాత్రం పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.. కాబట్టి, వేసవిలో కూడా గుండె ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని సూచిస్తున్నారు.

### వేసవిలో పెరుగుతున్న గుండె సమస్యలు.. నిపుణులు ఏం చెబుతున్నారంటే..

వేసవిలో ఎక్కువసేపు ఎండలో ఉండటం గుండె ఆరోగ్యానికి మంచిది కాదని కార్డియాలజిస్ట్ అంటున్నారు. ఇది మీ శరీరాన్ని వేడి చేస్తుంది.. ఈ పరిస్థితుల్లో శరీరాన్ని చల్లగా ఉంచడానికి, శరీరంలోని అన్ని భాగాలకు రక్తాన్ని సరఫరా చేయడానికి గుండె ఎక్కువగా పనిచేయాల్సి వస్తుంది. అంటే గుండె వేగంగా కొట్టుకుటుంది.. దీనివల్ల గుండెపై మరింత భారం పెరుగుతుంది. ఇది కాకుండా, మీరు ఎక్కువగా పని చేస్తే, మీకు చెమట ఎక్కువగా పడుతుంది.. దీంతో మీరు డీహైడ్రేషన్ బాధితుడిగా కూడా మారవచ్చు. అలాంటి పరిస్థితులలో గుండెపై ఒత్తిడి కూడా పెరుగుతుంది. దీని కారణంగా, గుండె రోగులకు ఆంజినా (ఛాతీలో నొప్పి, ఒత్తిడి లేదా బిగుతుగా అనిపించే అనుభూతి), గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. అందువల్ల, మీ శరీరం వేడెక్కకుండా కాపాడుకోవడం చాలా ముఖ్యం.. ఎక్కువ వ్యాయామం లేదా పని చేయడం ప్రమాదకరమని వైద్య నిపుణులు చెబుతున్నారు.

### మీ హృదయాన్ని జాగ్రత్తగా చూసుకోండి..

వేసవిలో మిమ్మల్ని మీరు హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం ద్వారా మంచి గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. దీని కోసం, ఎక్కువసేపు ఎండలో ఉండకండి.. మీ ఆహారాన్ని మార్చుకోండి. వేసవిలో చాలా తేలికైన, సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని తినాలి. ఆహారంలో ఎక్కువ ద్రవ పదార్థాలు ఉండాలి. కాలానుగుణ పండ్లను తినడం ద్వారా కూడా మీరు హైడ్రేటెడ్‌గా ఉండగలరు.

మద్యం – ధూమపానం నుండి దూరంగా ఉండండి దీనితో పాటు, ఎండాకాలంలో మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలి.. మద్యం – పొగాకు కూడా గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. ఎండలో చల్లగా ఉండటానికి ప్రయత్నించండి. దీనితో పాటు, ఒత్తిడికి దూరంగా ఉండండి. కొన్ని సందర్భాల్లో ఛాతీలో అసౌకర్యం, నొప్పి.. తీవ్ర అలసట.. లాంటివి గమనిస్తే వెంటనే మీ వైద్యుడిని సంప్రదించండి..

**ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి**

## ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమే

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీఎస్.బోస్



**ప్రజాపక్షం/కాప్రా :** ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండా ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేసేది కేవలం కమ్యూనిస్టులు మాత్రమేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీఎస్.బోస్ అన్నారు. ఇసిఐఎల్‌లోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో ఆదివారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్‌రావు అధ్యక్షతన జరిగిన పార్టీ మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఓట్లు ప్రాధాన్యత ప్రామాణికం అయినప్పటికి ప్రస్తుతం దేశంలో పాలకవర్గాలు ప్రజా సమస్యలకు మాత్రం ప్రాధాన్యత ఇవ్వక పోవటం శోచనీయమన్నారు. ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు అర్హులైన లబ్దిదారులకు అందేలా చూడాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేసారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలి కాలంగా ప్రత్యక్ష పన్నులను గణనీయంగా తగ్గించి పరోక్ష పన్నులు పెంచుతూ ఆదాయాన్ని పెంచేలా చేస్తోందన్నారు. ఆర్థిక భారాన్ని సామాన్య ప్రజానీకంపై కాకుండా సంపన్న వర్గాలపై అధికంగా వేయాలని ఆయన సూచించారు.

**మేడ్చల్ జిల్లాలో సిపిఐ 3వ రాష్ట్ర మహాసభలు...** సిపిఐ 3వ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 19 నుండి 22 వరకు మేడ్చల్ జిల్లాలో నిర్వహించేందుకు సిపిఐ రాష్ట్ర సమితి నిర్ణయించిందని, మొదటి రోజున భారీ ప్రదర్శన ర్యాలీతో ప్రారంభమై మిగత మూడు రోజులు ప్రతినిధుల సమావేశాలు ఉంటాయన్నారు. ఈ మహా సభలకు రాష్ట్రం నలుమూలల నుండి పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో హాజరవుతారని ఆయన తెలిపారు.

## సంక్షేమ పథకాల హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయాలి

సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** సంక్షేమ పథకాల హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని, చేసిన పథకాలను ప్రచారం నిర్వహించుకోవడంలో కాంగ్రెస్ విఫలమవుతోందని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. ఆదివారం కోటగిరి మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం ఎన్నికల్లో హామీనిచ్చిన పథకాలను అమలు చేస్తున్నప్పటికీ ప్రచారం చేసుకోవడంలో విఫలం చెందుతుందన్నారు. గత ప్రభుత్వం సబండవర్గాలకు ఎన్నో హామీలిచ్చిందని, దళితులకు సిఎం పదవి ఇస్తామని, ఇంటికో ఉద్యోగం, అర్హులందరికీతెల్ల రేషన్ కార్డు, లక్ష రుణమాఫీ హామీలిచ్చి నెరవేర్చలేదని గుర్తు చేశారు. సమావేశంలో సిపిఐ నాయకులు విఠల్‌గౌడ్, సునీల్‌కుమార్, శివరాజ్ పండరి తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ డిమాండ్



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి :** గత ప్రభుత్వ పాలనలో ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధిలో నది జలాల సద్వినియోగంలో తీవ్రమైన నిర్లక్ష్యానికి అన్యాయానికి గురి అయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి తగిన నిధులు ఖర్చు చేసి యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల్ నరసింహ డిమాండ్ చేశారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సురవరం వెంకటరామిరెడ్డి భవన్ సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ జిల్లా సమితి సమావేశం పి.సురేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కశ్మీర్లో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలనరసింహ మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఉన్న పాలకుల ద్వంద విధానాల కారణంగా జిల్లా సమగ్ర అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అభివృద్ధికి మాటలకే పరిమితం చేయకుండా చేతల్లో అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. ఎన్నికల ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సిపిఐ పార్టీని ప్రజా సంఘాలను గ్రామస్థాయి నుండి బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బృగి బాల్‌కిషన్, జిల్లా కార్యవర్గ సభ్యు లు, గోవర్ధన్, అల్వాల్ రెడ్డి, డి.రాము, పి.సురేష్, బిఆర్ విల్సన్, కోటకదిక నరసింహ, చాంద్‌భాషా, సత్యనారాయణ రెడ్డి, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి సి.రాజు, ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా కార్యదర్శి కె.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమాలతో పార్టీ బలోపేతం

జూన్ 21,22 తేదీలలో జిల్లా మహాసభలు

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేని శంకర్

**ప్రజాపక్షం/మందమర్రి :** ప్రజా ఉద్యమాలతోనే పార్టీ బలోపేతమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కలవేని శంకర్ పేర్కొన్నారు. సిపిఐ మంచిర్యాల జిల్లా సమావేశం మందమర్రి సిఇఆర్ క్లబ్‌లో జిల్లా సమితి సభ్యులు శైలేంద్ర సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశంలో కలవేని శంకర్ మాట్లాడుతూ జిల్లాలో సిపిఐ పట్టణ, మండల మహాసభలు, జూన్ 21,22 తేదీలలో జిల్లా మహాసభలు పూర్తి చేయాలన్నారు. ఆగస్టు 19, 21 తేదీలలో రాష్ట్ర మహాసభలు మేడ్చల్‌లో జరుగుతాయని, సెప్టెంబర్ 21నుంచి 25 జాతీయ మహాసభలు చండీగడ్‌లో జరుగుతాయని తెలిపారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను ఏరిపారేస్తామన్న ప్రకటనలు మానుకోవాలని, శాంతిచర్చలకు సిద్ధమైన మావోయిస్టు ప్రకటనను స్వాగతించి వారితో మాట్లాడాలని కేంద్రాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాసు, మిట్టపల్లి వెంకటస్వామి, జోగుల మల్లయ్య, మిట్టపల్లి శ్రీనివాస్, బొంతల లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



## సివిల్ సప్లయి హమాలీల సమస్యలు పరిష్కరించాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్

మే11న ఎఐటియుసి జిల్లా మహాసభలు

**ప్రజాపక్షం/నర్సంపేట :** సివిల్ సప్లయి హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ డిమాండ్ చేశారు. మే11న వరంగల్‌లోని ఎనుమాముల మార్కెట్ ప్రాంగణంలో నిర్వహించే ఎఐటియుసి జిల్లా మహాసభలకు ప్రతి కార్మికుడు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. నర్సంపేట పట్టణంలోని సివిల్ సప్లై హమాలీ గోదాం ప్రాంగణంలో సివిల్ సప్లయి హమాలీ కార్మికుల సంఘం అధ్యక్షులు కొత్తగట్టు నర్సింగం అధ్యక్షతన సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు గుంపెల్లి మునీశ్వర్ పాల్గొని మాట్లాడుతూ మే 11న ఏనుమాముల మార్కెట్‌లో నిర్వహించే ఎఐటియుసి జిల్లా మహాసభలకు ప్రతి కార్మికుడు యూనిఫామ్ తో పూర్తి బాధ్యతగా మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బక్కెర కిషోర్, ముద్ర బోయిన మహేందర్, మిట్టపల్లి మహేందర్, గండ మల్ల యాగ స్వామి, ఇప్పటి కుమారస్వామి, కావటి మల్లయ్య, రాయరాకుల సతీష్, తుప్పటి వీరస్వామి, మిట్టపల్లి వెంకటేశ్వర్లు, ఎల్లబోయిన శ్రీను, హనుమకొండ యశోద తదితరులు పాల్గొన్నారు.




## సింగరేణి ఉనికి చాటేలా సమ్మె

ఎఐటియుసి జనరల్ సెక్రటరీ కొరిమి రాజ్‌కుమార్




**ప్రజాపక్షం/ఇల్లెందు :** సింగరేణి ఉనికి చాటేలా ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దామని ఎఐటియుసి జనరల్ సెక్రటరీ కొరిమి రాజ్‌కుమార్ కార్మికలోకానికి పిలుపునిచ్చారు. స్థానిక విఠల్‌రావు భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 44 కార్మికచట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక సంఘాలను, కార్మికులను బలహీన పరిచే విధంగా తయారుచేసి యాజమాన్యానికి లబ్ధి చేకూరే విధంగా నాలుగు కోడ్‌లు ఉన్నాయని, ఈమేరకు జాతీయ కార్మిక సంఘాలన్నింటిని కలుపుకుని ఈనెల 20న నాలుగు లేబర్‌కోడ్‌ల రద్దుకు దేశవ్యాప్త సమ్మె జరుగుతుందన్నారు. మే రెండో వారంలో సమ్మెకు వెళ్లే విధంగా అన్ని కార్మిక సంఘాలతో చర్చలు జరుపుతామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధ్వంధ వైఖరితో నూతన బొగ్గు గనులు రావడం లేదన్నారు. సింగరేణిలో 27భూగర్భ గనులు, 17 ఉపరితల గనులుంటే 2025 ఆర్థిక సంవత్సరంలో సుమారు 2 భూగర్భ గనులను మూసివేశారని, వాటిలో ఆర్‌కె6, కెకె5 గనులు సంవత్సరంలో మూయనున్నట్లు తెలిపారు. వాస్తవానికి సింగరేణి పుట్టినిల్లైన ఇల్లెందులో సింగరేణి కార్మికులు ఒకప్పుడు 12,000 మంది ఆపరేటర్లుంటే నేడు 600 మంది కార్మికులున్నారని, జెకె5 ఒసి మూతపడనుండటంతో 12 మంది ఆపరేటర్లను ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారన్నారు. బొగ్గు పుట్టినిల్లైన ఇల్లెందులో జెకె5ఒసి విస్తరణలో భాగంగా పూసపల్లి ఒసిని వెంటనే ప్రారంభించి, కార్మికుల ఇతర ప్రాంతాలకు బదిలీ కాకుండా చూడాలన్నారు. జెకె5ఒసి ఒబి, కోల్ టెండర్లను ప్రైవేట్ కంపెనీకి అప్పజెప్పితే సింగరేణి కార్మికులు లేకుండా ప్రైవేట్ వ్యక్తులతో పనులు చేయిస్తారని తెలిపారు. ఈవిషయమై సింగరేణి సిఎండి జెకె5 ఒసి కోల్ టెండర్‌ను సింగరేణి సంస్థకు కేటాయిస్తే సింగరేణి కార్మికులు బదిలీ కాకుండా ఇక్కడే ఉండే అవకాశం ఉంటుందన్నారు. సింగరేణి కార్మికులకు ఇళ్లు కట్టుకోవడానికి రూ.10లక్షలు వడ్డీ లేని రుణం ఇచ్చినట్లు, కోల్ ఇండియా తరహాలో రూ.30లక్షలు ఇళ్లు కట్టుకోవడానికి ఇవ్వాలని కోరారు. సింగరేణి భూగర్భ గనులు ఉన్నచోట సింగరేణి కార్మికులే క్యాంటీన్ నడిపే విధంగా చూడాలన్నారు. సింగరేణి కార్మికుల వైద్యానికి సంవత్సరానికి రూ.250కోట్లు ఖర్చు చేస్తున్న కార్పోరేట్ ఆసుపత్రులు కార్మికుల దగ్గర నుంచి రూ.20లక్షలు వసూలు చేస్తున్నారన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేసి కార్మికుల వైద్యం కోసం పైసా ఖర్చు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.సారయ్య, కార్పొరేట్ కార్యదర్శి ఎస్‌వి రమణమూర్తి, శాఖా కార్యదర్శి మహమ్మద్ నజీర్ అహ్మద్, ఉపాధ్యక్షుడు దాసరి రాజారాం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరకొండ శంకర్, పట్టణ కార్యదర్శి బంధం నాగయ్య, అజ్మీర కిశోర్, మంచాల వెంకటేశ్వర్లు, ఎస్.రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## సన్నబియ్యం పంపిణీ దేశానికే ఆదర్శం



**ప్రజాపక్షం/చింతలపాలెం:** సన్నబియ్యం పంపిణీ దేశానికే ఆదర్శమని చింతలపాలెం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరాల కొండారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సోషల్ మీడియా కోఆర్డినేటర్, ముస్లీం మైనార్టీ నాయకులు మున్నకు వచ్చిన సన్నబియ్యంతో భోజనం ఏర్పాటు చేశారు. సన్న బియ్యం పేదలకు వరమని, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బొబ్బా కోటిరెడ్డి, చిలకల శ్రీనివాసరెడ్డి, శాగంరెడ్డి గోపాల్‌రెడ్డి, లకావత్ సైదులు, షేక్ నాగుల్‌మీరా, బొబ్బ రవీందర్‌రెడ్డి, తొండపు శ్రీనివాసరెడ్డి, చిలక నాగేశ్వరరావు, షేక్ జానిమియా, నూరుల్లా, దాదాపుడే, శంబయ్య, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య



**ప్రజాపక్షం/చండూరు:** రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి అభివృద్ధి సంక్షేమ పథకాలు అందాలని సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యుడు ,చండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ నల్పరాజు రామలింగయ్య అన్నారు. శనివారం చండూరు మండలం బంగారిగడ్డ చౌరస్తాలో పార్టీ అరుణ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం రామలింగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించి ఆదాని అంబాని లాంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టారని అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి పల్లె నర్సింహ్మా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ చండూరు మండల సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య , మండల పార్టీ కార్య వర్గ సభ్యుడు కర్నాటి వెంకటేశం, మాజీ జడ్‌పిటిసి మాదగోని విజయలక్ష్మి , మాజీ సర్పంచ్ బోయపల్లి బిక్షమయ్య,పల్లె శంకరయ్య,మాదగోని శ్రీశైలం, సాయి, ఏఐటియూసినాయకులు బోయపల్లి శివలింగయ్య, ఎస్‌కె హమీద్, కొంగ్రెడ్డి రమేష్, నర్సింహ్మా, శ్రీను, మల్లేశం, లక్షకోటి పాల్గొన్నారు.

## 20న సార్వత్రిక సమ్మె



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ కోరారు. ఆదివారం పట్టణంలో సార్వత్రిక సమ్మె కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో మల్లు గౌతంరెడ్డి, తిరుపతి రామ్మూర్తి, పాపిరెడ్డి, వేణు, శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/భువనగిరి:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, శ్రామిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని, ఈనెల 20న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దామని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ, సిఐటియు జిల్లా అధ్యక్షులు దాసరి పాండులు పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య భవన్‌లోని ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియుల సంయుక్త సమావేశం నిర్వహించారు. మూడుసార్లు అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకు తీవ్రమైన ప్రయత్నాలు చేస్తుందని వారు అన్నారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు



**ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్:** సూర్యాపేట రూరల్ పరిధిలోని బాలెంల గ్రామ శివారులోని మున్సిపాలిటి డంప్‌యార్డు ఎదురుగా ఉన్న మామిళ్ల పల్లి నిర్మల సమాది వద్ద ఒక కేజీ గంజాయి విక్రయిస్తుండగా ఇద్దరు వ్యక్తులను పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు సూర్యాపేట డిఎస్పీ పార్థసారధి తెలిపారు. భాషనాయక్ తండాకు చెందిన అక్కినపల్లి సాయికిరణ్, సూర్యాపేట పట్టణానికి చెందిన కలిమిత్తు శ్రీకాంత్ లు ఇద్దరు గంజాయి విక్రయిస్తుండగా సిఐ రాజశేఖర్, ఎస్ఐ బాలునాయక్ లు సిబ్బందితో పట్టుకున్నట్లు తెలిపారు. వీరి నుండి కేజి గంజాయిని స్వాదీనం చేసుకున్నామని దీని విలువ పదివేల రూపాయలుంటుందని అన్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గంజాయి అమ్మినా, తరలించిన, సేవించిన కఠిన చర్యలుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చిరునవ్వుతో సర్వరోగాలు దూరం



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** నవ్వుతో సర్వరోగాలను దూరం చేయవచ్చునని, నవ్వడం ఒక బోగం, నవ్వించడం ఒక యోగం, నవ్వకపోవడం ఒక రోగమని సూర్యాపేట ఉన్నత యోగ శిక్షణ కేంద్రం యోగా గురువు చాడ పాపిరెడ్డి అన్నారరు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఉన్నత యోగ శిక్షణ కేంద్రంలో ప్రపంచ నవ్వులదినోత్సవాన్నిజరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ లాఫింగ్ యోగ సేవ క్లబ్ ఏర్పాటు చేసిన ప్రోత్సహిస్తున్నటువంటి మరికంటి వెంకట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నవ్వడం ద్వారా శరీరంలోని కండరాలు,నరాలు,అవయవాలుఉత్తేజితంపొందుతాయని, జీవితంలో నవ్వడం వల్ల సగటున ఏడేళ్ల ఆయస్సును పెరుగుతుందన్నారు. సంత్ నిరంకార్ సంస్థ జిల్లా అధ్యక్షురాలు కడారి సరళ, ప్రతిభ కళాశాల కరస్పాండెంట్‌వెంకటరెడ్డి,మల్లారెడ్డి, సుధాకర్, సుదర్శన్‌రెడ్డి, మమత, కళ్యాణి, గోరంట్ల శ్రీనివాస్, సైదులు, పద్మ, శ్వేత, లింగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## మేజర్ ప్రాజెక్టుల పూడికతీత పనులకు ప్రభుత్వం శ్రీకారం

### కోదాడలో నీటిపారుదలశాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష



**ప్రజాపక్షం/కోదాడ:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మేజర్ ప్రాజెక్టుల పూడికతీత పనులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర నీటిపారుదలశాఖ, పౌర సరఫరాల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం కోదాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. నీటి సామర్థ్యం పెంచేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమానికి అంకురార్పణ చుట్టిందన్నారు. నాగార్జునసాగర్,శ్రీరాంసాగర్ ప్రాజెక్టులలో మట్టి ఇసుక పేరుకు పోవడంతో నీటిసామర్ధ్యంతగ్గిపోయిందన్నారు. ఆరు దశాబ్దాలుగా పూడికతీత పనులు చేపట్టకపోవడంతో నీటి లభ్యత తగ్గిపోయి టెల్‌ఎండ్ భూములకు సరిపడా నీరు అందడంలేదన్నారు. ఖమ్మం జిల్లాలో నిర్మిస్తున్న సీతారాం ప్రాజెక్టుకు 67 టిఎంసిల గోదావరి జలాల కేటాయింపును కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిందన్నారు. తద్వార పాలేరు వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించి మోతె మండలానికి నీరు అందించనున్నట్లు తెలిపారు.



కోదాడ నియోజకవర్గ కేంద్రంలోని స్థానిక శాసన సభ్యురాలు పద్మావతి క్యాంపు కా ర్యాలయంలో ఆయన నీటిపారుదల శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, సిఇ రమేష్‌బాబులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కునేరు నుండి పాలేరు రిజర్వాయర్ వరద కాలువ ద్వారా పది టిఎంసిల నీటిని తరలించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**లబ్ధిదారులకు చెక్కులు**

కాంగ్రెస్ ప్రభుత్వ హా యంలో జరుగుతున్న అభివృద్ధిలో ప్రతి ఒక్కరు విధిగా భాగస్వామ్యం కావాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపిలుపునిచ్చారు. లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి , షాదిముబారక్ చెక్కులు పంపిణీ చేశా రు.

**28మందికి ఉద్యోగ నియామకపత్రాలు అందజేత**

విధులు నిర్వహిస్తూ చనిపోయిన కుటుంబాల వారికి రెవిన్యూశాఖ నుండి ఐదుగురు అభ్యర్థులకు, వైద్య ఆరోగ్యశాఖ నందు ఒక అభ్యర్థికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగం పొందిన వారికి నియామకపత్రాలు అందజేశారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ పద్దతిన మెరిట్ ఆదారంగా వివిధ పోస్టులలో 22 మంది అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేశారు. డిఎంహెచ్‌వో కోటచలం, వైద్య ఆరోగ్య సిబ్బంది, అధికారులున్నారు.

## 'నీట్'కు నల్లగొండలో 2006, సూర్యాపేటలో 859 మంది హాజరు



**ప్రజాపక్షం/నల్లగొండ :** నీట్ (యూజీ) 2025 ప్రవేశ పరీక్ష నల్గొండ జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్ష కేంద్రాలను ఆమె జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర ప్రవర్ తో కలిసి తనిఖీ చేశారు.పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటుచేసిన నీట్ పరీక్ష కేంద్రానికి వెళ్లి అక్కడ పరీక్షకు హాజరైన అభ్యర్థులు ,గైర్హాజరైన అభ్యర్థుల వివరాలు, ఏర్పాట్లు, పోలీస్ బందోబస్తు, తనిఖీలు,ఇతర ఏర్పాట్లను, సౌకర్యాలను ఆమె పరిశీలించడమే కాకుండా, పరీక్ష కేందరం చీఫ్ సూపరింటిండెంట్, నీట్ నోడల్ అధికారి శ్రీనివాస్, ఇతర అధికారులతో అడిగి తెలుసుకున్నారు.జిల్లాలో నీట్ పరీక్ష కోసం 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 2087 మంది అభ్యర్థులను పరీక్ష రాసేందుకు కేటాయించడం జరిగింది. ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్షకు 2006 మంది అభ్యర్థులు హాజరుకాగా, 81 మంది గైర్హాజరయ్యారు. 96.1 అభ్యర్థులు నీట్ పరీక్ష రాసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. కాగా నీట్ పరీక్ష రాసే అభ్యర్థులకు జిల్లా యంత్రాంగం మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ప్రధాన గేట్ నుండి పరీక్షా కేంద్రం వరకు వాహన సదుపాయం ఏర్పాటు చేసింది. అంతేకాక ఇంద్రియ విద్యాలయాకి వెళ్లేందుకు కూడా వాహనాలు ఏర్పాటు చేసింది.జిల్లా కలెక్టర్ వెంట స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ రాజ్ కుమార్,అదనపు ఎస్ పి రమేష్, నల్గొండ ఆర్‌డిఓ వై .అశోక్ రెడ్డి,తహసీల్దార్ హరిబాబు, ఇతర అధికారులు ఉన్నారు.

**'సూర్యాపేట'లో...**



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. నాలుగు కేంద్రాల్లో జరిగిన నీట్ పరీక్ష నిర్వహణ, విధానం, విద్యార్థుల హాజరు వివరాలను అధికారుల నుండి తెలుసుకున్నారు. పరీక్ష నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కగా పాటిస్తున్నారా లేదా గమనించి సూచనలు చేశారు. ఎక్కడ ఆవాంచనీయ ఘటనలు నమోదు కాలేదని, జిల్లాలో మొత్తం 890 మందిలో 859 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని, 31 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో నీట్ ప్రవేశ పరీక్ష శాంతియుత వాతావరణంలో నిర్వహించబడిందని తెలిపారు.

## సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఖాయం

### ఎంప్లాయిస్ యూనియన్ నాయకుల హెచ్చరిక



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె తప్పదని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి టి.పాండురంగయ్య హెచ్చరించారు. సమస్యల సాధనకు ఈ నెల 7న జరుప తలపెట్టిన సమ్మె గోడపత్రికను ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా వేతనాలు ఇస్తామని హామి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కార్మికులకు రావాల్సిన రెండు పే స్కేల్స్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నింఆరు. సీఎం సత్వరమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. లేనిపక్షంలో సమ్మె తప్పదని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకలు నరసింహా, జిల్లా ఉపాధ్యక్షుడు పి.రాము, ఎండి.బేగ్, డిపో అధ్యక్ష, కార్యదర్శులు వెంకన్న, బివై.కోటయ్య, మధు, బాలునాయక్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## మత ఛాందస విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

### ఎఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జిల్లానేత మల్లేష్



**ప్రజాపక్షం/దేవరకొండ:** విద్యార్థి, యువతకు విద్య, వైద్యం, ఉపాధి కల్పిచడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారని, మత ఛాందస విధానాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలని అఖిల భారత యువజన సమైఖ్య జిల్లా సహాయ కార్యదర్శి ఏషమోని మల్లేష్ అన్నారు. శనివారం ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేవరకొండ డివిజన్ సమితి ఆధ్వర్యంలో పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ జెండాను మల్లేష్ ఎగరవేశారు. ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తీర్చిదిద్దడంలో యువత పాత్ర ప్రధానమైనదని యువతరంలో ప్రగతిశీల, అభ్యుదయ, భావాలను, దేశ భక్తి లౌకిక ప్రజాస్వామిక ఆలోచనలను, నైతికవిలువలను, మానవత్వాన్ని పాదుకొల్పడానికి ఏఐవైఎఫ్ నిరంతరం కృషి సల్పుతున్నదన్నారు. దేశం కోసం ప్రాణార్పణ చేసిన భగత్‌సింగ్,రాజ్‌గురు,సుఖ్‌దేవ్, చంద్రశేఖర్ ఆజాద్, సుభాష్ చంద్రబోస్ లాంటి అమరవీరుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని స్వాతంత్ర్యోద్యమంలో యువకులనుసమీకరించివీరోచితమైన పోరాటం చేసిందన్నారు. ఏఐవైఎఫ్ పనిహక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలని, సమగ్ర యువజన విధానం కోసం, విద్య, వైద్య వ్యాపారాన్ని రద్దు చేయాలని, అవినీతికి వ్యతిరేకంగా, ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం, ప్రకృతి సంపద ప్రజలకే దక్కాలని, భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్‌ను రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాఅర్హతకు తగ్గ ఉపాధి అవకాశాలు లేక మన దేశంలో రోజురోజుకు నిరుద్యోగం పెరుగుతున్నదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర యువజన విధానం ద్వారా నిర్దిష్టమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను యువతకు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ డివిజన్ నాయకులు జూలూరి మహేష్, ఆంజనేయులు, గణేష్, జంగయ్య, శ్రీను, పాండు, జాకీర్, మహేష్, నగేష్, సత్యనారాయణ, శివ, రమేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి సామర్థ్యాన్ని పెంచాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి



**ప్రజాపక్షం/నల్లగొండటౌన్:** నల్లగొండ పట్టణ ప్రజలకు అందిస్తున్న తాగునీరు పానగల్ ఉదయ సముద్రం నీటి సామర్థం 1.5 టియంసి ల నుండి 3 టియంసిలకు పెంచాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి ప్రభుత్వాన్ని కోరారు.నల్లగొండ పట్టణ పరిధిలోని పానగల్ సిపిఐ శాఖ మహాసభ ఆదివారం సయ్యద్ గ్లాస్ అధ్యక్షతన జరిగింది. మహాసభకు వీరస్వామి ముఖ్యఅతిథిగామాట్లాడారు. సంక్షేమ పథకాలను అర్హులైన పేదలందరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా కేంద్రంలో వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం వచ్చిన పేదలకు ఇల్లు, ఇండ్ల స్థలాలు లేక అద్దె ఇళ్లలో ఉంటూ అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను తక్షణమే పంపిణీ చేయాలన్నారు. ప్రాచీన చరిత్ర కలిగిన పానగల్‌ను పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, నిధులు కేటాయించాలని కోరారు.నల్లగొండ పట్టణ, మండల 15వ మహాసభను ఈనెల 6న సిపిఐ కార్యాలయం, మగ్ధూమ్ భవన్ లో జరుగుతుందన్నారు. సిపిఐ సీనియర్ నాయకుల నేతి యాదగిరి,విశ్వనాదులు లెనిన్, ఎస్ వరయ్య, ఎం విజయ్ రెడ్డి, ఎస్ డి నిజాం,దాంతోజు నర్సింహా చారి తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే

### పౌర సరఫరాలశాఖ కమిషనర్ డిఎస్ చౌహాన్



**ప్రజాపక్షం/కోదాడ:** రైతులు కొనుగోలు కేంద్రాలకి ధాన్యం తరలించేటప్పుడు నాణ్యత ప్రమాణాలు పాటించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డిఎస్ చౌహాన్ అన్నారు. ఆదివారం బాలాజీనగర్ పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే కొనుగోలు కేంద్రాన్ని, ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహించే చిలుకూరు కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి సందర్శించారు. బాలాజీనగర్ పిఎసిఎస్ కొనుగోలు కేంద్రంలోని గోపతి శ్రీనివాస్ ధాన్యం తేమశాతం పరిశీలించగా నాణ్యత బాగుందని అభినందించి శాలువాతో సన్మానించారు. రైతుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రాగానే సీరియల్ నెంబర్ ఇవ్వాలని, సిరియల్ ప్రకారమే కాంటా వేసి మిల్లులకు తరలించాలనితెలిపారు. గన్ని సంచులు, లారీల సమస్య, హమాలీల కొరత ఉన్నదా అని నిర్వాహకురాలు అడగ్గా లారీలు, హమాలీలుగన్నిసంచులసమస్యలేదనితెలిపారు. అదనపు కలెక్టర్ రాంబాబు, డిఆర్‌డిఎ పిడి అప్పారావు, ఆర్డీవో సూర్యానారాయణ, తహసిల్దార్ వాజీద్ అలీ, డిసివో పద్మ, ఎపిడి సురేష్ తదితరులున్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

**ప్రజాపక్షం/ మోటకొండూరు :** యాదాద్రి భువనగిరి జిల్లా మూటకొండూర్ మండలం ముత్తిరెడ్డిగూడెంలో ఇటీవల మరణించిన బర్మల నరసయ్య కుటుంబానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు యెల్లంల సంజీవరెడ్డి రెడ్డి సహకారంతో 50 కేజీల బియ్యాన్ని గ్రామ శాఖ అధ్యక్షులు నూనెముంతల సంతోష్ ఆధ్వర్యంలో మృతుడు కుటుంబానికి అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చాడ శశిధర్ రెడ్డి, నెమ్మాని సుబ్రహ్మణ్యం, పంతుల రవీందర్, ఏకు సంజీవరెడ్డి, పులి సత్తయ్య, బుడిగే బాలరాజు, ఆడెపు బిక్షపతి,దండ్ల చంద్రయ్య, ముత్తిరెడ్డిగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


## క్యాంపస్ సెలక్షన్‌లోనే రెండు ఉద్యోగాలకు ఎంపిక

### ఐఐటి బాంబేలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన పల్లె భావన



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** గురిపెట్టి చదివితే లక్ష్యాన్ని చేదించడం పెద్ద కష్టమేమీ కాదని నిరూపించింది ఆ అమ్మాయి. తాను అనుకున్న లక్ష్యాన్ని చేదించే వరకు విశ్రమించకుండా కష్టపడింది. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థ నారాయణపురం మండలం లింగవారి గూడెం గ్రామానికి చెందిన పల్లె భావన జేఈఈలో జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకును సాధించి ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ సీటు పొందింది. దేశంలోనే అత్యున్నతమైన ఐఐటి బాంబేలోని అధ్యాపకుల పర్యవేక్షణలో నాలుగు సంవత్సరాలు ఇంజనీరింగ్ కోర్స్ పూర్తిచేసి కళాశాల ప్రాంగణ ఎంపికలో రెండు ఉద్యోగాలకు అర్హత సాధించింది. శనివారం పల్లె బావనకు ఐఐటి బాంబేలో నిర్వహించిన కమెన్స్‌మెంట్ 2025 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రీన్యూ సీఈవో చైర్మన్ సుమంత్ సిన్హా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాలుగేళ్ల ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ సర్టిఫికెట్ అందుకున్న అనంతరం పల్లె భావన మాట్లాడుతూ 2021వ సంవత్సరంలో జేఈఈలో జాతీయస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించి ఐఐటి బాంబేలో చేరానని తెలిపారు. రెండవ సంవత్సరం నుంచి గూగుల్ కంపెనీలో ఇంటర్న్ షిప్ చేశానని అన్నారు. ప్రాంగణ ఎంపికల్లో లక్సంబర్గ్ అమెజాన్, జపాన్ హోండా రీసెర్చ్ టీం, హైదరాబాద్ గూగుల్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యానని తెలిపారు. కానీ తాను హైదరాబాదులోని గూగుల్ కంపెనీ లోనే ఉద్యోగం చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రజాపక్షంతో తెలిపారు. కుమార్తె గురిపెట్టిన లక్ష్యాన్ని సాధించడం పట్ల తల్లిదండ్రులు పల్లె శేఖర్ రెడ్డి,సరళ దంపతులు పుత్రికోత్సాహంతో మురిసిపోతున్నారు.

## ఘనంగా భగీరథ మహర్షి జయంతి



**ప్రజాపక్షం/యాదాద్రి :** భగీరథ మహర్షి జయం తి ఉత్సవాలను ఆదివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ వేడుకలలో వివిధ శాఖల అధికారులు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి, భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆనాడు భగీరథుడు ఘోర తపస్సు ద్వారా అవిశ్రాంతంగా కృషి చేసి ఆకాశ గంగను ఆకాశం నుండి భూమి పైకి తెచ్చాడని పురాణ ఇతిహాసాలలో పేర్కొనబడిందని అన్నారు. ఏదైనా కష్టమైన కార్యం సాధించాలంటే మహర్షి భగీరథుడి కృషిని ప్రస్తావిస్తూ, ఆ స్ఫూర్తితో ముందుకు సాగాల్సిందిగా ఇప్పటికీ పెద్దలు సూచిస్తారని గుర్తు చేశారు. మహనీయులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో సమాజ హితానికి పాటుపడేందుకు వీలుగా ప్రభుత్వం మహనీయుల జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని అన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా మహనీయుల ఆలోచనా విధానాలతో నేడు మనమంతా ముందుకు సాగితే సమాజం సత్వర అభివృద్ధి సాధించేందుకు, రుగ్మతలు దూరం అయ్యేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి యాదయ్య, బీసీ సంఘాల ప్రతినిధులు,వివిధశాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ : కల్వకుర్తి మండలం ఎల్లికట్ల గ్రామంలో బలగం చిన్నవెంకటయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మిషన్ భగీరథ మాజీ వైస్‌చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణజాగృతి జిల్లా అధ్యక్షుడు దారమోని గణేష్, నాగయ్య, భీమయ్య, బిఆర్ఎస్ పార్టీ బి సిసెల్ ప్రధాన కార్యదర్శి శేఖర్‌గౌడ్, స్వామి పాల్గొన్నారు.



## పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : నీట్ (యూజీ) పరీక్షల సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎంవిఎస్ డిగ్రీ కళాశాల ఎన్‌టిఆర్ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్త్ ఏర్పాట్లను జిల్లా పోలీసు అధికారి డి.జానకి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఉండేందుకు ప్రత్యేక ట్రాఫిక్ సిబ్బందిని నియమించామని చెప్పారు. కేంద్రాల వద్ద శాంతి భద్రతలు కాపాడేందుకు అవసరమైన పోలీ స్ సిబ్బందిని మోహరించామని వెల్లడించారు. అంతేగాక తల్లిదండ్రులు, విద్యార్థులు నిర్భయంగా పరీక్షలకు హాజరయ్యేలా పోలీస్ శాఖ అన్ని చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్ల పట్టివేత



ధన్వాడ ఎస్సై రాజశేఖర్

ప్రజాపక్షం/నారాయణపేట/ధన్వాడ : ధన్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తుంటే గోటురు గ్రామ శివారులో టాస్క్ ఫోర్స్, ధన్వాడ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి మూడు ట్రక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కి తరలించి కాంతి వెంకటయ్య డ్రైవర్, ఓనర్, (గోటూర్), డోకూరు రఘువేందర్, డ్రైవర్, ఎం.మహేందర్ ఓనర్, (గోటూర్), బాలరాజ్, డ్రైవర్. యం.డి.మౌలానా,ఓనర్,(గోటూర్) గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ధన్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి పర్మిషన్ లేకుండా అక్రమంగా ఎవరైనా ఇసుక తరలిస్తే వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు.

## అమెరికా ద్వంద్వ విధానాలే అశాంతికి కారణం

తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ సామాజికవేత్త కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్

ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి : అగ్రరాజ్యం అమెరికా ద్వంద్వ విధానాల వల్లనే ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో అశాంతియుత వాతావరణం నెలకొన్నదని, పలు దేశాల మధ్య యుద్ధ వాతావరణం పద్ధతుల్ల పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ సామాజికవేత్త, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్ అభిప్రాయపడ్డారు. మహబూబ్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏ మతంలో ఉన్నా పౌరులు సామాజిక శాంతియుత వాతావరణాన్నిర, శాంతియుత జీవనాన్ని కోరుకుంటారని తెలిపారు. ఏమతం కూడా ఉగ్రవాదాన్ని సహించబోదని చెప్పారు. అగ్రరాజ్య భావనతో ఉన్న అమెరికాను ప్రపంచ దేశాలు కట్టడి చేసి ఒంటరి పాటు చేయాల్సిన అవసరం ఉందని, ఆ దేశంపై ఆంక్షలు విధించాలని ఈ సందర్భంగా హనీఫ్ అహ్మద్ అభిప్రాయపడ్డారు.

## ఎమ్మెల్యేకు బహుమతి ప్రదానం



ప్రజాపక్షం/కొత్తకోట : కొత్తకోట మండల పరిధిలోని చర్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ వార్డు నంబర్ నరేందర్ గౌడ్ ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి జన్మదినం సందర్భంగా వారిని కలిసి బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి గ్రామం మాజీ సర్పంచ్ శేఖర్ రెడ్డి, మండల అధ్యక్షులు బీచుపల్లి, రామకృష్ణపురం, మాజీ సర్పంచ్ శివరాములు, భూత్పూర్ మాజీ సర్పంచ్ అంజి, రఫీ, తిరు మల్లేష్ , రాంమోహన్ రెడ్డి, హరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతోనే జీవితానికి ప్రశాంతత



ప్రజాపక్షం/కల్వకుర్తి : భక్తిశ్రద్ధలతోనే మానవుని జీవితానికి ప్రశాంతత కలుగుతుందని ఐక్యత ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణకేంద్రంలో మల్లెలమ్మ ఆలయ వార్షికోత్సవానికి ఐక్యతఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు సుంకిరెడ్డికృష్ణారెడ్డి సుభాషిణిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలుచేశారు. ప్రజలందరిపై అమ్మవారి అనుగ్రహం ఆశీర్వాదాలు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయ కమిటి సభ్యులు మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి అడిగినవెంటనే రూ.2లక్షలతో పెయింటింగ్ పనులు పూర్తిచేసి, దేవాలయ అభివృద్ధికి సహకరించిన ఐక్యత ఫౌండేషన్‌చైర్మన్, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డిరాఘవేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వార్షికోత్సవానికి విచ్చేసిన గౌరవాధ్యక్షులు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి సుభాషిణిరెడ్డిలకు శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్, యువజన నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, శ్రీకాంత్, ఆలయ కమిటిసభ్యులు లక్ష్మణ్, శివకుమార్, పరమేశ్వర్, బాలనర్సింహ్మా, రాజలింగం పాల్గొన్నారు.

# నేటి నుండి రెవెన్యూ సదస్సులు సద్వినియోగం

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



ప్రజాపక్షం/వనపర్తి : మండలలంలోని 9 గ్రామాల్లో రెండు రెవెన్యూ బృందాలు షెడ్యూల్ వారీగా గ్రామాలను సందర్శించి ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు భూ సమస్యల దరఖాస్తులు స్వీకరిస్తారని. అక్కడికక్కడే పరిష్కారం అయ్యే సమస్యలను అక్కడే పరిష్కరించి మిగిలిన సమస్యలను మే 13 నుండి 20 లోపు పరిష్కరిస్తారని కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలియజేశారు.

**గ్రామాల్లో ఉండే భూ సమస్యలు...**

పాసుబుక్‌లో సర్వే నంబర్ ఎక్కలేదు. (1ఏ కొత్త రికార్డులలో ఎక్కలేదు. (మిస్సింగ్), 1బి సర్వే నంబర్ ఎక్కింది కాని నా పేరు మీద రాలే దు. నా పాసుబుక్‌లో ఉన్న సర్వే నంబర్లలో సవరణ (2ఏ విస్తీర్ణం, 2బి భూమి వివరణ సంక్రమించిన విధానం /భూమి స్వభావం, 2సి పట్టాదారు వివరాలు (పేరు తండ్రి పేరు, కులం, లింగం). నిషేధిత జాబితాలో ఉంది (తొలగించడానికి, చేర్చడానికి). పట్టా హక్కుల గురించి, ఇతరములు (4ఓ అసైన్‌మెంట్. 4హెచ్ ఓఆర్సీ రాలేదు. 4సి 38 ఈ రాలేదు. 4డి వారసత్వం. 4ఈ భూసేకరణ సమస్యలు. 41. ఇతరులు). గ్రామ ప్రజలకు భూ సమస్యలకు సంబంధించిన నమూన దరఖాస్తులు ముందుగానే పంపిణీ చేస్తారని, దరఖాస్తులు సరిగ్గా పూరించి రెవెన్యూ సదస్సుకు వచ్చే అధికారులకు అందజేయాలని తెలియజేశారు.

**వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి**

వేసవిలో భానుడి ప్రతాపం రోజు రోజుకి తీవ్ర రూపం దాల్చి ప్రజలను అనారోగ్యానికి గురయ్యేలా చేస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నేడొక ప్రకటనలో తెలిపారు. వేసవి కాలం ఎక్కువగా ఇబ్బంది పెట్టే సమస్య వడదెబ్బ, అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కారణంగా బయట పనికి వెళ్లేవాళ్లే కాకుండ ఇంట్లో ఉండే వృద్దులు, పిల్లలు సైతం వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంటుందని సూచించారు. ఈ సందర్భంగా కొన్ని జాగ్రత్తలు పాటించి వడదెబ్బ తగలకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఉదయం నుండి 12 గంటల లోపే బయటి పనులు పూర్తి చేసుకోవాలని, అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లకపోవడం మంచిదని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెళ్లవాల్సి వస్తే నెత్తికి టోపి లేదా గొడుగు వెంట తీసుకువెళ్లాలి. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యసహాయం తీసుకోవడం ముఖ్యం. వడదెబ్బకు గురైనప్పుడు సరైన చర్యలు తీసుకోకపోతే ప్రాణాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉంటుంది. వేసవిలో వడదెబ్బ తగలకుండా ఉండాలంటే ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ముఖ్యంగా చల్లటి నీరు, ఓఆర్ఎస్ ద్రావణం, పండ్ల రసాలు తీసుకోవడం, తేలికైన దుస్తులు ధరించడం చాలా ముఖ్యం. వడదెబ్బ లక్షణాలు తలనొప్పి, వాంతులు, మైకం, అధిక జ్వరం, తల తిరగడం, స్పృహ కోల్పోవడం కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి. పిల్లలు, వృద్దులు ఎండలో ఎక్కువ సేపు ఉండకూడదు. వీలైనంత వరకు ఇంట్లోనే ఉండటం మంచిదని సూచించారు.

## శేష జీవితం ప్రజాసేవకు అంకితమవ్వాలి



ప్రజాపక్షం/వనపర్తి : పదవీ విరమణ పొందిన ప్రతి ఒక్కరి శేష జీవితం ఏదో రకంగా ప్రజాసేవకు అంకితం ఇవ్వాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సూచించారు. ఆదివారం వనపర్తి పట్టణంలోని ఎంవైఎస్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఎంపిపిఎస్ ఎన్టీఆర్ నగర్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహించే గులాబ్ రాణి పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయురాలు గులాబ్ రాణితో పాటు భర్త మాజీ ఎంపీటీసీ దామోదర్ దంపతులిద్దరికి శాలువా, పూలమాలలతో సన్మానించారు. పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వ నుంచి అందించే బెనిఫిట్స్ అందించంలో ఏదైనా జాప్యం జరుగుతే దానిని తన ఏదైనా జాప్యం జరుగుతే దానిని తన దృష్టికి తీసుకురావాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారికి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రస్తుతం పదవి విరమణ పొందిన గులాబ్ రాణి దంపతులు ప్రజా సేవ చేయడానికి ముందుకు వస్తే తాను ఎల్లవేళలా సహకరిస్తానని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ప్రదానోపాదాయులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



ప్రజాపక్షం/నారాయణపేట్ : జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ నారాయణపేట జిల్లా పరిధిలో దొంగతనాల నిర్మూలన గురించి పోలీస్ పెట్రోలింగ్ పెంచడం జరిగింది. అని గ్రామాలలో, పట్టణ కేంద్రంలోని కాలనీలో ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చిన అనుమానిత వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీస్ వారికి డయల్ 100 లేదా 24'7 పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్ 8712 670399కి, లేదా సంబంధిత లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ తెలిపారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో పూర్తిస్థాయి పెట్రోలింగ్ పెంచడం జరిగిందని పెట్రోకార్ పెట్రోలింగ్, బ్లూ కోట్స్ పెట్రోలింగ్ అలాగే మఫ్టీలో పోలీసులను, టాస్క్ ఫోర్స్ పోలీసుల ద్వారా నిరంతరం నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. దొంగతనాల నిర్మూలనకు పూర్తిస్థాయి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. అలాగే పాత నేరస్తుల పై నిఘా ఏర్పాటు చేసి ప్రతిరోజు వారిని తనిఖీ నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు ఎవరైనా గ్రామాలలో ఎక్కువ రోజులు ఇండ్లకు తాళ వేసి టూర్లు లేదా బంధువుల ఊర్లకు వెళ్లినచో సంబంధిత లోకల్ పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని ఆయా ఏరియాల్లో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. గ్రామాలలో ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు చేయడాలని భయపడతారని , అసాంఘిక కార్యకలాపాలు నిర్మూలించడానికి అవకాశం ఉంటుంది. కావున ప్రతి గ్రామంలో ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ కోరారు.

# ఘనంగా భగీరథ జయంతి

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : భగీరథ జయంతి సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ర్యాలీతోపాటు జయంతి ఉత్సవాలు సగరసంఘం జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం భగీరథ జయంతిని పురస్కరించుకొని బైక్‌ర్యాలీలు నిర్వహించారు. అనంతరం బస్టాండుకూడలితోపాటు హౌసింగ్‌బోర్డు తదితర ప్రాంతాలలో భగీరథ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారికంగా నిర్వహించిన భగీరథ జయంతి కార్యక్రమంలో సగర సంఘం బాధ్యులు ఆసంఘం నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా సగరసంఘం జిల్లా కార్యాలయంలో ఆసంఘం జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీను ఆధ్వర్యంలో భగీరథ జయంతి జరుపుకోవడం జరిగింది. అదేవిధంగా నాగర్‌కర్నూల్ సగరసంఘం కార్యాలయం నుంచి హౌసింగ్‌బోర్డు వరకు హౌసింగ్‌బోర్డు నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు బైక్‌ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కార్యాలయంలో అధికారికంగా భగీరథ జయంతిని జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లంరాములు, రాష్ట్ర మహిళా సంఘం జనరల్ సెక్రటరీ అతినారపు విజయలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబుసాగర్, బాలయ్య, అతినారపు వెంకటేష్‌సాగర్, స్వామిసాగర్, పాండులతోపాటు వివిధ గ్రామాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు, జిల్లాకార్యవర్గ సభ్యులు సగరబంధువులు పాల్గొన్నారు.



## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాపక్షం/వీపనగండ్ల : ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిసాం చదువులమ్మ చెట్టు నీడలో అంటూ వీపనగండ్ల ఏహెచ్ఎస్ పాఠశాల 1988/1989 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో నాటి గురువులకు పూర్వ విద్యార్థులు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానం చేసి మెమెంటోలను అందజేశారు. నాటి గురువులతో విద్యాబోధనను స్వీకరించుకున్న విద్యార్థులు కొందరు వివిధ హోదాలలో ఉద్యోగాలను, మరికొందరు స్వయం ఉపాధి పనులు, ఇతరత్రా పనులను చేసుకుంటూ జీవనం కొనసాగిస్తూ ఒకరినొకరు పరిచయం చేసుకొని సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఆత్మీయ సమ్మేళనంలో నాటి మధుర జ్ఞాపకాలను స్మరించుకుంటూ పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాటి ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు శేఖర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, నారాయణ, ఖాజా మైనుద్దీన్ ,పూర్వ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన మార్కెట్ చైర్మన్



ప్రజాపక్షం/కొత్తకోట : దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పాపయ్య కృష్ణారెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మదనాపూర్ మార్కెట్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండలం టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్. బీచుపల్లి యాదవ్, పి.అరుణ శ్రీనివాస్, చెర్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సూదిరెడ్డి శేఖర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బోయెజ్, రామాపురం చంద్రమోహన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాంమోహన్ రెడ్డి, జేఎం మీషేక్, లతీఫ్, డబ్బా సలీం, ఉమా మహేశ్వర్ రెడ్డి, సాయి యాదవ్, సుభాష్, ముంత బాలరాజు, కొట్టం శివకుమార్ రెడ్డి, నవీన్‌రెడ్డి, సంకిరెడ్డిపల్లి ముస్తఫా పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా బాణాసంచా పేల్చి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

# నేడు భగత్ సింగ్ విగ్రహావిష్కరణ



ప్రజాపక్షం/మక్తల్ : మక్తల్‌లో నేడు షహీద్ భగత్ సింగ్ విగ్రహావిష్కరణకు సర్వం సిద్ధం అయిందని విగ్రహావిష్కరణ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాసిన నాయకులు ఎం.కృష్ణ మాట్లాడుతూ దేశంలో దేశభక్తి కొరబడిందని జాతీయ ఉద్యమంలో పోరాడిన విప్లవ వీరులైనటువంటి భగత్ సింగ్ రాజుగురు అల్లూరి సీతారామరాజు ఆజాద్ చంద్రశేఖర్ లాంటి విప్లవ వీరులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రైతులు కోరుకుంటున్న అటువంటి మద్దతు ధర మరి ఎమ్మెస్పీ చట్టం వెంటనే ప్రభుత్వాలు చేయాలని నాలుగు లేబర్ కోడ్లు రద్దుచేసి కార్మిక చట్టాలను పటిష్టంగా అమలుపరచాలని యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను సమృద్ధిగా అందజేయాలని డిమాండ్ చేశారు. నేడు జరగబోయే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విగ్రహ ఆవిష్కరణ ప్రొఫెసర్ జగ్ మోహన్ సింగ్, గుమ్మడి నరసయ్య ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి సిపిఐ ఎంఎల్ మాస్టర్ జాతీయ కార్యవర్గ సభ్యులు కేజీ రాంచందర్ తదితరులు హాజరవుతారని తెలిపారు. మక్తల్ నియోజకవర్గ ప్రజలు విద్యార్థులు యువకులు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు అందరూ పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## నేటి సమాజానికి ఆదర్శప్రాయుడు భగీరథ మహర్షి



ప్రజాపక్షం/నారాయణపేట్ : భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో ఆదివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరై భగీరథ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. సమాజ హితం కోసం ఆనాడు భగీరథుడు అవిశ్రాంతంగా కృషి చేసి నేటి సమాజానికి కూడా ఆదర్శప్రాయుడయ్యారని కొనియాడారు. ఏదైనా కష్టమైన కార్యం సాధించాలంటే మహర్షి భగీరథుడి కృషిని ప్రస్తావిస్తూ, ఆ స్ఫూర్తితో ముందుకు సాగాల్సిందిగా పెద్దలు సూచిస్తారని గుర్తు చేశారు. మహనీయులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో ముందుకు సాగేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం వారి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి అభివృద్ధి శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, డిపిఆర్ఓ ఎం.ఏ.రషీద్, సగర సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, సగర సంఘం నాయకులు మల్లికార్జున్, నర్వ చెన్నయ్య సాగర్, విజయ్ సాగర్, నిడుగుర్తి శంకర్, ధన్వాడ శంకరయ్య, నర్వ రామకృష్ణ, కడేచూర్ అంజి, మన్నె నారాయణ, ఆనంద్, బుసన్న, రాజబాబు, సురేందర్, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలు

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను ఆదివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పద్మావతి కాలనీలో నిర్వహించిన వేడుకలలో మహర్షి భగీరథ విగ్రహానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు మాట్లాడుతూ సమాజ హితం కోసం ఆనాడు భగీరథుడు అవిశ్రాంతంగా కృషి చేసి నేటి సమాజానికి కూడా ఆదర్శ ప్రాయుడయ్యారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిసి అభివృద్ధి శాఖ అధికారిణి ఇందిర, నగర్,పాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**బీసీ సమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా సగర భగీరథ మహర్షి జయంతి**

సగర భగీరథ మహర్షి మహా జ్ఞాని, పరోపకారానికి పెట్టింది పేరు, దీక్షకు సహనానికి ప్రతి రూపమని బీసీ సమాజ్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు ఏం.శ్రీనివాస్ సాగర్ అన్నారు. బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో సగర భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బీసీ కుల సంఘ పెద్దలు నాయకుల సమక్షంలో పూలమాలలు వేసి ఘనంగా జయంతి నివాళులు అర్పించడం జరిగింది. ఎంత కష్టానైనా లెక్కచేయకుండా అనుకున్నది సాధించేంతవరకు అలుపెరుగని పోరాటం చేసి దివి నుండి గంగను భూమికి తీసుకొచ్చాడని శ్రీనివాస్ సాగర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీ కాంత్, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, బీసీ జర్నలిస్టు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆశన్న ముదిరాజ్, నాయి బ్రాహ్మణ సంఘ పట్టణ అధ్యక్షుడు అశ్విని సత్యం, వీరభద్ర కాలేజీ కరస్పాండెంట్ సత్యనారాయణ, బీసీ సమాజ్ దేవరకద్ర నియోజకవర్గ కన్వీనర్, బి.శేఖర్ బీసీ సమాజ్ భూత్పూర్ మండల కన్వీనర్, డి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాపక్షం / పాన్‌గల్ : పాన్‌గల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990/1991 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని కేఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్మరంలో నాటి గురువులకు పూర్వ విద్యార్థులు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానం చేసి మెమెంటోలను అందజేశారు. నాటి గురువులతో విద్యాబోధనను స్వీకరించుకున్న విద్యార్థులు నేడు వివిధ హోదాలలో ఉద్యోగాలను, ఇతరాత్రా పనులను చేసుకుంటూ జీవనం కొనసాగిస్తూ ఒకరినొకరు పరిచయం చేసుకొని సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఆత్మీయ సమ్మేళనాలు నాటి మధుర జ్ఞాపకాలను స్మరించుకోవడం జరుగుతుందని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పూర్వ గురువులైన శివన్న, దామోదర్ రెడ్డి, సూర్య నారాయణ, విజయలక్ష్మి లను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. వివిధ కారణాలతో మరణించిన పూర్వ గురువులకు, విద్యార్థులకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. పూర్వ విద్యార్థులు ఎక్సైజ్ సీఐ బాలకృష్ణ, ఉపాధ్యాయులు వీరస్వామి, సాయి ఈశ్వర్‌రెడ్డి, బాలస్వామి, స్నేహితులు సుదర్శన్ రెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

## క్రీడ

# పరాగ్ పోరాడినా... కోల్‌కతాదే విజయం




ఐపిఎల్ 18 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఐదో విజయం సాధించింది. సొంతగడ్డపై రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో ఒక్క పరుగు తేడాతో గెలిచింది. తొలుత కోల్‌కతా నిర్ణీత 4 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. ఆండ్రీ రస్సెల్ (57; 25 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. లక్ష్యఛేదనలో రాజస్థాన్ 8 వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. కెప్టెన్ రియాన్ పరాగ్ (95; 45 బంతుల్లో 6 ఫోర్లు, 8 సిక్స్‌లు) పోరాటం వృథా అయింది. యశస్వి జైస్వాల్ (34; 21 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), హెట్‌మయర్ (29; 23 బంతుల్లో) రాణించారు. వైభవ్ సూర్యవంశీ (4), కునాల్ సింగ్ రాథోడ్ (0), ధ్రువ్ జురెల్ (0), వానిందు హసరంగ (0) ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. చివర్లో శుభమ్ దూబె (25; 14 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు), జోఫ్రా ఆర్చర్ (12; 8 బంతుల్లో) పోరాడినా రాజస్థాన్‌కు ఓటమి తప్పలేదు.

లక్ష్యఛేదనలో రాజస్థాన్ ఎనిమిది పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. తొలి రెండు ఓవర్లలోనే వైభవ్ సూర్యవంశీ (4), కునాల్ సింగ్ రాథోడ్ (0) వెనుదిరిగారు. ఈ క్రమంలో యశస్వి, పరాగ్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. అరోరా వేసిన మూడో ఓవర్‌లో చెరో సిక్స్ బాదారు. హర్షిత్ వేసిన తర్వాతి ఓవర్‌లో పరాగ్ రెండు ఫోర్లు, ఓ సిక్స్ రాబట్టాడు. జైస్వాల్‌కు చకచకా బౌండరీలు బాదడంతో పవర్ ప్లే ముగిసేసరికి రాజస్థాన్ 59/2తో మెరుగైన స్థితిలో నిలిచింది. అయితే, మొయిన్ అలీ వేసిన తర్వాత ఓవర్‌లో జైస్వాల్.. రింకు సింగ్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. అనంతరం వరుణ్ ఒకే ఓవర్‌లో జురెల్, హసరంగను ఔట్ చేశాడు. దీంతో కొన్ని ఓవర్లపాటు స్కోరు వేగం నెమ్మదించింది. ఈ క్రమంలో పరాగ్ ఒక్కసారిగా గేర్ మార్చాడు. మొయిన్ అలీ వేసిన 13 ఓవర్‌లో పరాగ్ ఏకంగా ఐదు సిక్స్‌లు బాదేసి రాజస్థాన్‌ను పోటీలోకి తెచ్చాడు. అయితే, హర్షిత్ తన వరుస ఓవర్లలో హెట్‌మయర్, పరాగ్‌ను ఔట్ చేయడంతో కోల్‌కతా రేసులోకి వచ్చింది. అప్పటికి రాజస్థాన్ స్కోరు 18 ఓవర్లకు 174/7.

### ఆఖర్లో ఉత్కంఠ!

రస్సెల్ 19 ఓవర్ వేసి 11 పరుగులు ఇచ్చాడు. ఆఖరి ఓవర్ (వైభవ్ అరోరా బౌలర్)లో రాజస్థాన్ గెలవాలంటే 22 పరుగులు అవసరం కాగా.. తొలి రెండు బంతుల్లో మూడు పరుగులు వచ్చాయి. తర్వాత శుభమ్ దూబె వరుసగా 6, 4, 6 బాదేశాడు. చివరి బంతికి విజయ సమీకరణం మూడు పరుగులు కాగా.. ఒకే రన్ వచ్చింది. రెండో పరుగు పూర్తిచేసే క్రమంలో ఆర్చర్ రనౌటయ్యాడు. దీంతో కోల్‌కతా ఒక్క పరుగు తేడాతో గట్టెక్కింది.

### రస్సెల్, రఘువంశీ మెరుపులు

తొలుత కోల్‌కతా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోగా.. ఆండ్రీ రస్సెల్ (57; 25 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. అంగ్‌క్రిష్ రఘువంశీ (44; 31 5 ఫోర్లు), రెహ్మానుల్లా గుర్బాజ్ (35; 25 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌లు), అజింక్య రహానే (30; 24 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించారు. చివర్లో రింకు సింగ్ (19; 6 బంతుల్లో) మెరుపులు మెరిపించాడు. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, యుధ్వీర్ సింగ్, మహీశ్ తీక్షణ, రియాన్ పరాగ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

# ప్రభ్‌సిమ్రన్ ఊచకోత..




ధర్మశాలలో పంజాబ్ కింగ్స్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(91) వీరవిహారం చేశాడు. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లను ఊచకోత కోశాడు. ఫోర్లు, సిక్సర్లతో విజృంభించిన అతడికి శ్రేయస్ అయ్యర్(45) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో సహకరించాడు. ఇక డెత్ ఓవర్లలో బ్యాట్ ఝులిపించిన శశాంక్ సింగ్(29 నాటౌట్), మార్కస్ స్టొయినిస్(15 నాటౌట్) విధ్వంసం సృష్టించారు. దాంతో, పంజాబ్ ప్రత్యర్థి ముందు పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. హిమాలయ పర్వత సానువుల్లోని ఈ మైదానంలో జరిగిన టీ20ల్లో ఇదే అత్యధిక స్కోర్ కావడం విశేషం. ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న పంజాబ్ కింగ్స్ కీలక పోరులో భారీ స్కోర్ చేసింది. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లను చితక్కొ విధ్వంసక ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(1) తొలి ఓవర్లోనే ఔటయ్యాడు. ఆకాశ్ సింగ్ వేసిన బంతిని అతడు థర్డ్ మ్యాన్ దిశగా ఆడగా మయాంక్ ఒడిసి పట్టుకున్నాడు. ఆ తర్వాత వచ్చిన జోష్ ఇంగ్లిస్(30).. మయాంక్ బౌలింగ్‌లో హ్యాట్రిక్ సిక్సర్లతో పంజాబ్ స్కోర్ బోర్డును ఉరికించాడు. అయితే.. ఈ చిచ్చరపిడుగును వెనక్కి పంపిన ఆకాశ్ రెండో వికెట్ సాధించాడు. అయినా సరే ఇక, 21 పరుగుల వద్ద ప్రభ్‌సిమ్రన్ సింగ్(91 48 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లు)కు లైఫ్ లభించింది. అవేశ్ ఖాన్ ఓవర్లో అతడు గాల్లోకి లేపిన బంతిని పూరన్ అందుకోలేకపోయాడు.

### కెప్టెన్‌తో కీలక భాగస్వామ్యం

దొరికిన లైఫ్‌ను సద్వినియోగం చేసుకున్న ప్రభ్‌సిమ్రన్ ఆపై దంచికొట్టాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(45), నేహల్ వధేరా(16)లతో కలిసి విలువైన భాగస్వామ్యం నెలకొల్పాడు. రథీ బౌలింగ్‌లో అయ్యర్, ప్రిన్స్ ఓవర్లో నేహల్ వెనుదిరిగారు. ఆ తర్వాత శశాంక్ సింగ్ (33 నాటౌట్) తోడుగా ప్రభ్‌సిమ్రన్ రెచ్చిపోయాడు. అవేశ్ ఖాన్ వేసిన 18వ ఓవర్లో వరుసగా 6, 4, 6 బాది సెంచరీకి చేరువయ్యాడు. పంజాబ్ స్కోర్ 200లు దాటింది. అయితే.. దిగ్వేశ్ రథీ ఓవర్లో స్వీప్ షాట్ ఆడి పూరన్‌కు క్యాచ్ ఇచ్చాడు. మార్కస్ స్టోయినిస్(15 నాటౌట్) 20వ ఓవర్లో సిక్సర్ కొట్టగా.. శశాంక్ చివరి బంతిని బౌండరీ దాటించాడు. దాంతో, పంజాబ్ నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 235 రన్స్ చేసింది.

# ముక్కోణపు సిరీస్‌లో భారత్‌కు తొలి ఓటమి



**కొలంబో:** శ్రీలంక వేదికగా జరుగుతున్న ముక్కోణపు సిరీస్‌లో భారత మహిళల క్రికెట్ జట్టు తొలి ఓటమి చవిచూసింది. టీమ్ ఇండియాపై శ్రీలంక 3 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 275 పరుగులు చేసింది. ఈ టార్గెట్‌ని శ్రీలంక.. ఐదు బంతులు మిగిలుండగానే 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. లంక బ్యాటర్లలో నీలాక్షి డి సిల్వా (56), హర్షిత సమరవిక్రమ (53) అర్ధ శతకాలు బాదారు. టీమ్‌ఇండియా బ్యాటర్లలో రిచా ఘోష్ (58; 48 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరిసింది. ప్రతీకా రావల్ (35), జెమీమా రోడ్రిగ్స్ (37), హర్మన్‌ప్రీత్ కౌర్ (30), హర్లిన్ డియోల్ (29), దీప్తి శర్మ (24) పరుగులు చేశారు.

# ఆ రాత్రి నన్నెంతో మార్చేసింది




నాని యాక్షన్ ఎంటర్‌టైనర్ 'హిట్ 3' బాక్సాఫీస్ దగ్గర సెన్సేషనల్ రన్ కొనసాగిస్తుంది. కాగా తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో నాని తనకు గతంలో జరిగిన ఓ కారు ప్రమాదం గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేస్తూ.. ఆ ప్రమాదం తర్వాత తాను జీవితాన్ని చూసే కోణంలో ఎంతో మార్పు వచ్చింది అంటూ తెలిపారు. ఇంతకీ, నాని ఇంకా ఏం మాట్లాడారు అంటే.. 'నేను కారు కొనుగోలు చేయడానికి కంటే ముందే నాకొక రోడ్డు ప్రమాదం జరిగింది. నా ఫ్రెండ్ కారు తీసుకుని స్నేహితులతో కలిసి హైవేపై డ్రైవ్‌కు వెళ్లా. రోడ్డుపై నిలిపి ఉంచిన లారీని మా కారు ఢీకొట్టింది' అంటూ నాని చెప్పుకొచ్చారు. ఈ ప్రమాదం గురించి నాని ఇంకా మాట్లాడుతూ.. 'ఆ ప్రమాదం జరిగినప్పుడు రాత్రి సమయం కావడంతో చీకట్లో ఏమీ కనిపించలేదు. మరోవైపు లారీ వెనుక భాగం మా కారులోకి చొచ్చుకొచ్చింది. అద్దం ముక్కలు కావడంతో నా శరీరం మొత్తం రక్తం. మేము అంబులెన్స్‌లో ఆస్పత్రికి వెళ్తున్న సమయంలో మరో యాక్సిడెంట్ మా కంట పడింది. అందులో ఒక చిన్న పాప కూడా ఉంది. ఆ పాపను ఐసీయూలో చేర్పించారు. తనకు ఎలా ఉందో తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఉదయం వరకూ ఆ రూమ్ బయటే నిల్చొని ఉన్నా. ఆ ఒక్క రాత్రి నన్నెంతో మార్చేసింది' అని నాని అన్నారు.

## 'హిట్ 3' పై రామ్ చరణ్ ప్రశంసలు !



నాని హీరోగా నటించిన రీసెంట్ మూవీ 'హిట్ 3'. బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ సొంతం చేసుకున్న ఈ చిత్రంపై రామ్‌చరణ్ ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా నాని కథల ఎంపికను ఆయన మెచ్చుకున్నారు. 'హిట్ 3' గురించి అద్భుతమైన రివ్యూలు వింటున్నా. వినూత్నమైన స్క్రిప్ట్‌లను ఎంచుకుంటూ విభిన్న జానర్స్‌లో బ్లాక్‌బస్టర్స్ అందుకుంటున్న మై డియర్ బ్రదర్ నానికి కంగ్రాట్స్. ఇలాంటి ఇంటెన్స్ చిత్రాన్ని రూపొందించిన దర్శకుడు శైలేశ్ కొలనుకు హ్యాట్సాఫ్. శ్రీనిధి శెట్టితోపాటు ఇతర చిత్రబృందానికి, నిర్మాతలకు అభినందనలు'' అని రామ్‌చరణ్ రాసుకొచ్చారు.

## నానికి గాయం.. ఫొటోలు పంచుకున్న శైలేశ్



'హిట్ 3' చిత్రీకరణలో సమయంలో నాని తలకు గాయమైనట్లు ఇప్పటికే టీమ్ పలు ఇంటర్వ్యూల్లో చెప్పింది. దీనికి సంబంధించిన విజువల్స్‌ను తాజాగా శైలేశ్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. సినిమాపై తన హీరోకు ఉన్న అభిరుచిని మెచ్చుకున్నారు. ''దీని గురించి నేను ఇప్పటికే పలు సందర్భాల్లో మాట్లాడాను. తలకు గాయమైనప్పటికీ ఏమాత్రం వెనకడుగు వేయకుండా ఆ తర్వాత షాట్ కోసం నాని టైమ్‌కు సెట్‌లోకి వచ్చారు. సినిమాపై ఆయనకు ఉన్న ప్రేమ వెలకట్టలేనిది. నీతో ఈ సినిమా చేసే అవకాశం నాకు ఇచ్చినందుకు ధన్యవాదాలు. హిట్ 3 నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది'' అని రాసుకొచ్చారు.

## రీల్

# 'విశ్వంభర' నుంచి త్రిష బర్త్ డే స్పెషల్ !




టాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియన్ మూవీల్లో ఒకటైన విశ్వంభర సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న ఈ సోషియో ఫాంటసీ చిత్రం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించింది. అయితే ఈ మూవీలో కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం త్రిష పుట్టినరోజు కావడంతో మూవీ నుంచి స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. త్రిష ఇందులో అవని అనే పాత్రలో కనిపించబోతుంది. చీరకట్టులో ఆమె మెరిసిపోతూ కనిపించారు. 'బింబిసార' ఫేమ్ వశిష్ట ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్, విక్రమ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. మరోవైపు, ఈ సినిమా విడుదల తేదీని కూడా త్వరలోనే ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ఫస్ట్ సింగిల్ విడుదలతో సినిమా ప్రమోషన్స్ ఊపందుకోగా, రిలీజ్ డేట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఎన్టీఆర్ సినిమాపై రాఘవేంద్రుడు క్లారిటీ



సీనియర్ ఎన్టీఆర్ కెరీర్‌లో అడవి రాముడు స్పెషల్ ఫిల్మ్‌గా నిలిచిపోతుంది. 1977లో విడుదలైన ఈ సినిమా అప్పట్లో ఘన విజయాన్ని సాధించింది. కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ఇటు రాఘవేంద్రరావు కెరీర్ కి చాలా ప్లస్ అయింది. అయితే, తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రాఘవేంద్రరావు ఈ సినిమా గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. ఈ సినిమాలో మొదట హీరోగా శోభన్ బాబును అనుకున్నారు అని, కానీ ఆ తర్వాత సీనియర్ ఎన్టీఆర్ గారు నటించారని, సోషల్ మీడియాలో రూమర్స్ వచ్చాయి. ఈ రూమర్స్‌పై రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. 'మొదట కూడా ఎన్టీఆర్ నే అనుకున్నాం. సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు అవాస్తవం. కాకపోతే, నేను లైన్‌గా అనుకున్న సమయంలో శోభన్ బాబు కూడా బాగుంటారు అని ఒక ఆప్షన్‌గా అనుకున్నాం. ఐతే, ప్రొడ్యూసర్ వచ్చి రామారావు గారితో సినిమా చేస్తున్నాం. దర్శకుడిగా మీ పేరు చెప్తే ఆయన వెంటనే ఓకే అన్నారు అని చెప్పారు. వెంటనే నా దగ్గర ఉన్న అడవి రాముడు లైన్ ను డెవలప్ చేశాం' అంటూ రాఘవేంద్రరావు తెలిపారు.

# రాష్ట్రంలో నాలుగు రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాగల నాలుగు రోజులు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పలు జిల్లాల్లో వడగండ్లతో కూడిన వర్షాలు, మరికొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపారు. రాబోయే మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఆదివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వడగండ్ల వానలు కురుస్తాయన్నారు. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. దాంతో ఆయా జిల్లాలకు హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని ఎల్లో హెచ్చరిక జారీ చేశామన్నారు. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని చెప్పారు. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. ఈ నెల 6, 7 తేదీల్లో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నల్లగొండ, వరంగల్ జిల్లాలతో పాటు సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు వివరించారు.

# సగరులు రాజకీయ వాటా కోసం.. భగీరథ ప్రయత్నాలు ప్రారంభించాలి

బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆచరణ సాధ్యం కానిది ప్రయత్నం చేస్తుంటే దానిని భగీరథ ప్రయత్నం అంటారని, భగీరథ వంశానికి చెందిన సగర సామాజిక వర్గం రాజకీయ వాటా కోసం ప్రయత్నాన్ని శపథం లాగ ప్రారంభించాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఆదివారం బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీ సగర భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిగా మంత్రి పొన్నం ప్రభాకర్, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత శిఖరాలకు ఎదుగగలుగుతామని, తాను విద్యార్థి సంఘ రాజకీయాల్లో కళాశాల ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికై 36 సంవత్సరాలుగా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. రాజకీయంగా ఎదగాలంటే సగరులు ఐక్యంగా ఉండాలన్నారు. భగీరథ మహర్షి స్ఫూర్తితో శాసనసభలో ఇద్దరు ఎంఎల్‌ఎలు ఉండేలా ముందుకు పోవాలన్నారు. రాజకీయాలు ఎవరి హక్కు కాదని, ఎవరి సొంతం కాదన్నారు. ఎక్కడ అవకాశాలు వస్తే అక్కడ ఉన్నత విద్యకు పోవాలన్నారు. రాజకీయంగా ఐక్యత ఉండాలని, మీకు ఐక్యత ఉంటే ప్రభుత్వమే మిమ్మల్ని పిలిచి ఏం కావాలో ఇస్తుందన్నారు. దేశానికి రోల్ మోడల్‌గా తెలంగాణ కుల గణన సర్వే చేసిందన్నారు. కిషన్ రెడ్డికి తెలవడం లేదు జనాభా లెక్కలు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉందని, కులాల లెక్కలు తేల్చే అధికారం రాష్ట్రానికి ఉందని అన్నారు. భారత్ జోడోయాత్ర సందర్భంగా సామాజిక న్యాయం జరగాలని రాహుల్ గాంధీ పిలుపునిస్తే, తెలంగాణలో తమ ప్రభుత్వం కుల గణన చేసిందన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన చేస్తామని చెప్పిందన్నారు. ఇది తెలంగాణ ప్రభుత్వ విజయం, రాహుల్ గాంధీ విజయమన్నారు. సామాజిక పరంగా రాబోయే కాలంలో తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వంలో అందరికీ న్యాయం చేయడానికి సమగ్ర ప్రణాళికతో ముందుకు పోతున్నామన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి, కంచె ఐలయ్యను కలిసి మీ సామాజిక పరిస్థితులు వివరించాలని సూచించారు. సగర సంఘానికి అండగా ఉంటానని మంత్రి హామీనిచ్చారు. భగీరథ వంశానికి చెందిన మీరు మీ ప్రయత్నాన్ని శపథం లాగ ప్రారంభించాలన్నారు. సగర సంఘం వాళ్ళకి భవిష్యత్తులో మంచి మంచి అవకాశాలు వస్తాయని, ఐక్యంగా ముందుకు పోవాలని మంత్రి పిలుపునిచ్చారు.

# హైదరాబాద్ చేరుకున్న మిస్ బ్రెజిల్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లో జరుగనున్న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొననున్న వివిధ దేశాల సుందరీమణులు ఒక్కక్కరు వస్తున్నారు. ఈ మిస్ వరల్ పోటీల కంటెస్టర్లు ఈ నెల 6వ తేదీ నుండి హైదరాబాద్‌కు చేరుకుంటారు.మిస్ బ్రెజిల్ జెస్సికా స్కెద్రియుజ్య పెడ్రోసో శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు ఆదివారం ఉదయం చేరుకున్నారు. శంషాబాద్‌కు చేరుకున్న మిస్ బ్రెజిల్‌కు తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాల ప్రకారం అధికారులు ఘన స్వాగతం పలికారు. కాగా, ఇప్పటికే మిస్ వరల్డ్ సిఇఒ, చైర్ పర్సన్ జూలియా ఈవేలిన్ మోర్లి, మిస్ కెనడా మిస్ ఎమ్మా డయన్నా క్యాథరీన్ మొర్రిసన్‌లు ఇప్పటికే చేరుకున్నారు.

# ప్రతీ లా విద్యార్థి భూ భారతి చట్టాన్ని 10 మంది రైతులకు వివరించాలి

వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు భూమి సునీల్ పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లా విద్యార్థులు భూ భారతి చట్టాన్ని అధ్యయనం చేసి రైతులకు వివరించాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమీషన్ సభ్యులు భూమి సునీల్ పిలుపునిచ్చారు. ప్రతి న్యాయ శాస్త్ర విద్యార్థి పది మంది రైతులకు భూ భారతి చట్టాన్ని వివరించ గల్గితే కనీసం రెండు లక్షల మంది అన్నదాతలకు ఈ చట్టం తెలుస్తుందన్నారు. భూభారతి చట్టం తెలిస్తే రైతులు భూమి సమస్యల పరిష్కారానికి మార్గం లభించడమే కాకుండా లా విద్యార్థులకు సైతం న్యాయశాస్త్ర నైపుణ్యం పెరుగుతుందని తెలిపారు రాష్ట్రంలో ఉన్న 25వేల మంది లా విద్యార్థులు భూభారతిని ప్రజలకు వివరించె యజ్ఞంలో భాగస్వామం కావాలని, సామాజిక ఇంజనీర్లుగా ఈ బాధ్యతను నిర్వర్తించాలని లా విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన ఫోటోలనుసోషల్ మీడియాలో పెట్టడంతో పాటు ఆ వివరాలను సెల్ నంబర్ 9000222674కు సైతంపంపించాల్సిందిగా భూమి సునీల్ సూచించారు.

# విజయోత్సవ సన్నాహం

(మొదటి పేజీ తరువాయి)

ఉండేవిధంగా ఆ మూడు రోజులూ ఉక్రేన్‌తో యుద్ధ విరామాన్ని రష్యా ఇప్పటికే ప్రకటించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆహ్వానం మేరకు జిన్‌పింగ్ ఈ వేడుకలలో పాల్గొంటున్నారని రష్యా విదేశాంగమంత్రిత్వ శాఖ ప్రకటించింది. జిన్‌పింగ్ పర్యటన సందర్భంగా రెండు దేశాలమధ్య సంబంధాలను, పరస్పర విశ్వాసాన్ని మరింత పటిష్టం చేసుకునేందుకు పలు ఒప్పందాలపై సంతకాలు చేస్తారు. అదేవిధంగా ఈ ఏడాదిలోనే చైనా కూడా జపాన్ దురాక్రమణను తిప్పికొట్టేందుకు చేసిన చైనా పీపుల్స్ వార్ 80వ విజయోత్సం కూడా ఈ ఏడాదిలోనే జరగనున్నది. ఆసియాలో జరుగుతున్న ఈ రెండు అతిపెద్ద సంఘటనలు, విజయోత్సవాలు చైనా–రష్యా సంబంధాలను మరింత పటిష్టం చేస్తాయి. ఈ రెండు ఆసియా దేశాలు ప్రపంచశాంతి రక్షణకు ఎంతగానో దోహదం చేశాయి. రెండు దేశాల చరిత్రను, రెండు దేశాలూ చేసిన త్యాగాలను ఈ సందర్భంగా గుర్తించి జ్ఞప్తికి తెచ్చుకోవాలని ఇప్పటికే జిన్‌పింగ్ – పుతిన్‌ను ఒక అంగీకారానికి వచ్చారు.

### వాషింగ్టన్‌లో రెండో ప్రపంచయుద్ధ అమరజీవుల స్మారక పాదయాత్ర

**వాషింగ్టన్ డిసి:** రెండవ ప్రపంచయుద్ధంలో రష్యా విజయానికి చిహ్నంగా అమెరికాలో అమరజీవుల స్మారకార్థం వారి బంధువులు, స్నేహితులు పాదయాత్ర నిర్వహించారు. వాషింగ్టన్ డి.సి సెంటర్‌లో అమరజీవుల స్మారక పాదయాత్ర జరిగిందని టాస్ వార్తాసంస్థ కరస్పాండెంట్ ఆదివారంనాడు చెప్పారు. పాదయాత్రలో పాల్గొన్న ప్రదర్శకులు వైట్‌హౌస్ నుండి రెండవ ప్రపంచయుద్ధ అమరవీరుల స్మారక కేంద్రం వరకూ వారి చిత్రపటాలు చేతబట్టుకుని ప్రదర్శన జరిపారు. 1945 మే 9 వ తేదీన నాజీ జర్మనీపై సోవియన్ యూనియన్ చరిత్రాత్మకమైన యుద్ధ విజయాన్ని సాధించింది. హిట్లర్ సేనలు మట్టికరిచాయి. హిట్లర్, అతడి ప్రియురాలు కూడా గుర్తుతెలియని ప్రదేశానికి వెళ్ళి ఆత్మహత్య చేసుకున్నారు. మిగిలిన నాజీ సేనలు లొంగిపోయినట్లు బెర్లిన్‌లో సంతకాలు చేసిన తర్వాత మే తొమ్మిదో తేదీని సోవియట్ యూనియన్ రెండో ప్రపంచ యుద్ధ విజయోత్సవంగా ప్రకటించింది. ఈ సందర్భంగా వాషింగ్టన్ డి.సిలో ఉన్న యుద్ధ అమరజీవుల బంధువులు, స్నేహితులు వారి చిత్రపటాటు చేతబట్టుకుని పాదయాత్ర చేశారు. నినాదాలు చేశారు. అమెరికాలో ఉన్న రష్యా దౌత్యకార్యాలయ మినిస్టస్ కౌన్సిలర్ అలెగ్జాండర్ కిమ్ కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. గత సంవత్సరాలతోపోలిస్తే ఈ సారి ఈ ప్రదర్శన చేయడానికి రాజకీయ వాతావరణం చాలా అనుకూలంగా ఉందని ఆయన అన్నారు. ఈసారి ఎలాంటి కవ్వింపు చర్యలూ లేకుండా ఈ యాత్ర జరిగిందన్నారు. ఐతే మే 8వ తేదీన కూడా రష్యా దౌత్యకార్యాలయంలో ఈ విజయోత్సవ వేడుకలు జరుగుతాయి.

# క్రీడా దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వంలో 2022 మే 18న గత ముఖ్యమంత్రి కెసిఆర్ ఉన్నత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయం అది. 19వేల గ్రామాల్లో, 5వేల వార్డుల్లో ఈ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసి ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన క్రీడా ప్రాంగణాలు క్రీడలకు ఉపయోగపడే స్థలమా? కాదా? అని కూడా చూడకుండా ఎక్కడ పడితే అక్కడ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుచేసి వాటి పేరుతో ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.4లక్షల నుంచి రూ.8 లక్షల వరకూ ఖర్చు చేసినట్లు ప్రచారం జరిగింది. ప్రతి క్రీడా ప్రాంగణంలో ఖోఖో, కబడ్డీ, లాంగ్‌జంప్ పిట్, వ్యాయామం చేసేందుకు సింగ్, డబుల్‌బార్‌లను ఏర్పాటు చేయాలని ప్రణాళికలో పేర్కొన్నారు. క్రీడా ప్రాంగణానికి చుట్టూ సుమారు 300 మొక్కలు నాటాలని అందుకోసం ఒక ప్రత్యేక అధికారిని కూడా నియమించారు. కానీ ఇవన్నీ పేపర్లకు, నిధుల దుర్వినియోగానికే ఉపయోగపడ్డాయి తప్ప క్రీడలకు, క్రీడాభివృద్ధికి ఏమాత్రం ఉపయోగపడలేదు. దీని పేరున జిల్లాల్లో, రాష్ట్రంలో కోట్లాది రూపాయలు నిధులు దుర్వినియోగం చేశారన్న విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. అడవులను మైమరిపించే చెట్లల్లోనూ, చెరువుల దగ్గర, గుట్టల దగ్గర పనికిరాని ప్రదేశాలను సూచించి కేవలం నిధులు స్వాహాచేయాలనే లక్ష్యమే ఏర్పాటుచేసినట్లు ఈ గ్రామీణ క్రీడా ప్రాంగణాల్లో కనిపిస్తుంది. గత ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణాల్లో తొంబై శాతం ప్రాంగణాల్లో ఆటలాడుతున్న పరిస్థితులు కానరావు. అంటే దీన్ని బట్టి గ్రామీణ క్రీడా ప్రాంగణాల పేరిట ఎంత స్థాయిలో దోపిడి జరిగిందో అర్థమవుతోంది. మరో ప్రక్క అదే సమయంలో పాఠశాలలకు, గ్రామీణ యువతకు క్రీడా పరికరాలు పంపిణీ చేసేందుకు కూడా ప్రభుత్వం నిర్ణయించి కొన్ని జిల్లాలకు క్రీడా పరికరాలను కూడా సరఫరా చేసినట్లు తెలిసింది. ఈ క్రీడా పరికరాలు కూడా గత ప్రభుత్వం నుంచి నేటి వరకూ పంపిణీ చేయలేదని పలు పాఠశాలలు, గ్రామీణ క్రీడాకారుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

### అంతా క్రీడా మోసం : సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి

గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ క్రీడా ప్రాంగణాల పేరిట అంతా క్రీడా మోసమే జరిగింది. కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అయిందని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి ఆరోపించారు. నిరుపయోగ ప్రాంతాల్లో క్రీడలు ఎలా ఆడతారని, ఇదంతా కేవలం నిధుల దుర్వినియోగం కోసమే పెట్టిన పథకంలా ఉందే తప్ప క్రీడాభివృద్ధికి ఉపయోగపడేది మాత్రం ఎంత మాత్రం కాదని ఆయన అన్నారు. దీనిపై ఉన్నతాధికారులతో రాష్ట్ర వ్యాప్తంగా విచారణ జరిపి తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలమీద స్వేత పత్రం విడుదల చేస్తే బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దీంట్లో ఎంత ప్రజాధనం దుర్వినియోగం అయిందో బయటపడుతుందని విజయసారథి అన్నారు.

### క్రీడా ప్రాంగణాల పేరిట నిధులు దుర్వినియోగం : ఘనపురపు అంజయ్య

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలో ఆర్భాటంగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుచేసి పెద్ద ఎత్తున ప్రజాధనం దుర్వినియోగం చేశారని మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఘనపురపు అంజయ్య తెలిపారు. జిల్లాలో ఎన్ని గ్రామీణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుచేశారు. దానికి నిధులు ఎంత విడుదలయ్యాయి, ఇలా రాష్ట్రంలో ఎన్ని కోట్లు నిధులు విడుదయ్యాయి. ఎంత దుర్వినియోగం అయ్యాయో విచారణ జరిపితే క్రీడల పేరిట దోపిడి బయటపడుతుందని ఘనపురపు అంజయ్య అన్నారు.

గ్రామీణ యువ క్రీడాకారులను క్రీడా ప్రాంగణాల పేరుతో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, క్రీడా పరికరాలు పంపిణీ చేస్తామని చెప్పి కూడా నేటి వరకూ పంపిణీ చేయలేదని, మహబూబాబాద్ జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరి ముల్లంగి ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

మహబూబాబాద్ జిల్లా మాధాపురం ఊరికి ఉత్తరాన సుదూర ప్రాంతంలో గుట్టమీద తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం బోర్డు పెట్టారని, ఇది ఎందుకూ పనికి రాలేదని, ఇప్పుడు ఉందో లేదో కూడా తెలియదని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, మాదాపురం గ్రామవాసి మద్ది వెంకటరెడ్డి అన్నారు. కేవలం నిధులు దుర్వినియోగం కోసమే ఈ క్రీడా ప్రాంగణం బోర్డు పెట్టారని, అక్కడకు వెళ్ళి ఆటలు ఆడే పరిస్తితి కానీ, క్రీడాప్రాంగణం ఉపయోగపడే పరిస్థితికానీ లేదని, క్రీడా పరికరాలు, డబుల్ బార్ వంటివి కూడా లేవని, బోర్డు, గుట్టమాత్రమే ఇక్కడ కనిపిస్తాయని వెంకటరెడ్డి ఆరోపించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com